Follow: @ANNTELUGU
03-04-2026
ANN తెలుగు
# మహా పత్రిక
శుక్రవారం, హైదరాబాద్  సంపుటి- 23  సంచిక- 96  పేజీలు-08  వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI  REGISTERED NUMBER: APTEL/2003/09316  WWW.EPAPER.MAHAADAILY.COM



## మాట తప్పలే... మడమ తిప్పలే

### ఆరు గ్యారంటీలపై అనుమానాలుంటే తెలంగాణకు రండి

అవినీతి, కుటుంబ పాలనలో కేసీఆర్.. విజయన్ కుటుంబాలు ఒకటే
యూడీఎఫ్ మేనిఫెస్టో విడుదలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**కొచ్చి, మహా :** యూడీఎఫ్ ప్రకటించిన గ్యారంటీలపై విమర్శలు చేస్తున్నవారు అవి ఎలా అమలవుతాయో తెలుసుకోవాలంటే తెలంగాణకు రావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో అమలవుతున్న పథకాలను ప్రత్యక్షంగా చూసి, తమ ట్రాక్ రికార్డు పరిశీలించుకోవచ్చని సూచించారు. కేరళ ముఖ్యమంత్రి పినరాయి విజయన్, ఆయన మంత్రులు తెలంగాణకు వస్తే తాము గ్యారంటీలు ఎలా అమలు చేస్తున్నామో ప్రత్యక్షంగా చూపుతామని సీఎం తెలిపారు.

మిగతా 2లో

టాప్ న్యూస్

### అమెరికా లొంగిపోయేదాకా

- యుద్ధం కొనసాగుతుంది
- ఇరాన్ సంచలన ప్రకటన



02

### పలికింది కిషన్ రెడ్డి

- పలికించింది రేవంత్ రెడ్డి
- బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ట్వీట్



03

### యుద్ధానికి సిద్ధమవుతున్న భారత్


- టూ ఫ్రంట్ వార్ పై ఇండియా అలర్ట్
- మోదీ అత్యున్నతస్థాయి సమావేశం



02

# మహిళా రిజర్వేషన్ బిల్లుకు జై కొట్టనున్న పార్లమెంట్

16 నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు
పునర్విభజన బిల్లుతో కొత్త రూపురేఖలు
దేశ రాజకీయాల్లో సంచలన మార్పులు
కొత్త నియోజకవర్గాలు.. మహిళా రిజర్వేషన్లు




**ఢిల్లీ, మహా:** దేశ రాజధాని హస్తిన సాక్షిగా మరో రాజకీయ భూకంపం సంభవించబోతోంది. లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచడం ద్వారా దేశ పాలనా ముఖచిత్రాన్ని మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. వాస్తవానికి గురువారంతో పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ముగియాల్సి ఉండగా, సభలను నిరవధికంగా వాయిదా వేయకుండా ఏప్రిల్ 16 నుంచి 18 వరకు ప్రత్యేకంగా నిర్వహించాలని నిర్ణయించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ మూడు రోజుల పాటు జరిగే సమావేశాల్లో కేవలం రెండు ప్రధాన అంశాలపైనే దృష్టి సారించబోతున్నారు. అందులో మొదటిది నియోజకవర్గాల పునర్విభజన కాగా, రెండవది మహిళా రిజర్వేషన్ల చట్టసవరణ బిల్లు. ఈ రెండు బిల్లులు ఆమోదం పొందితే భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో సరికొత్త అధ్యాయం మొదలవుతుంది.

**816 లోక్ సభ నియోజకవర్గాలు**

ప్రస్తుతం ఉన్న సమాచారం ప్రకారం, లోక్‌సభ స్థానాల సంఖ్యను ఇప్పుడున్న 543 నుంచి ఏకంగా 816కు పెంచే ప్రతిపాదనను ప్రభుత్వం ముందుకు తెస్తోంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రతినిధుల సంఖ్యను పెంచడం ద్వారా పాలనను ప్రజలకు మరింత చేరువ చేయాలనేది కేంద్రం వాదన. ఈ 816 స్థానాల్లో మహిళలకు పెద్దపీట వేస్తూ, అందులో 273 స్థానాలను మహిళల కోసం కేటాయించేలా చట్టసవరణ చేయనున్నారు. ఇది అమల్లోకి వస్తే ప్రపంచంలోనే మహిళలకు అత్యధిక ప్రాతినిధ్యం కల్పించిన చట్టసభగా భారత పార్లమెంట్ నిలుస్తుంది.

మిగతా 2లో



## బైబై మమత

- దీదీ గడ్డపైనే సవాల్ విసిరిన అమిత్ షా
- 15 రోజుల పాటు హోం మంత్రి క్యాంప్

**కోల్‌కతా,మహా:** పశ్చిమ బెంగాల్‌లో మరోసారి 'నందిగ్రామ్' తరహా ఉత్కంఠ భవానీపుర్‌లో కనిపిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా మార్పు కోరుకునే స్వరాలు వినిపిస్తున్నాయని, 'బైబై మమత' అనే నినాదం ఇప్పుడు బెంగాల్ ప్రతి మూలలో మార్మోగుతోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. గురువారం భవానీపుర్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి సువేందు అధికారి నామినేషన్ కార్యక్రమానికి హాజరైన అమిత్ షా, అక్కడ నిర్వహించిన భారీ బహిరంగ సభలో మమతా బెనర్జీ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు.

మిగతా 2లో

## సత్తుపల్లి సైబర్ స్కామ్

- మరో ముగ్గురు బ్యాంక్ ఉద్యోగులు అరెస్ట్
- 550 కోట్ల దోపిడీ.. అంతర్జాతీయ ముఠాతో లింకులు



**ఖమ్మం, మహా:** సత్తుపల్లి సైబర్ నేరాల కేసు రోజుకో మలుపు తిరుగుతూ ప్రజలను విస్మయానికి గురిచేస్తోంది. దాదాపు 549.95 కోట్ల రూపాయల భారీ కుంభకోణానికి సంబంధించి

మిగతా 2లో

## మూసీ పునరుజ్జీవానికి గ్రీన్ సిగ్నల్

### సర్కారుకు ఎన్‌జీటీలో భారీ ఊరట

గాంధీ సరోవర్‌పై కార్తీక్ పిటిషన్ కొట్టివేత
అనుమతుల తర్వాతే ముందడుగు.. ట్రిబ్యునల్‌కు స్పష్టం చేసిన ప్రభుత్వం



**హైదరాబాద్, మహా:** మూసీ నది పునరుజ్జీవం, సుందరీకరణ ప్రాజెక్టు విషయంలో తెలంగాణ ప్రభుత్వానికి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ)లో కీలక విజయం లభించింది. గాంధీ సరోవర్ నిర్మాణం పర్యావరణ నిబంధనలకు విరుద్ధంగా సాగుతోందంటూ బీఆర్ఎస్ నేత పటోళ్ల కార్తీక్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను చెన్నైలోని ఎన్‌జీటీ ధర్మాసనం కొట్టివేసింది.

మిగతా 2లో

## దోమతెర డ్రెస్‌తో బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రెస్ మీట్

అసెంబ్లీ ఆవరణలో ఎల్బీనగర్ ఎమ్మెల్యే సంచలనం
సర్కారుకు వినూత్నంగా నిరసన
డివిజన్ కు 10 ఫాగింగ్ మిషన్లు కేటాయించాలని డిమాండ్

02

## అమరావతికి జయము..జయము

### పార్లమెంట్ ఆమోదం.. రాష్ట్రపతికి బిల్లు

ఏపీ వ్యాప్తంగా సంబరాలకు చంద్రబాబు పిలుపు
అమరావతి పేరు వింటేనే జగన్‌కు కంపరం..
మావిగన్' పేరుపై చంద్రబాబు ఫైర్

**ఢిల్లీ, మహా:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి అత్యున్నత చట్టబద్ధత కల్పించే దిశగా కేంద్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. గురువారం రాజ్యసభలో అమరావతి చట్టబద్ధత బిల్లుకు ఎగువ సభ ఏకగ్రీవంగా ఆమోదముద్ర వేసింది. ఇప్పటికే లోక్‌సభ ఆమోదం పొందిన ఈ బిల్లు, రాజ్యసభలోనూ మూజువాణి ఓటుతో నెగ్గడంతో ఇక రాష్ట్రపతి సంతకం కోసం పంపనున్నారు.

మిగతా 3లో





## రాజ్యసభలో తెలంగాణ ఎంపీల ఫైర్

12 ఏళ్ళయినా విభజన హామీల అమలేదీ?
తెలంగాణపై ఎందుకీ వివక్ష?

**ఢిల్లీ, మహా:** రాజ్యసభలో అమరావతి చట్టబద్ధత బిల్లుపై చర్చ సమయంలో తెలంగాణ ఎంపీలు గళమెత్తారు. 12 ఏళ్లు అవుతున్నా విభజన హామీలను ఇంకా అమలు చేయలేదని వారు వాపోయారు. ఏపీకి ఇస్తున్న ప్రాధాన్యత తెలంగాణకు దక్కడం లేదని వారు కేంద్రంపై మండిపడ్డారు. విభజన సమయంలో ఇచ్చిన హామీల్లో అమలుకాని వాటిని వెంటనే అమలు

మిగతా 2లో




## బీపీసీఎల్‌కు భారీ కార్డు షాక్

- ₹5.72 కోట్ల ఇంధనం స్వాహా!
- ఇందోర్‌లో ఇంధన స్కామ్ ప్రకంపనలు
- ఏడుగురు బడా వ్యాపారులపై వేటు
- పెట్రోల్ మోసంలో విస్తుపోయే నిజాలు

**ఇందోర్, మహా:** మధ్యప్రదేశ్ రాష్ట్రం ఇందోర్‌లో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) సాక్షిగా ఒక భారీ ఇంధన కుంభకోణం వెలుగుచూసింది. కంపెనీ తన అవసరాల నిమిత్తం జారీ చేసిన స్మార్ట్ కార్డులను అడ్డం పెట్టుకుని కొందరు అక్రమార్కులు ఏకంగా కోట్ల రూపాయల విలువైన పెట్రోల్, డీజిల్‌ను స్వాహా చేశారు. షిప్రా పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ వ్యవహారంపై కంపెనీ ఉన్నతాధికారుల ఫిర్యాదుతో పోలీసులు రంగంలోకి దిగారు. సుమారు 5.72 కోట్ల రూపాయల మేర ప్రభుత్వ సంస్థకు గండి కొట్టిన ఈ ఉదంతంలో ఏడుగురు ప్రముఖ వ్యాపారవేత్తలపై కేసు నమోదు కావడంతో నగరంలో

మిగతా 3లో

## భాగ్యనగరం.. భక్తి సాగరం!

- హోరెత్తిన హనుమాన్ శోభాయాత్ర!
- మారుమోగిన రామనామం.. కాషాయ సాగరంగా మారిన వీధులు!
- గౌలిగూడ నుంచి ట్యాంక్ బండ్ దాకా.. ఆధ్యాత్మిక జడివాన!

02



# మహిళా రిజర్వేషన్ బిల్లుకు జై కొట్టనున్న పార్లమెంట్

(మొదటిపేజీ తరువాయి)

మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని మరింత బలోపేతం చేస్తూ, ఈ అదనపు స్థానాల కేటాయింపు ద్వారా సామాజిక న్యాయం చేకూరుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదేశాలతో కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యూహాత్మక చొరవ స్పష్టంగా కనిపిస్తోంది. గత వారమే ఆయన ఎన్డీయే భాగస్వామ్య పక్షాలతో పాటు వైఎస్సార్సీపీ, బీజేడీ వంటి కాంగ్రెసేతర విపక్ష నేతలతో రహస్యంగా చర్చలు జరిపినట్లు సమాచారం. ఈ చర్చల్లో అత్యధికులు సానుకూలత వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. అయితే, ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్, అలాగే పశ్చిమ బెంగాల్‌లో బలంగా ఉన్న తృణమూల్ కాంగ్రెస్ వైఖరి ఇప్పుడు కీలకంగా మారింది.

**తగ్గనున్న దక్షిణాది ప్రాధాన్యం**

నియోజకవర్గాల పెంపు వల్ల ఉత్తరాది రాష్ట్రాలకు ఎక్కువ ప్రయోజనం చేకూరి, దక్షిణాది రాష్ట్రాల ప్రాధాన్యత తగ్గుతుందనే ఆందోళనలు విపక్షాల నుంచి వ్యక్తమయ్యే అవకాశం ఉంది. ఈ సున్నితమైన అంశాన్ని ప్రభుత్వం ఏ విధంగా పరిష్కరిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియలో భాగంగా దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలకు విఘాతం కలగకుండా ఏవైనా ప్రత్యేక నిబంధనలు చేర్చుతారా అనే దానిపై సస్పెన్స్ కొనసాగుతోంది. 1971 జనాభా ప్రాతిపదికన ఉన్న ఇప్పటి స్థానాలను 2026 నాటి తాజా పరిస్థితులకు అనుగుణంగా మార్చడం ద్వారా పాలనా సౌలభ్యం పెరుగుతుందని ప్రభుత్వం గట్టిగా నమ్ముతోంది. మహిళా రిజర్వేషన్ల అమలులో ఉన్న సాంకేతిక ఇబ్బందులను తొలగించి, పెరిగిన స్థానాల్లో వారికి తగిన వాటా కల్పించడం ద్వారా మహిళా ఓటు బ్యాంకును ఆకర్షించాలని బీజేపీ చూస్తోంది. మొత్తానికి ఈ నెల 16 నుంచి జరిగే ప్రత్యేక సమావేశాలు దేశ భవిష్యత్తును నిర్ణయించేవిగా మారబోతున్నాయి. విపక్షాలను ఒప్పించి ఏకాభిప్రాయం సాధిస్తారా లేక మెజారిటీ బలంతో ఈ బిల్లులను ముందుకు తీసుకువెళ్తారా అనేది వేచి చూడాలి. విశ్లేషణ: నియోజక వర్గాల సంఖ్య 816కు పెరిగితే, పార్లమెంట్ నూతన భవనంలో సీటింగ్ సామర్థ్యం వినియోగం పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తుంది. మహిళలకు 273 సీట్లు దక్కడం అంటే పార్లమెంట్‌లో మహిళల స్వరం మరింత బలంగా వినిపించడమే. అయితే, ఈ మార్పులు రాష్ట్రాల రాజకీయాలపై ఎలాంటి ప్రభావం చూపుతాయనేది ఇప్పుడు అతిపెద్ద ప్రశ్న. తాజాగా తెలంగాణ సీఎం 50శాతం సీట్ల పెంపుతో ఉత్తర, దక్షిణాదిల మధ్య అంతరం మరింత పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

# మాట తప్పలే... మడమ తిప్పలే

(మొదటిపేజీ తరువాయి)

కేరళం శాసనసభ ఎన్నికలకు సంబంధించి యూడీఎఫ్ మేనిఫెస్టోను కొచ్చిలో గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కేరళంలో పినరాయి విజయన్ హయాం ముగిసిందని, ఇక యూడీఎఫ్ స్వర్ణయుగం మొదలవుతుందన్నారు.

**మోదీ బ్రదర్స్... పినరాయి.. కేసీఆర్‌ల మధ్య పోలికలు..**

ఈ సందర్భంగా కేరళం సీఎం పినరాయి విజయన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. దేశాన్ని, కేరళంను మోదీ బ్రదర్స్ పాలిస్తున్నారని మోదీ, విజయన్‌ను ఉద్దేశించి సీఎం వ్యాఖ్యానించారు. దేవుడి స్వంత రాష్ట్రంలో దేవుడి ఆస్తికీ రక్షణ లేదంటూ పరోక్షంగా శబరిమల బంగారం ఉదంతాన్ని సీఎం లేవనెత్తారు. కేరళంలో గత పదేళ్లుగా పినరాయి విజయన్ ప్రభుత్వం కొనసాగుతోందని, అలాగే 2014 నుంచి సుమారు పదేళ్ల పాటు కేసీఆర్ తెలంగాణను పాలించారన్నారు. పినరాయి కుటుంబ పాలన, అవినీతి, అసమర్థ పాలన విషయంలో పినరాయి విజయన్, కేసీఆర్‌ల మధ్య అనేక పోలికలు ఉన్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. 2023లో తెలంగాణలో మాదిరి మార్పే ఈసారి కేరళంలో చోటు చేసుకుంటుందని సీఎం అన్నారు. పినరాయి విజయ్ ప్రభుత్వాన్ని ప్రజలు గద్దె దింపుతారని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు. "పోమోనే విజయా" వ్యాఖ్యపై విలేకరులు అడిగిన ప్రశ్నలకు స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, విజయన్ తమకు రాజకీయ ప్రత్యర్థి అని, మోదీలా మాట్లాడటం తనకు సాధ్యం కాదని, విమర్శించకుండా ఉండటం తన స్వభావం కాదని స్పష్టం చేశారు. అవినీతి నియంత్రణ, ఆదాయానికి గండిపెట్టే అంశాలను నియంత్రించడం, కేంద్ర పథకాల గరిష్ట వినియోగం, రాష్ట్రానికి రావలసిన నిధుల సాధన తమ ప్రాధాన్య అంశాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కరుణ కాదని, అది ప్రజల హక్కు అనే విషయం ప్రజలకు తెలియజేస్తామని సీఎం తెలిపారు. యూడీఎఫ్ కార్మికుల కూటమి అని, కూటమిలో నిజాయితీగల నాయకులు ఉన్నారని సీఎం వ్యాఖ్యానించారు.



**తొలి క్యాబినెట్ నుంచే హామీల అమలు**

కేరళంలో యూడీఎఫ్ గ్యారంటీలు అమలు సాధ్యమా అని కొందరు సందేహాలు వ్యక్తం చేస్తున్నారని.. దానికి సమాధానం తెలంగాణ రాష్ట్రమే అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటి క్యాబినెట్ సమావేశం నుంచే గ్యారంటీలను విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. 25 లక్షల రైతు కుటుంబాలకు చెందిన రూ.21 వేల కోట్ల రుణాలను తాము మాఫీ చేశామని రేవంత్ రెడ్డి తెలిపారు. సాగు చేసుకునే రైతులకు ఎకరాకు రూ.12 వేలు చొప్పున ఏడాదికి రూ.18 వేల కోట్లు రైతు భరోసా కింద అందజేస్తున్నామని సీఎం తెలిపారు. 67,173 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని, వివిధ శాఖల్లో నియామకాలు పూర్తి చేయడంతో పాటు ప్రజల సమక్షంలో ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేశామని సీఎం వివరించారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని, 10 వేల బస్సులు, 50 వేల సిబ్బందితో ఉన్న ఆర్టీసీని నష్టాల నుంచి లాభాల్లోకి తీసుకువచ్చామని సీఎం తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలకు నెలకు రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకు ఆదా అవుతోందన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి, ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున మంజూరు చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. రూ. 500కే గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. మహిళలను బస్సుల యజమానులుగా, వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతున్నామని సీఎం తెలిపారు. తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ 2047 ప్రకారం తెలంగాణను 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిలపనున్నామని సీఎం ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ వృద్ధిరేటు 10.8 శాతంగా ఉందని, పన్నులు పెంచకుండానే అభివృద్ధి సాధ్యమని తాము నిరూపించామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కేపీసీసీ ప్రెసిడెంట్ సన్నీ జోసెఫ్, కేరళ సీఎల్పీ నేత వి.డి.సతీషన్, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి దీప్ దాస్ మున్షీ, యూడీఎఫ్ కన్వీనర్ ఆదూర్ ప్రకాష్, ఐయూఎంఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి పి.కె.కున్హాలికుట్టి తదితరులు పాల్గొన్నారు.

# మూసీ పునరుజ్జీవానికి గ్రీన్ సిగ్నల్

(మొదటిపేజీ తరువాయి)

కేవలం అనుమానాలతో ప్రాజెక్టులను అడ్డుకోవడం సాధ్యం కాదని, పిటిషనర్ తన వాదనలకు సంబంధించి ఎటువంటి సాంకేతిక లేదా శాస్త్రీయ ఆధారాలను సమర్పించలేదని ట్రిబ్యునల్ స్పష్టం చేసింది. ఈ తీర్పుతో మూసీ పరివాహక ప్రాంతంలో తలపెట్టిన సుందరీకరణ పనులకు ఉన్న ప్రధాన అడ్డంకి తొలగిపోయినట్లయింది.

**నివేదికల తర్వాతే అనుమతులు**

విచారణ సందర్భంగా ప్రభుత్వ తరపు న్యాయవాది తన వాదనలు వినిపిస్తూ.. ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర నివేదిక ఇంకా రూపకల్పన దశలోనే ఉందని ఎన్జీటీకి వివరించారు. గాంధీ సరోవర్ నిర్మాణానికి సంబంధించి తుది నిర్ణయం తీసుకున్న తర్వాత, చట్టబద్ధంగా అవసరమైన అన్ని పర్యావరణ అనుమతులు పొందిన పిమ్మటే పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. పర్యావరణానికి ఎటువంటి నష్టం వాటిల్లకుండా తగిన విశ్లేషణలు చేస్తామని ప్రభుత్వం పేర్కొనడంతో, ఈ దశలో పిటిషన్‌ను విచారించలేమని ట్రిబ్యునల్ అభిప్రాయపడింది. పర్యావరణ ఉల్లంఘనలు జరుగుతున్నాయని నిరూపించడంలో పిటిషనర్ విఫలమయ్యారని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

**వేగవంతం కానున్న సుందరీకరణ పనులు**

ఎన్జీటీ తీర్పుతో మూసీ సుందరీకరణ పనుల్లో వేగం పెంచేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఇప్పటికే మంచిరేవుల వద్ద ఓంకారేశ్వరాలయానికి భూమిపూజ నిర్వహించిన సర్కారు, నదిలోకి మురుగునీరు కలవకుండా అత్యాధునిక ఎస్టీపీల నిర్మాణంపై దృష్టి సారించింది. నది పరివాహక ప్రాంతాల్లో రిటైనింగ్ వాల్స్, చెక్ డ్యామ్‌ల ఏర్పాటు వంటి పనుల కోసం అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా మూసీ నదికి పునర్జీవం పోయడమే కాకుండా, నగరాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ట్రిబ్యునల్ నుంచి సానుకూల నిర్ణయం రావడంతో ఇకపై ప్రాజెక్టు పనులు పట్టాలెక్కనున్నాయి.

**బాధితులకు పునరావాసంపై సీఎం భరోసా**

మరోవైపు మూసీ ప్రాజెక్టు వల్ల ప్రభావితమయ్యే ఎవరికీ అన్యాయం జరగనివ్వబోమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే స్పష్టం చేశారు. మూసీ నది అభివృద్ధి క్రమంలో ఎవరినీ నిరాశ్రయులను చేయమని, బాధితులందరికీ మెరుగైన పునరావాసం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. వారికి నాణ్యమైన విద్య, వైద్య సదుపాయాలతో కూడిన ప్రత్యామ్నాయ నివాసాలను ఏర్పాటు చేస్తామని శాసనమండలి సాక్షిగా ప్రకటించారు. రాజకీయ ప్రయోజనాల కోసం కొందరు చేసే రెచ్చగొట్టే వ్యాఖ్యలను నమ్మవద్దని, బాధితుల పట్ల ప్రభుత్వం మానవీయ కోణంలో వ్యవహరిస్తుందని ఆయన పేర్కొన్నారు. తగిన న్యాయం చేసిన తర్వాతే ప్రాజెక్టు పనుల్లో ముందుకెళ్తామని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# దోమతెర డ్రెస్‌తో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే ప్రెస్ మీట్

**హైదరాబాద్, మహా :** హైదరాబాద్ నగరంలో దోమల జోరు ఏ స్థాయిలో ఉందో చెప్పడానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి వినూత్నమైన పంథాను ఎంచుకున్నారు. సాధారణంగా నేతలు ప్లకార్డులతోనో, నినాదాలతోనో నిరసన తెలుపుతారు. కానీ, సుధీర్ రెడ్డి మాత్రం ఏకంగా దోమతెర డ్రెస్ వేసుకొని అసెంబ్లీ మీడియా హాల్‌కు రావడంతో అందరూ ఒక్కసారిగా అవాక్కయ్యారు. ఆయన ఆహార్యం చూస్తుంటే, నగరంలో దోమల దాడి నుంచి తప్పించుకోవడానికి సామాన్యుడు యుద్ధానికి సిద్ధమవ్వాల్సిన పరిస్థితి వచ్చిందని చెప్పకనే చెప్పారు. ప్రెస్ మీట్‌లో ఆయన చేసిన వ్యాఖ్యలు మరింత ఆసక్తికరంగా ఉన్నాయి. హైదరాబాద్‌లో పరిస్థితి ఎంత దారుణంగా ఉందంటే మాట్లాడదామని నోరు తెరిస్తే చాలు, దోమలు లోపలికి దూరిపోతున్నాయంటూ ఆయన వేసిన పంచ్‌లు నవ్వులు పూయించడమే కాకుండా, క్షేత్రస్థాయిలో ఉన్న తీవ్రతను కళ్ళకు కట్టాయి. ప్రజలు ఇకపై బట్టలకు బదులు ఇలా దోమతెరలే కుట్టించుకోవాల్సిన దుస్థితికి కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని ఆయన మండిపడ్డారు. నగరం ఎదుర్కొంటున్న ఈ వింత ఇబ్బందికి పరిష్కారంగా ప్రతి డివిజన్‌కు కనీసం 10 ఫాగింగ్ మెషిన్లను కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, గల్లీ గల్లీలో దోమల నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. లేదంటే భాగ్యనగర బ్రాండ్ ఇమేజ్ కాస్తా దోమల నగరంగా మారిపోయే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు.

**ఎల్బీనగర్‌లో దోమల సమస్య మరింత ఎక్కువ**

ఎల్బీనగర్ నియోజకవర్గంలో దోమల సమస్య ప్రస్తుతం పతాక స్థాయికి చేరిందన్నారు. ముఖ్యంగా ఈ ప్రాంతంలోని మూసీ పరివాహక ప్రాంతాలైన మన్సూరాబాద్, బైరామల్ గూడ, హస్తినాపురం వంటి డివిజన్లలోని కాలనీలు దోమల దాడులతో అల్లాడిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమీపంలోని చెరువులు గుర్రపుడెక్కతో నిండిపోవడం, డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో సాయంత్రం 5 గంటలు దాటితే చాలు ఇళ్లలో ఉండలేని పరిస్థితి నెలకొంది. కాలనీ వాసులు ఎన్ని రకాల కాయిల్స్, లిక్విడ్లు వాడినా ఫలితం ఉండటం లేదని, మున్సిపల్ అధికారులు క్రమం తప్పకుండా ఫాగింగ్ చేయడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. అందుకే సుధీర్ రెడ్డి ఈ నిరసన చేపట్టారన్నారు.

# బైబై మమత

(మొదటిపేజీ తరువాయి)

మహిళల భద్రత, నిరుద్యోగం, అవినీతి వంటి అంశాల్లో తృణమూల్ కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని, ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో జనం మమతకు వీడ్కోలు పలకడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. ఈ ఎన్నికలను బీజేపీ ఎంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందో అమిత్ షా ప్రకటనతో స్పష్టమవుతోంది. తాను స్వయంగా రాష్ట్రంలో 15 రోజుల పాటు ఉండి ఎన్నికల ప్రచారాన్ని పర్యవేక్షిస్తానని, ప్రతి గ్రామానికి బీజేపీ సందేశాన్ని తీసుకెళ్తానని ఆయన ప్రకటించారు. ముఖ్యంగా భవానీపూర్ నియోజకవర్గంలో మమతా బెనర్జీకి వ్యతిరేకంగా సువేందు అధికారిని రంగంలోకి దించడం ద్వారా బీజేపీ ఒక బలమైన సంకేతాన్ని పంపింది. గత ఎన్నికల్లో నందిగ్రామ్‌లో మమతాను ఓడించిన చరిత్ర ఉన్న సువేందు, ఇప్పుడు ఆమె సొంత నియోజకవర్గంలోనే నామినేషన్ వేసి ఢీకొంటున్నారు. ఈ నామినేషన్ ర్యాలీకి అమిత్ షా హాజరుకావడం ద్వారా బీజేపీ కేడర్‌లో కొత్త ఉత్సాహం నెలకొంది. సువేందుతో పాటు స్వపన్ దాస్ గుప్తా, శత్రుంజ ఘోశ్ వంటి ప్రముఖ నేతలు కూడా తమ నామినేషన్లు దాఖలు చేయడం పోరును మరింత రసవత్తరంగా మార్చింది. మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ గత మూడేళ్లలో అవినీతిలో రికార్డులు సృష్టించిందని, సరిహద్దుల గుండా చొరబాట్లను ప్రోత్సహిస్తూ రాష్ట్ర జనాభా స్వరూపాన్ని మార్చేస్తోందని అమిత్ షా ఘాటుగా విమర్శించారు. చొరబాటుదారులను బయటకు పంపడమే తమ లక్ష్యమని, బెంగాల్ సరిహద్దులను కట్టుదిట్టం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. నరేంద్ర మోదీ నాయకత్వంలోనే బెంగాల్ భవిష్యత్తు మారుతుందని, యువతకు ఉద్యోగాలు రావాలన్నా, రాష్ట్రంలో శాంతి భద్రతలు నెలకొనాలన్నా బీజేపీ ప్రభుత్వం రావాలని పిలుపునిచ్చారు. 2021 ఎన్నికల్లో 77 స్థానాలకే పరిమితమైన బీజేపీ, ఈసారి 213 స్థానాల్లో ఉన్న తృణమూల్‌ను గద్దె దించాలనే పక్కా వ్యూహంతో అడుగులు వేస్తోంది. మరోవైపు తృణమూల్ కాంగ్రెస్ కూడా ప్రతిదాడికి సిద్ధమైంది. బీజేపీ కేంద్ర బలగాలను, ఎన్నికల సంఘాన్ని వాడుకుంటూ అధికారులను అన్యాయంగా బదిలీ చేస్తోందని మమతా బెనర్జీ ఆరోపిస్తున్నారు. రాజకీయంగా తమను ఎదుర్కోలేక దర్యాప్తు సంస్థలను ప్రయోగిస్తున్నారని ఆమె మండిపడుతున్నారు. భవానీపూర్ పోరు రాష్ట్ర రాజకీయాల్లో ఒక కీలక మలుపుగా మారబోతోందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు దశల్లో పోలింగ్ జరగనుండగా, మే 4న వెలువడే ఫలితాలు బెంగాల్ గడ్డపై 'దీదీ' చక్రం తిప్పుతుందా లేక 'కమలం' వికసిస్తుందా అన్నది తేల్చనున్నాయి. ఏదేమైనా, అమిత్ షా 15 రోజుల పాటు బెంగాల్‌లోనే తిష్టవేస్తానని చెప్పడం ప్రతిపక్షాల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. ఈ చిత్రం భవానీపూర్‌లో బీజేపీ సృష్టించిన రాజకీయ ప్రభంజనాన్ని సూచిస్తుంది. మమత గడ్డపై కమలనాథుల గర్జన బెంగాల్ ఎన్నికల వేడిని అమాంతం పెంచేసింది.

# సత్తుపల్లి సైబర్ స్కామ్

(మొదటిపేజీ తరువాయి)

పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. తాజాగా ఈ కేసులో మరో ముగ్గురు బ్యాంక్ ఉద్యోగులను పోలీసులు అరెస్టు చేయడం కలకలం రేపుతోంది. సైబర్ నేరగాళ్లకు సహకరిస్తూ, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన సీఆర్‌వోలు ఓర్సు కృప, మంద శ్రీహరిబాబు, బీఆర్‌వో జుంజునూరి రాధాకృష్ణను సత్తుపల్లి సీఐ శ్రీహరి ఆధ్వర్యంలోని బృందం అదుపులోకి తీసుకుంది. ఈ ముగ్గురిని విచారించగా విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. ఈ భారీ స్కామ్‌లో ఇప్పటికే ఉడతనేని వికాస్ చౌదరి, బొప్పన నాగప్రియతో పాటు చంద్రుగొండకు చెందిన బ్యాంక్ మేనేజర్ అఖిల్ అబ్దుల్ అరెస్టయి జైలులో ఉన్న సంగతి తెలిసిందే. అయితే విచారణ సాగుతున్న కొద్దీ ఈ నెట్వర్క్ ఎంత లోతుగా ఉందో అర్థమవుతోంది. తాజాగా పట్టుబడిన ముగ్గురు నిందితులు నిబంధనలను తుంగలో తొక్కి ప్రధాన నిందితులకు అన్ని రకాలుగా సహకరించినట్లు పోలీసులు గుర్తించారు. నిందితులందరినీ కోర్టులో హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ వసుంధర యాదవ్ అధికారికంగా వెల్లడించారు. ఈ కేసులో మొత్తం 24 మందిపై కేసులు నమోదు కాగా, పోలీసులు ఇప్పటికే మెజారిటీ నిందితులను కటకటాల్లోకి పంపారు. నిందితులంతా అంతర్జాతీయ సైబర్ నేరగాళ్లతో చేతులు కలిపి ఈ భారీ దందాకు తెరలేపినట్లు విచారణలో తేలింది. కేవలం ఒకే రకమైన మోసం కాకుండా షేర్ మార్కెట్ పెట్టుబడులు, ఆన్‌లైన్ బెట్టింగ్, మ్యాట్రిమోనీ వెబ్‌సైట్లు, రివార్డ్ పాయింట్ల ఆశ చూపడం, ఆన్‌లైన్ గేమింగ్, క్రిప్టో కరెన్సీ వంటి విభిన్న మార్గాల ద్వారా అమాయకుల సొమ్మును దోచుకున్నట్లు ఆధారాలు లభించాయి. విదేశాల్లో కూర్చున్న ప్రధాన సూత్రధారులకు ఇక్కడి బ్యాంక్ సిబ్బంది వెన్నుదన్నుగా నిలిచి ఖాతాలను తెరవడం, లావాదేవీలను సులభతరం చేయడం వంటి పనులకు పాల్పడ్డారు. రూ. 550 కోట్లు చేతులు మారాయంటే ఈ ముఠా ఎంత పక్కాగా స్కెచ్ వేసిందో అర్థం చేసుకోవచ్చు. ఖమ్మం జిల్లాలో సంచలనం రేపుతున్న ఈ కేసులో ఇంకా ఎవరెవరి ప్రమేయం ఉందనే కోణంలో పోలీసులు లోతుగా ఆరా తీస్తున్నారు. రానున్న రోజుల్లో మరిన్ని అరెస్టులు జరిగే అవకాశం ఉందని సమాచారం.

# భాగ్యనగరం.. భక్తి సాగరం!

## హోరెత్తిన హనుమాన్ శోభాయాత్ర!

**మారుమోగిన రామనామం.. కాషాయ సాగరంగా మారిన వీధులు!**

**గౌలిగూడ నుంచి ట్యాంక్ బండ్ దాకా.. ఆధ్యాత్మిక జడివాన!**



**హైదరాబాద్, మహా:** భాగ్యనగరం ఆధ్యాత్మిక చైతన్యంతో పులకించిపోయింది! హనుమాన్ జయంతిని పురస్కరించుకుని గురువారం నగరంలో నిర్వహించిన 'వీర హనుమాన్ విజయ యాత్ర' ఒక మహా ప్రవాహంలా సాగింది. నగర చరిత్రలోనే నిలిచిపోయేలా, లక్షలాది మంది భక్తుల జయజయధ్వానాల మధ్య హైదరాబాద్ వీధులన్నీ కాషాయమయంగా మారిపోయాయి. "జై శ్రీరామ్.. జై హనుమాన్" నినాదాలతో దిక్కులు పిక్కటిల్లగా, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో సుమారు 12 కిలోమీటర్ల మేర సాగిన ఈ శోభాయాత్ర భక్తులలో అపూర్వమైన ఆధ్యాత్మిక ఉత్తేజాన్ని నింపింది. గౌలిగూడ రామమందిరం నుంచి సికింద్రాబాద్ ట్యాంక్ బండ్ వరకు ఎక్కడ చూసినా జనసంద్రమే కనిపించింది. గదల ఆకారపు జెండాల రెపరెపలు, డోలు వాయిద్యాల హోరుతో నగరం ఒక సరికొత్త ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

ఈ మహా క్రతువు ఉదయం 11:30 గంటలకు గౌలిగూడలోని చారిత్రక రామమందిరం వద్ద అత్యంత భక్తిశ్రద్ధల మధ్య ప్రారంభమైంది. స్వామివారికి నిర్వహించిన ప్రత్యేక యజ్ఞం, పూర్ణాహుతి అనంతరం యాత్ర జైత్రయాత్రలా కదిలింది. పుట్లిబౌలి, కోటి, సుల్తాన్ బజార్, నారాయణగూడ మీదుగా సాగిన ఈ యాత్రలో ప్రతి అడుగులోనూ భక్తి పారవశ్యం ఉట్టిపడింది. ఆర్టీసీ క్రాస్ రోడ్స్, అశోక్ నగర్, కావడిగూడ మీదుగా ప్యారడైజ్ జంక్షన్ చేరుకునే సరికి భక్తుల సంఖ్య అదుపు చేయలేనంతగా పెరిగిపోయింది. రాత్రి 8 గంటల సమయంలో సికింద్రాబాద్‌లోని అత్యంత మహిమాన్వితమైన తాడ్‌బండ్ వీరాంజనేయ స్వామి ఆలయానికి యాత్ర చేరుకుంది. అక్కడ నిర్వహించిన మహా హారతితో ఈ ఆధ్యాత్మిక యజ్ఞం దిగ్విజయంగా ముగిసింది. ఈ వేడుకలో అగ్రనేతలు పాల్గొని భక్తుల్లో ఉత్సాహం నింపారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు నారపురాజు రామచంద్ర రావు , కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి స్వయంగా శోభాయాత్రలో పాల్గొని స్వామివారికి హారతి ఇచ్చారు. ఆయనతో పాటు బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె. లక్ష్మణ్, ఇతర హిందూ సంఘాల నేతలు ఈ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొని హిందూ ధర్మ చైతన్యాన్ని చాటారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 168కి పైగా చిన్న చిన్న ఉప యాత్రలు ప్రధాన శోభాయాత్రలో కలవడంతో భాగ్యనగరం ఒక అఖండ కాషాయ సాగరాన్ని తలపించింది. వివిధ మఠాలకు చెందిన పీఠాధిపతులు యాత్ర పొడవునా భక్తులకు తమ ఆశీర్వచనాలు అందిస్తూ ముందుకు సాగారు. ఎక్కడా చిన్న అవాంఛనీయ సంఘటన కూడా జరగకుండా నగర పోలీస్ యంత్రాంతం ఉక్కు కవచంలా నిలిచింది. నగర పోలీస్ కమిషనర్ పర్యవేక్షణలో సుమారు 3,000 మంది సిబ్బందితో అత్యంత పటిష్టమైన బందోబస్తు నిర్వహించారు. సున్నితమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలతో పాటు, హైటెక్ డ్రోన్ల ద్వారా గగనతలం నుంచి నిరంతరం నిఘా ఉంచారు. ట్రాఫిక్ పోలీసులు వ్యూహాత్మక ఆంక్షలు విధించి వాహనదారులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకున్నారు. పోలీసుల చాకచక్యం, భక్తుల క్రమశిక్షణతో హనుమాన్ విజయ యాత్ర ఒక మహా సంరంభంలా ముగియడం విశేషం. భక్తి, శక్తి మేళవించిన ఈ శోభాయాత్ర నగర ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోనుంది.

# రాజ్యసభలో తెలంగాణ ఎంపీల ఫైర్

(మొదటిపేజీ తరువాయి)


చేయాలని డిమాండ్ చేశారు. విభజన సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరి గుర్తు చేశారు. విభజన హామీలన్నీ అమలు చేయాల్సిందేనని, ఇప్పటివరకు హామీలు ఎందుకు నెరవేర్చలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయనందుకు పరిహారం ఇవ్వాలని, 12 ఏళ్ల తర్వాత ఆస్తుల పంపకం పూర్తికాలేదని తెలిపారు.

**సురేశ్‌రెడ్డి, కిషన్‌రెడ్డి మధ్య వాగ్వాదం**

రాజ్యసభలో కాళేశ్వరం అంశంపై సురేశ్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మధ్య వాగ్వాదం జరిగింది. సీఆర్ పాటిల్ వ్యాఖ్యలపై సురేశ్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. సీఆర్‌పాటిల్ తన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం గురించి కేంద్రమంత్రి ఏకపక్షంగా వ్యాఖ్యలు చేశారని సురేశ్‌రెడ్డి తెలిపారు. రూ.లక్ష కోట్లు నదిలో కొట్టుకుపోయాయని కేంద్రమంత్రి మాట్లాడారని గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంటే కేవలం ఒక్క డ్యామ్ మాత్రమే కాదని, ఒక్క డ్యామ్‌లో రెండు పిల్లర్లు మాత్రమే కుంగితే మొత్తం ప్రాజెక్టు వృథా అన్నట్లుగా మాట్లాడారని అన్నారు. తెలంగాణతో పాటు ఏపీ కూడా అభివృద్ధి చెందాలని తాము కోరుకుంటున్నామని తెలిపారు. హైదరాబాద్ నగరం ఏపీ వాళ్లతో పాటు ఎంతోమందికి గమ్యస్థానంగా ఉందని పేర్కొన్నారు. సురేశ్‌రెడ్డి వ్యాఖ్యలపై కిషన్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. మేడిగడ్డ ప్రాజెక్టు పనికిరాకుండా పోయిందని నిపుణుల కమిటీ చెప్పిందని, కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్ కుటుంబం ఒక ఏటీఎంగా వాడుకున్నదని విమర్శించారు. కనీసం ఇంజినీర్లను కూడా అడగకుండా కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టారని ఆరోపించారు. లక్ష కోట్ల ప్రజాధనాన్ని కేసీఆర్ ఇష్టమొచ్చినట్లు ఖర్చు చేశారని ఆరోపించారు. కేసీఆర్‌ను జైల్లో పెడతానన్న రేవంత్‌రెడ్డి ఇప్పటివరకు ఏం చేశారని ప్రశ్నించారు. ఆనాడు 7 మండలాల విలీనానికి కేసీఆర్ ఒప్పుకున్నారని, దస్త్రాలు పట్టుకుని సోనియాగాంధీ ఇంటికి కేసీఆర్ వెళ్లారని పేర్కొన్నారు.


# అమెరికా లొంగిపోయేదాకా యుద్ధం కొనసాగుతుంది

## ఇరాన్ సంచలన ప్రకటన



**మహా:** అమెరికా తమకు లొంగిపోయేవరకు ఈ యుద్ధం కొనసాగుతుందని ఇరాన్ హెచ్చరించింది. ఇరాన్ నౌకాదళం, వాయుసేన తీవ్రంగా బలహీనపడ్డాయని, వారి నాయకత్వాన్ని తీవ్రస్థాయిలో దెబ్బతీశామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ఇరాన్ ధీటుగా స్పందించింది. ట్రంప్ చెప్పినట్లుగా తమ సైనిక సామర్థ్యాలు దెబ్బతినలేదని పేర్కొంది. అమెరికా అవమానానికి గురై, పశ్చాత్తాపపడి, లొంగిపోయే వరకు ఈ యుద్ధం కొనసాగుతుందని స్పష్టం చేసింది. ఈ మేరకు ఇరాన్ మిలిటరీ కమాండ్ ప్రధాన కేంద్రం అధికార ప్రతినిధి ప్రకటన చేయగా, ఇరాన్ అధికారిక మీడియా ప్రసారం చేసింది. తమ దేశ సైనిక బలం, విస్తృతమైన వ్యూహాత్మక సామర్థ్యాల గురించి అమెరికా నిఘా వర్గాలకు పూర్తి సమాచారం లేదని పేర్కొంది. వ్యూహాత్మక క్షిపణులు, సుదూర లక్ష్యాలను ఛేదించే డ్రోన్లు, అత్యాధునిక గగనతల రక్షణ వ్యవస్థలు, ప్రత్యేక ఆయుధాల ఉత్పత్తి కేంద్రాలతో పాటు సైనిక మౌలిక సదుపాయాలు ధ్వంసం చేశామని ట్రంప్ చేసిన వాదనలను ఇరాన్ ఖండించింది.

# యుద్ధానికి సిద్ధమవుతున్న భారత్



**ఢిల్లీ, మహా:** ట్రంప్ ,పాకిస్థాన్ కలిసి భారత్‌ను "టూ ఫ్రంట్ వార్" (రెండు వైపుల నుండి యుద్ధం) లోకి నెట్టాలని ప్లాన్ చేస్తున్నాయి. గురువారం రాత్రి మోదీ అత్యంత కీలక సమావేశం నిర్వహించారు. అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ , పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ మధ్య ఒక రహస్య ఒప్పందం కుదిరినట్లు అనుమానిస్తున్నారు. ఇరాన్‌పై దాడులు చేయడానికి అమెరికాకు పాకిస్థాన్ తన గాలి సరిహద్దులను అప్పగించబోతోంది. ఒకవేళ పాకిస్థాన్ గడ్డ మీద నుంచి అమెరికా క్షిపణులు ఇరాన్ వైపు దూసుకెళ్తే, ఇరాన్ ఖచ్చితంగా పాకిస్థాన్‌పై యుద్ధం ప్రకటిస్తుంది. పాకిస్థాన్ ఈ పరిస్థితిని అడ్డం పెట్టుకుని భారత్‌ను యుద్ధంలోకి లాగాలని చూస్తోంది. భారత్ ఇప్పటికే గుజరాత్, రాజస్థాన్, పంజాబ్ సరిహద్దుల్లో 'నోటామ్' జారీ చేసింది. అంటే సరిహద్దుల్లో ఎప్పుడైనా ఏం జరగొచ్చనేదానికి ఇది సంకేతం.

**యుద్ధం సంభవిస్తే..**

యుద్ధం సంభవిస్తే బ్రహ్మోస్, ఎస్400, రాఫెల్ వంటి అత్యంత ఖరీదైన ఆయుధాల ప్రయోగానికి అయ్యే ఖర్చును అంచనా వేస్తున్నారు. భారత్ ఇప్పుడు పాకిస్థాన్‌ను ఎలా దెబ్బకొట్టాలి? ఎంత త్వరగా ఈ ముప్పును ముగించాలి? అనే వ్యూహంలో ఉంది. శతృవు సిద్ధంగా ఉన్నాడు, కానీ భారత వార్‌రూమ్ అంతకంటే వేగంగా పావులు కదుపుతోంది. ఈ మహాసంగ్రామంలో భారత్ పైచేయి సాధిస్తుందా? మోదీ, దోవల్ వ్యూహం పాకిస్థాన్‌ను కోలుకోలేని దెబ్బ తీయబోతోందా? అనే చర్చ ఇపుడు జరుగుతోంది.

# అమరావతికి జయము..జయము

(మొదటిపేజీ తరువాయి)



ఈ చారిత్రాత్మక బిల్లుపై చర్చ సందర్భంగా సభలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు సంబంధించిన పలు కీలక అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. ప్రధానంగా తెలంగాణ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు కాళేశ్వరంపై అధికార, ప్రతిపక్ష ఎంపీల మధ్య మాటల యుద్ధం జరగడంతో సభ ఒక్కసారిగా వేడెక్కింది. అమరావతి అభివృద్ధికి కేంద్రం కట్టుబడి ఉందని స్పష్టం చేస్తూనే, విభజన హామీల అమలుపై ఎంపీలు తమ గళాన్ని గట్టిగా వినిపించారు. మరోవైపు, అమరావతి రాజధానిగా ఉండటమే పాలనాపరంగా అన్ని వర్గాలకు సౌలభ్యంగా ఉంటుందని వైసీపీ ఎంపీ ఆర్. కృష్ణయ్య అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్ వల్ల హైదరాబాద్ ఎలా అభివృద్ధి చెందిందో మనమంతా చూశామని, అమరావతిని కూడా అదే స్థాయిలో ప్రపంచ స్థాయి రాజధానిగా తీర్చిదిద్దే సత్తా ఆయనకు ఉందని కితాబిచ్చారు. ప్రధాని మోదీ కూడా అమరావతి అభివృద్ధి చేయాలనే తపన ఉందని, ఈ బిల్లుకు అందరూ సహకరించాలని కోరారు. కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరి మాట్లాడుతూ ఏపీ, తెలంగాణ ప్రజలు కవల పిల్లల వంటివారని, ఇరు రాష్ట్రాల మధ్య ఆస్తుల పంపకంపై ఇంకా అస్పష్టత నెలకొందని పేర్కొన్నారు. తెలంగాణకు ఇచ్చిన విభజన హామీలు ఇప్పటికీ నెరవేర్చలేదని, నిర్దేశిత కాలపరిమితితో పారదర్శక విధానంలో వీటిని అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. భౌగోళికంగా కొన్ని గ్రామాలు ఏ రాష్ట్రానికి చెందిన పరిస్థితి ఏర్పడిందని, వీటిపై కేంద్రం ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.

**ఏపీ వ్యాప్తంగా సంబరాలకు సీఎం పిలుపు**

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే కీలక బిల్లు రాజ్యసభలో ఆమోదం పొందుతున్న తరుణంలో, ఈ రోజును రాష్ట్ర చరిత్రలో ఒక సువర్ణాధ్యాయంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభివర్ణించారు. గురువారం ఎన్డీయే భాగస్వామ్య పక్షాల నేతలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అందరి మద్దతో పార్లమెంటులో ఈ ప్రక్రియ పూర్తి కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో తీర్మానం పంపిన అతి తక్కువ కాలంలోనే కేంద్రం స్పందించి బిల్లును ప్రవేశపెట్టడం మన సంకల్ప బలానికి నిదర్శనమని పేర్కొన్నారు. గత ఐదేళ్లుగా రాజధాని లేని రాష్ట్రంగా అనుభవించిన అవమానాలకు నేటితో పుల్‌స్టాప్ పడిందని, ఏకైక రాజధానిగా అమరావతి సగర్వంగా నిలిచే రోజు వచ్చిందని ఆయన ఉద్ఘాటించారు. రాజధాని అమరావతి విషయంలో వైకాపా అధినేత జగన్ మోహన్ రెడ్డి అనుసరిస్తున్న వైఖరిపై ముఖ్యమంత్రి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. అమరావతిపై జగన్‌కు ఉన్న ద్వేషం ఏనాటికీ మారదని, దానికి ఆయన తాజాగా వాడిన 'మావిగిన్' అనే వింత పేరే నిదర్శనమని మండిపడ్డారు. అమరావతి అనే పేరు పలకడానికి ఇష్టపడని జగన్, గతంలోనూ సంస్థల పేర్ల నుంచి ఆ పదాన్ని తొలగించేలా వ్యవహరించారని గుర్తు చేశారు. ఐదేళ్ల పాటు రాజధాని అభివృద్ధిని అడ్డుకుని రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టారని, ఇప్పుడు మళ్ళీ తన వైఖరితో అమరావతిపై విషం కక్కుతున్నారని విమర్శించారు. జగన్ మనస్తత్వం భవిష్యత్తులోనూ మారలేదని నిన్నటి పరిణామాలతో మరోసారి స్పష్టమైందని చంద్రబాబు స్పష్టం చేశారు. రాజ్యసభలో బిల్లు ఆమోదం పొందిన సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొల్పాలని ముఖ్యమంత్రి ఎన్డీయే శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం ప్రతి గ్రామంలోనూ ప్రజలు భాగస్వాములై సంబరాలు జరుపుకోవాలని, ఇది మన రాజధాని అనే భావన ప్రతి ఒక్కరిలో కలగాలని ఆకాంక్షించారు. ఈ నేపథ్యంలోనే మధ్యాహ్నం తాను స్వయంగా రాజధాని శంకుస్థాపన జరిగిన పుణ్యస్థలం ఉద్దండరాయునిపాలెం సందర్శిస్తున్నట్లు వెల్లడించారు. దేశంలోని అన్ని పుణ్యక్షేత్రాల నుంచి తెచ్చిన మట్టి, పవిత్ర జలాలను ఉంచిన ఆ ప్రాంతం ఎంతో శక్తివంతమైనదని, అక్కడ రాజధాని సంబరాల్లో పాల్గొని రాష్ట్ర అభివృద్ధి కోసం మరోసారి సంకల్పం తీసుకుందామని పిలుపునిచ్చారు. ఈ విజయం సాధించడంలో సహకరించిన ప్రధాని మోదీ, అమిత్ షాలకు ఆంధ్రుల పక్షాన ధన్యవాదాలు తెలియజేయాలన్నారు. రాష్ట్ర పునర్విభజన సమస్యలపై సరైన అభివృద్ధిని సాధించడమే ఎన్డీయే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు. అమరావతికి చట్టబద్ధతతో పాటుగా, రాయలసీమ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు ప్రక్రియను కూడా సాధ్యమైనంత త్వరగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మంత్రి నాదెండ్ల మనోహర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ ఈ విజయాన్ని చంద్రబాబు నాయకత్వానికి దక్కిన గౌరవంగా అభివర్ణించారు. సాయంత్రం నిర్వహించే వేడుకల్లో జనసేన, బీజేపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయానికి మద్దతుగా నిలుస్తారని వారు ప్రకటించారు. ఏది ఏమైనా, పార్లమెంటు సాక్షిగా అమరావతికి లభించిన ఈ గుర్తింపు ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుకు బలమైన పునాదిగా మారుతుందని ఎన్డీయే నేతలు ధీమా వ్యక్తం చేశారు

# బీపీసీఎల్‌కు భారీ 'కార్డు' షాక్

(మొదటిపేజీ తరువాయి)

ఒక్కసారిగా కలకలం రేగింది.నిజానికి ఈ మోసం నిన్న మొన్నటిది కాదు, గత ఏడాది కాలంగా నిశ్శబ్దంగా సాగుతూనే ఉంది. కంపెనీ కార్యకలాపాలకు సంబంధించి ఇంధన కొనుగోలును సులభతరం చేసేందుకు బీపీసీఎల్ తన సిబ్బందికి రీఛార్జబుల్ కార్డులను జారీ చేసింది. అయితే ఈ కార్డులను అక్రమ మార్గంలో చేజిక్కించుకున్న నిందితులు, ఇష్టారాజ్యంగా ఇంధనాన్ని పొందుతూ కంపెనీకి పైసా కూడా చెల్లించకుండా బురిడీ కొట్టించారు. 2023 సంవత్సరంలోనే భారీ ఎత్తున ఈ కార్డులను ఉపయోగించి పెట్రోల్, డీజిల్‌ను కొనుగోలు చేసినట్లు తేలింది. ఇటీవల నిర్వహించిన సమగ్ర ఆడిట్‌లో లెక్కలన్నీ తారుమారవ్వడంతో ఈ బాగోతం బయటపడింది. దాదాపు 1,093 మంది ఈ కార్డులను అక్రమంగా వినియోగించినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడి కావడంతో అధికారులు విస్తుపోతున్నారు.విషయం తీవ్రతను గుర్తించిన పోలీసులు విశాల్ సింగ్, శశి సింగ్, దల్బీర్ సింగ్, బల్వీందర్ సింగ్, వాహిద్ ఖాన్, నరేంద్ర వాసు, బల్వీర్ సింగ్‌లపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. ఈ దారుణమైన మోసంలో కేవలం బయటి వ్యక్తులే కాకుండా, కంపెనీలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు కూడా నిందితులతో కుమ్మక్కై ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. నిత్యం కార్డులో బ్యాలెన్స్ ఉండేలా చేసేందుకు ఎటువంటి సాంకేతిక మాయాజాలం వాడారనే కోణంలో దర్యాప్తు ముమ్మరం చేశారు. పోలీస్ అవుట్‌పోస్ట్ ఇన్‌చార్జి సత్యజిత్ తోమర్ ఈ ఘటనపై స్పందిస్తూ, నిందితులందరినీ త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.ఈ కుంభకోణం కేవలం ఇందోర్‌కు మాత్రమే పరిమితం కాకుండా దేశవ్యాప్తంగా విస్తరించి ఉండవచ్చని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చమురు సంస్థలు జారీ చేసే కార్డుల భద్రతపై ఈ ఘటన పలు ప్రశ్నలను లేవనెత్తింది. ఈ మోసానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని బీపీసీఎల్ యాజమాన్యం పోలీసులను కోరింది.

## పలికింది కిషన్ రెడ్డి పలికించింది రేవంత్ రెడ్డి

**బీఆర్ఎస్ నేత హరీశ్ రావు ట్వీట్**

**హైదరాబాద్, మహా:** కేంద్రమంత్రి కిషన్ రెడ్డిపై మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం రాజ్యసభలో ఆయన పచ్చి అబద్ధాలతో, చరిత్ర వక్రీకరణలతో తన లోపలి వికృతత్వాన్ని బయటపెట్టుకున్నారని విమర్శించారు. సభలో పలికింది కిషన్ రెడ్డే కానీ పలికించింది రేవంత్ రెడ్డి అని ఆరోపించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. తెలంగాణ ఉద్యమంలో రాజీనామా చేయకుండా వెన్నుచూపి పారిపోయిన వ్యక్తి కిషన్ రెడ్డి అని ఆరోపించారు. నేడు పార్లమెంట్ సాక్షిగా మరోసారి ద్రోహానికి పాల్పడ్డారని ధ్వజమెత్తారు. ఏడు మండలాలను ఏపీకి అప్పగించాలనేది విభజన చట్టంలో ఉందని కిషన్ రెడ్డి పేర్కొనడం చారిత్రక అవాస్తవమే కాదు, తెలంగాణకు చేస్తున్న తీరని ద్రోహం కూడా అన్నారు. విభజన చట్టానికి సవరణ తెచ్చి ఆర్డినెన్స్ ద్వారా ఏడు మండలాలను ఏపీకి కట్టబెట్టింది ముమ్మాటికి బిజెపి ప్రభుత్వమే అన్నారు. ఈ పాపంలో కిషన్ రెడ్డి పాత్ర కూడా ఉందని అన్నారు. ఉద్యమం సమయంలో ముఖ్యమంత్రిగా కేసీఆర్ తెలంగాణ బంద్‌కు పిలుపునిచ్చి, మీరు చేసిన ద్రోహాన్ని ఎండగట్టిన విషయాన్ని మరిచిపోయారా అని కిషన్ రెడ్డిని ఉద్దేశించి అన్నారు. కిషన్ రెడ్డి పార్లమెంట్ సాక్షిగా చరిత్ర వక్రీకరణకు పాల్పడి ఈరోజు తెలంగాణ ఆత్మగౌరవాన్ని అవమానించారని ధ్వజమెత్తారు. ఇది వారి కుట్రకు నిదర్శనమని విమర్శించారు.


# పౌర్ణమి,హనుమాన్ జయంతి

**వేల దేవాలయాల్లో భక్తుల సందడి**



**మందమర్రి మహా :** పౌర్ణమి, హనుమాన్ జయంతి వేల మంచిర్యాల జిల్లాలోని పలు హనుమాన్, సాయిబాబా దేవాలయాల్లో భక్తుల సందడి ఎక్కువగా కనపడింది. మంచిర్యాల సాయిబాబా దేవాలయం, హనుమాన్ దేవాలయం భక్తులు ఉదయం నుండే సందడి చేశారు. అలాగే మందమర్రి మార్కెట్ అభయాంజనేయ స్వామి దేవాలయాన్ని పూలు, తోరణాలతో సర్వాంగ సుందరంగా ఆలయ కమిటీ సభ్యులు తీర్చిదిద్దారు. స్వామి దర్శనం కోసం ఉదయం నుండే మహిళా భక్తులు మంగళ హారతులతో బారులు తీరి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేత బండారి సూరిబాబు, రాణి దంపతులు నిర్వహించిన అన్నదాన ప్రసాద వితరణలో చెన్నూరు మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు, మాజీ జిల్లా జడ్పీ చైర్ పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి మండల ఎమ్మార్వో సతీష్ కుమార్ హాజరై భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సోనాల్ శర్మ మాట్లాడుతూ అంజనీ మాతకు హనుమంతుడు శివని రూపంలో దర్శనం ఇచ్చిన ఈరోజును హనుమాన్ జయంతిగా గోదావరి నది పరివాహక ప్రాంతవాసులందరూ జరుపుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు వివిధ పార్టీల నాయకులు వ్యాపారస్తులు ప్రజలు పాల్గొన్నారు. అలాగే స్థానిక పాల చెట్టు ప్రాంతంలోని పంచముఖి ఆంజనేయ స్వామి దేవాలయంలో కూడా హనుమాన్ మాల ధరించిన స్వాములు భజన, ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులను అనుగ్రహించారు.

## నేడు ఉమ్మడి జిల్లాలో మంత్రి జూపల్లి పర్యటన



**ఆదిలాబాద్ మహా :** తెలంగాణా రాష్ట్ర ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్, పర్యాటక శాఖ ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు శుక్రవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు.బేగం పేట్ ఎయిర్ పోర్ట్ నుండి హెలిక్యాప్టర్ ద్వారా ఉదయం 11 గంటలకు మంచిర్యాల జిల్లాకు చేరుకుంటారు. అక్కడ ఎంఎన్ఆర్ గార్డెన్స్ లో సమావేశం అనంతరం నేరుగా హెలీకాప్టర్ లో ఆదిలాబాద్ జిల్లాలోని బజార్ హత్నూర్ మండలం పిప్రి గ్రామంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ లో మధ్యాహ్నం 130 గంటలకల్లా దిగుతారు. పిప్రిలో ఈనెల 6న సీయం రేవంత్ రెడ్డి హాజరయ్యే సభావేదిక ప్రాంగణం వద్ద జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలిస్తారు. అక్కడినుండి 315కు బయలు దేరి 4 గంటలకు నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐటీ యూనివర్సిటీ వద్ద ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ కు చేరుకుంటారు. సీయం హాజరుకానున్న బాసర జ్ఞాన సరస్వతీ ఆలయం వద్ద ఏర్పాట్లను పరిశీలించి సాయంత్రం 5 గంటలకు హెలీక్యాప్టర్ లో బేగం పేట్ ఎయిర్ పోర్ట్ కు తిరిగి పయనమవుతారు.

# ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చెయ్యాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల మహా :** ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చెయ్యాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన గ్రామ సభ/వార్డు సభల నిర్వహణలో భాగంగా జైపూర్ మండలం టేకుమట్ల గ్రామం రైతు వేదికలో ఏర్పాటు చేసిన గ్రామసభ కార్యక్రమానికి వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సుచరిత, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణలతో కలిసి హాజరై 99 రోజుల కార్యచరణ ప్రణాళిక సంబంధిత రాష్ట్ర ముఖ్యమంత్రి సందేశాన్ని అధికారుల ద్వారా చదివి వినిపించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని, అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తూ అర్హులైన లబ్ధిదారులకు ఫలాలు అందించే విధంగా కృషి చేస్తుందని తెలిపారు. జిల్లాలోని 306 గ్రామపంచాయతీలలో గ్రామసభలు జరిగాయని, చెన్నూర్ మున్సిపల్ పరిధిలోని 18 వార్డులు, బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలోని 34 వార్డులు, మందమర్రి మున్సిపల్ పరిధిలోని 24 వార్డులు, లక్సెట్టిపేట మున్సిపల్ పరిధిలోని 15 వార్డులు, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్ లలో వార్డు సభలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించామని వివరించారు. అర్హత కలిగిన లబ్ధిదారులకు రేషన్ కార్డులు అందించి చౌక ధరల దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేయాలని ఆయన వెల్లడించారు. ఇందు కొరకు ప్రభుత్వం 13వేల కోట్ల రూపాయల ఖర్చు చేసిందని తెలిపారు. ఈ నెలలో 3 నెలల రేషన్ బియ్యం అందించే దిశగా చర్యలు చేపట్టామని తెలిపారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా ఉచిత బస్సు ప్రయాణం కల్పించి రాష్ట్ర మంతట మహిళలు ఉచితంగా ప్రయాణించేలా అవకాశం కల్పించినట్లు చెప్పారు. తద్వారా ఇప్పటి వరకు 10 వేలకోట్ల రూపాయలు మహిళలకు ఆదా అయ్యాయని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థిక అభివృద్ధి కొరకు వడ్డీలేని రుణాలు కల్పించి వివిధ వ్యాపార రంగాలలో ప్రోత్సహించడం జరుగుతుందని, రుణం పొందిన సంఘాల సభ్యులు సకాలంలో తిరిగి చెల్లించి మళ్లీ రుణం పొందవచ్చని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో స్వయం సహాయక సంఘాల మహిళలకు భాగస్వామ్యం కల్పించడం జరిగిందని, విద్యార్థుల ఏకరూప దుస్తులు తయారుచేసే అవకాశం కల్పించడం జరిగింది తెలిపారు. రైతులకు 2 లక్షల లోపు రుణమాఫీ కల్పించి రైతు భరోసా పథకం ద్వారా సంవత్సరానికి ఎకరానికి 12 వేల రూపాయలు అందించామన్నారు. మహిళలను కుటుంబ పెద్దగా గుర్తించి గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించామన్నారు. అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నట్లయితే పరిశీలించి పథకం వర్తింపజేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 2 లక్షల మంది నూతన లబ్ధిదారులకు పింఛన్లు అందించడం జరుగుతుందని, ఇందులో భాగంగా జిల్లాలోని దాదాపు 6 వేల నుండి 7 వేలమంది లబ్ధిదారులకు పింఛన్లు అందిస్తున్నామన్నారు.దివ్యాంగుల పింఛన్ల మంజూరులో దివ్యాంగత్వ పరీక్షల ధ్రువపత్రం ఆధారంగా అర్హులైన వారికి అందించడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇండ్లు పొందిన లబ్ధిదారులు నిర్ణీత విస్తీర్ణంలో ఇండ్లు నిర్మించుకునేలా అవగాహన కల్పించడం జరుగుతుందని, దాదాపు 3 వేల ఇండ్లు స్లాబ్ స్థాయికి చేరుకున్నాయని, 300 ఇండ్లు పూర్తి చేయబడి బిల్లులు మంజూరు చేయడం జరిగిందని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కొరకు ప్రభుత్వం ఇసుకను ఉచితంగా అందిస్తుందని తెలిపారు. విద్యా రంగాన్ని బలోపేతం చేసే చర్యలలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలలో అల్పాహార పథకం కొరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, మధ్యాహ్న భోజన పథకాన్ని ఇంటర్మీడియట్ వరకు అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. అర్హత గల దివ్యాంగులకు మోటారు సైకిళ్ళు అందించేందుకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. భూసారాన్నిబట్టి పంట మార్పిడి విధానాన్ని అమలుచేసి ఆర్థికంగా లబ్ధి పొందే విధంగా రైతులకు అవగాహన కల్పించి ఆయిల్ పామ్, కూరగాయలు, ఉద్యానవన పంటల సాగుపై వివరించడం జరుగుతుందని తెలిపారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికా కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి పనుల నిర్వహణ, పారిశుధ్య అమలు, త్రాగునీటి సరఫరా అంశాలపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని తెలిపారు. పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టడం ద్వారా సీజనల్, అంటు వ్యాధులను నియంత్రించి ప్రజల ఆరోగ్య ప్రమాణాలను పెంపొందించవచ్చని తెలిపారు. వేసవిలో ప్రజలకు ఎలాంటి త్రాగునీటి సమస్యలు లేకుండా చెన్నూర్ ప్రాంతంలో బోర్ వెల్స్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర ప్రజలకు కుటుంబ భీమా అమలు చేసే ఆలోచనలో ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడంలో ప్రజల భాగస్వామ్యం అవసరమని తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు తమ అనుభవాలు, అభిప్రాయాలను వెల్లడించారు. వివిధ శాఖలకు సంబంధించిన సమస్యలను ప్రజలు గ్రామసభ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## బాయిజమ్మ సాయిసేవాట్రస్ట్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం

- **బెల్లంపల్లిలోని కన్నాల పంచముఖ శివాంజనేయ విగ్రహం వద్ద ఏర్పాటు**
- **ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ కాంపల్లి శంకర్ జన్మదిన సందర్భంగా**



**బెల్లంపల్లి,మహా:** బెల్లంపల్లి పట్టణంలోని రైల్వే రడగంబాల బస్తీ కేంద్రంగా నిర్వహిస్తున్న బాయిజమ్మసాయి సనాతన ధర్మ ప్రచార ధార్మిక సంస్థ ఆధ్వర్యంలో పట్టణ శివారులోని కన్నాల పంచముఖ శివాంజనేయ విగ్రహంవద్ద గురువారం సాయంత్రం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ కాంపల్లి శంకర్ జన్మదినం సందర్భంగా ఈ చలివేంద్రాన్ని ప్రారంభించామని వ్యవస్థాపకులు డాక్టర్ శంకర్ రాజేశ్వరి తెలిపారు.దాతల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాన్ని వ్యవస్థాపకులు డాక్టర్ కాంపల్లి శంకర్ చేతుల మీదుగా ప్రారంభించారు....వరుసగా ఆరవ ఏడాది...బాయిజమ్మ సాయి సేవ ట్రస్ట్ ప్రారంభించి ఆరు సంవత్సరాలు అవుతుంది. ఈ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్య అన్నదాన కార్యక్రమాలతో పాటు ప్రతి మంగళవారం బెల్లంపల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వంద పడకల ఆసుపత్రిలో కూడా పెద్ద ఎత్తున అన్నదానం చేస్తున్నారు. అలాగే పేదలకు దుప్పట్ల పంపిణీ, స్వెట్టర్ల పంపిణీ తదితరకార్యక్రమాలనుకూడా నిర్వహిస్తున్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలలో భాగంగానే ప్రతి సంవత్సరం కన్నాల పంచముఖ శివాంజనేయ విగ్రహం వద్ద కూడా చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు.ఈ ఏడాది వేసవివచ్చిన నేపథ్యంలో జాతీయ రహదారిని అనుకుని ఉన్న కన్నాల పంచముఖ శివాంజనేయ విగ్రహం వద్ద వరుసగా ఆరవ ఏడాది కూడా చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

## కాంట్రాక్టు కార్మికులకు పీఎంపీ ఎఫ్ చిట్టీలు ఇవ్వాలి

**మందమర్రి, మహా :** సింగరేణి కాలరీస్ కంపెనీలో కాంట్రాక్టు కార్మికులుగా విధులు నిర్వహిస్తున్న వారికి సీఎం పీఎఫ్ చిట్టీలు ఇవ్వాలని సింగరేణి కాలరేజ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్టియు) బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి ఎం డి జాఫర్ డిమాండ్ చేశారు. గురువారం మందమర్రి ప్రెస్ క్లబ్ కు ఐఎఫ్టియు ఒక సుదీర్ఘ ప్రకటన విడుదల చేసింది. సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు ప్రతినెల 10వ తారీఖున జీతాలు ఇవ్వాలని జాఫర్ డిమాండ్ చేశారు. జీవితాలతో పాటు జీతం చిట్టీలు ఇవ్వాలని అలాగే ప్రతి సంవత్సరం సీఎం పిఎఫ్ చిట్టీలు ఇవ్వాలని ఆయన కోరారు. కాంట్రాక్టు కార్మికులకు జీతం చిట్టీలు, సీఎం పీఎఫ్ చిట్టీలు ఇవ్వాలని జీవో ఉన్నప్పటికీ కాంట్రాక్టర్ కానీ సింగరేణి కంపెనీ కానీ ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు తమ నెల జీవితంలో కొంత కొంతగా దాచుకున్న డబ్బులు ఎన్ని ఉన్నాయో సీఎం పిఎఫ్ లో జమ అవుతున్నాయో లేదో అని ఆందోళనలో కార్మికులు ఉన్నారని స్పష్టం చేశారు. ఈ విషయంలో సింగరేణి సంస్థ అధికారులు కల్పించుకొని కాంట్రాక్ట్ కార్మికుల అనుమానాలకు జవాబు చెప్పారని ఆయన డిమాండ్ చేశారు.

# దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ..



**మణుగూరు, మహా :** దివ్యాంగుల జీవితాన్ని సులభతరం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహిళా, శిశు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సహాయ ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు ఉపకరణాలను అందజేశారు. తెలంగాణ వికలాంగుల కోఆపరేటివ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 35 మంది దివ్యాంగులకు రూ.28.70 లక్షల విలువైన స్కూటీలు, వీల్‌చెయర్లు, ట్రైసైకిళ్లు పంపిణీ చేశారు. అదనంగా కొంతమంది లబ్ధిదారులకు స్వయం ఉపాధి కోసం ఆర్థిక సహాయ చెక్కులను కూడా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ దివ్యాంగులు స్వావలంబనతో జీవించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ తరహా కార్యక్రమాలు దివ్యాంగుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు.

## మందమర్రి ఏరియాలో పర్యావరణ పరిరక్షణ చర్యల పరిశీలన

**ఆర్కె ఓసిపి ప్రాంతంలో కేంద్ర పర్యావరణ శాఖ బృందం పర్యటన**



**మందమర్రి, మహా:** మందమర్రి ఏరియా రామకృష్ణాపూర్ ఓసి ప్రాజెక్టు ప్రాంతంలో పర్యావరణ పరిరక్షణ చర్యలను కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారుల బృందం గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించింది. కేంద్ర పర్యావరణ శాఖ సలహాదారు తరుణ్ కత్తుల, పర్యావరణ అధికారుల బృందం, సింగరేణి కార్పొరేట్ జి.ఎం (ఎన్విరాన్మెంట్) సైదులు, ఏరియా జి.ఎం రాధాకృష్ణలతో కలిసి వివిధ ప్రాంతాలను సందర్శించారు. ఆర్కె ఓసిపి గని పరిసర ప్రాంతాలను అధికారులు సందర్శించి, అక్కడ అమలు చేస్తున్న కాలుష్య నివారణ చర్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు.హరితహారం ప్లాంటేషన్: ట్రావెలింగ్ రోడ్ల వెంబడి చేపట్టిన ఎవెన్యూ ప్లాంటేషన్, గనుల పరిసరాల్లో పెరిగిన పచ్చదనాన్ని చూసి సంతృప్తి వ్యక్తం చేశారు.అనంతరం ఏరియాలో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతలు, గనుల వద్ద ఉన్న ఫిల్టర్ బెడ్లను తనిఖీ చేశారు. నీటి శుద్ధి ప్రక్రియ, పునర్వినియోగంపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం ఎస్.డి.టి.సి కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో, మందమర్రి ఏరియాలో పర్యావరణ సమతుల్యత కోసం తీసుకుంటున్న చర్యలను అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పర్యావరణ నిబంధనల అమలులో ఏరియా యాజమాన్యం ప్రదర్శిస్తున్న చొరవను కేంద్ర అధికారులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఓ. టు జి.ఎం జి.ఎల్. ప్రసాద్, ఆర్కె ఓసి మేనేజర్ పంకజ్, ఎన్విరాన్మెంట్ అధికారి వెంకటరెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ మైనారిటీ యువతకు విదేశీ ఉపాధి అవకాశాలు

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల,మహా:** తెలంగాణ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్, తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ లు సంయుక్తంగా జిల్లా నిరుద్యోగ మైనారిటీ యువతకు విదేశీ ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తున్నామని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. విదేశాలలో ఉన్న ఉద్యోగ అవకాశాలపై జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో మండల, జిల్లా స్థాయిలో అవగాహన శిబిరాలు నిర్వహించాలని, మున్సిపల్ కమిషనర్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు ఉపాధి అవకాశాల సమాచారాన్ని వాట్సాప్ గ్రూపుల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. అలాగే వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయాల నోటీసు బోర్డులలో కూడ ప్రదర్శించాలని తెలిపారు. జిల్లా పౌర సంబంధాల శాఖ ద్వారా దినపత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా ఛానల్ ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని, విద్యాసంస్థల ప్రిన్సిపాల్ లు అర్హులైన విద్యార్థులకు, నిరుద్యోగ యువతకు సమాచారం అందించాలని తెలిపారు. పలు దేశాలలో అందుబాటులో ఉన్న ఉద్యోగ అవకాశాలను అర్హత గల మైనారిటీ నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జర్మనీ దేశంలో నర్సింగ్, ఎలక్ట్రికల్/పవర్ లైన్ టెక్నీషియన్ ఉద్యోగాలు, ఖతర్ దోహా దేశంలో నర్సింగ్ ఉద్యోగాలు, గ్రీస్ దేశంలో హాస్పిటాలిటీ, హౌస్ కీపింగ్, వెయిటర్లు, బార్బెండర్లు, వంట మనుషులు, హోటల్ రిసెప్షనిస్ట్, స్పా థెరపిస్టులు, ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు, లైఫ్ గార్డులు, గార్డెనర్లు, బెల్ బాయ్స్, ఫిషర్ మెన్ ఇతర ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. ఉద్యోగాల సంబంధిత విద్యార్హతలతో పాటు అభ్యర్థుల వయసు 21 నుండి 35 సంవత్సరాల మధ్య ఉండాలని, ఇంగ్లీష్ భాష పరిజ్ఞానం కలిగి ఉండాలని, 2, 3 సంవత్సరాల అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందని, వసతి, ఆహారం, మెడికల్ ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి అర్హత గల మైనారిటీ అభ్యర్థులు తమ బయోడేటా/సివిను వెంటనే tomcomglobal@gmail.com, tomcom.resume@gmail.com లకు మెయిల్ చేయవచ్చని, ఇతర వివరాలకు 9440048590, 9440049937, 9440051452, 8919047600 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

## తిలక్ గ్రౌండ్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సేవలు వెలకట్టలేనివి

**బెల్లంపల్లి మున్సిపల్ చైర్పర్సన్ దావ స్వాతి రమేష్ బాబు.. అంబలి పంపిణీ**



**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి పట్టణంలో తిలక్ వాకర్స్ అసోసియేషన్ సామాజిక సేవలు వెలకట్టలేని వని మున్సిపల్ చైర్పర్సన్ దావ స్వాతి రమేష్ బాబు తో పాటు కమిషనర్ సంపత్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం నాడు బెల్లంపల్లి పట్టణం అంబేద్కర్ చౌరస్తా మార్కెట్ ఏరియాలో అంబలిపంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హాజరై భవన నిర్మాణ కార్మికులకు నిరుపేదలకు కూలీలకు ఆటో డ్రైవర్లకు బాటసారులకు చిరు వ్యాపారస్తులకు ఉచితంగా అంబలి పంపిణీ చేశారు. అంబలి పంపిణీ దాత గెల్లీ జయరాంయాదవ్ సహకారంతో వేసవిలో బాటసారులకు దాహార్తి తీర్చేందుకు అంబలిని సుమారు 400 మందికి పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం కార్యక్రమానికి ముఖ్య అతిథులు విచ్చేసిన మున్సిపల్ చైర్మన్ దావా స్వాతి రమేష్ బాబు , మున్సిపల్ కమిషనర్ సంపత్ రెడ్డి లను నిర్వాహకులు శాలువాలతో సన్మానించడం జరిగింది.కార్యక్రమంలోఅసోసియేషన్ అధ్యక్షులు రంగ రామన్న,ప్రధాన కార్యదర్శి కంటెవాడ నాగేష్ కుమార్,కజ్జం రమేష్, గంట శ్రీనివాస్,భోగ శ్రీనివాస్,సాదయ్య, భీముని కనకయ్య గౌడ్,రత్నం ఐలయ్య, ఎనుగు నరేష్, గూడెపు మహేందర్ రెడ్డి, మేధరబోన రాజేందర్,కందుల సత్తయ్య,నాగుల లింగయ్య,ఆకుల శ్రీనివాస్,తిప్ప శ్రీనివాస్,గురు స్వామి, తదితరులు పాల్గొన్నారు.

# విద్వేషానికి అడ్డుకట్ట... సామరస్యానికి చట్ట రక్షణ

తెలంగాణలో సామాజిక సామరస్యాన్ని కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆమోదించిన "తెలంగాణ హేట్ స్పీచ్ అండ్ హేట్ క్రైమ్ ప్రివెన్షన్ బిల్లు - 2026" విద్వేషపూరిత ప్రసంగాలు, ద్వేష ప్రచారాలకు అడ్డుకట్ట వేస్తూ సమాజంలో శాంతి భద్రతలను బలోపేతం చేసే కీలక చట్టంగా నిలవనుంది. డిజిటల్ యుగంలో పెరుగుతున్న అసత్య ప్రచారాలు, విభేదాలకు దారితీసే చర్యలను నియంత్రించేందుకు ఈ నిర్ణయం సమయోచితమని విశ్లేషకులు భావిస్తున్నారు.




ఇటీవలి కాలంలో సామాజిక మాధ్యమాలు సమాచార మార్పిడి సాధనాలుగా మాత్రమే కాకుండా భావోద్వేగాలను ప్రభావితం చేసే శక్తివంతమైన వేదికలుగా మారాయి. కానీ అదే సమయంలో అవి అపోహలు, అసత్యాలు, ద్వేషపూరిత ప్రచారాలకు కూడా మార్గం సుగమం చేస్తున్నాయి. ముఖ్యంగా మతం, కులం, జాతి ఆధారంగా విభేదాలను రెచ్చగొట్టే పోస్టులు, వీడియోలు, ప్రసంగాలు సమాజంలో శాంతి భద్రతలకు సవాలుగా మారుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం చట్టపరమైన చర్య తీసుకోవడం ప్రజాస్వామ్య బాధ్యతను ప్రతిబింబిస్తుంది.


ఈ బిల్లు ప్రధానంగా రెండు కీలక అంశాలను కవర్ చేస్తుంది.విద్వేషపూరిత ప్రసంగాల నియంత్రణ మరియు వాటి వల్ల ఉద్భవించే నేరాల నిరోధం. మతం, వర్గం, భాష, కులం ఆధారంగా ఒక వర్గంపై ద్వేషాన్ని ప్రేరేపించే ఏ రూపంలోనైనా కమ్యూనికేషన్‌ను ఈ చట్టం కట్టడి చేస్తుంది. ఇది కేవలం పబ్లిక్ మీటింగ్స్ లేదా రాజకీయ వేదికలకే పరిమితం కాకుండా, సోషల్ మీడియా, డిజిటల్ కంటెంట్, ఎలక్ట్రానిక్ మీడియాను కూడా సమగ్రంగా కవర్ చేయడం దీని ప్రత్యేకత. శిక్షా నిబంధనలు కూడా ఈ చట్టానికి గంభీరతను చాటుతోంది. మొదటి నేరానికి గరిష్ఠంగా 7 సంవత్సరాల జైలు శిక్ష,రూ.46 వేలు (సుమారు $558) పునరావృత్తి నేరాలకు మరింత కఠిన శిక్షలు, రూ.92 వేల (సుమారు $1,116) జరిమానా వంటి కఠిన చర్యలు ప్రతిపాదించబడటం ద్వారా ప్రభుత్వం స్పష్టమైన సందేశం ఇస్తోంది.రాష్ట్ర ప్రభుత్వానికి మీడియా ప్లాట్‌ఫామ్‌ల నుంచి హేట్ కంటెంట్ తొలగించే అధికారం కల్పించారు.ఈ నిబంధనలు IPC సెక్షన్ 153A, 295Aతో సమన్వయంగా పనిచేస్తూ, డిజిటల్ యుగానికి అనుగుణంగా రూపొందాయి.

ఈ చట్టం అమలుకు ఆర్థికంగా కూడా ప్రభుత్వం బలమైన పునాది వేసింది. 2026-27 బడ్జెట్‌లో(మొత్తం రూ.3.24 లక్షల కోట్లు) హోం శాఖకు గణనీయంగా రూ.11,907 కోట్లు (గతేడాది కంటే రూ.1,719 కోట్లు అధికం) నిధులు కేటాయించడం, పోలీసు వ్యవస్థను బలోపేతం చేయడం, ఫోరెన్సిక్ సదుపాయాలను విస్తరించడం వంటి చర్యలు ఈ చట్టాన్ని కాగితాలపై కాకుండా కార్యాచరణ అమలు చేసే సంకల్పాన్ని తెలియజేస్తున్నాయి. ముఖ్యంగా మెట్రో ప్రాంతంలో పోలీసు పునర్వ్యవస్థీకరణ, కొత్త కమిషనరేట్ల ఏర్పాటు వంటి చర్యలు హేట్ క్రైమ్‌లను త్వరగా గుర్తించి నిరోధించడానికి సహాయపడుతుంది.అలాగే న్యాయ వ్యవస్థను బలోపేతం చేయడానికి రూ.2,367 కోట్ల నిధులు, కోర్టుల విస్తరణ, వేగవంతమైన విచారణలపై దృష్టి పెట్టడం ద్వారా బాధితులకు త్వరిత న్యాయం అందించే దిశగా అడుగులు వేస్తున్నారు. ఇది చట్టంపై ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించడంలో కీలకంగా నిలవనుంది.SC సంక్షేమానికి రూ.11,784 కోట్లు, STకు రూ.7,937 కోట్లు, BCకు రూ.12,511 కోట్లు, మైనారిటీలకు రూ.3,769 కోట్లు కేటాయింపులు హేట్ స్పీచ్ బాధితులకు రక్షణ అందిస్తాయి. మొత్తం రెవెన్యూ వ్యయం రూ.2.34 లక్షల కోట్లు, క్యాపిటల్ వ్యయం రూ.47,267 కోట్లు - 20% పెరుగుదలతో సామాజిక సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం కల్పించింది.

అయితే, ఈ చట్టంపై వచ్చిన విమర్శలను కూడా విస్మరించలేం. భావ ప్రకటన స్వేచ్ఛకు భంగం కలిగే ప్రమాదం ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి. భారత రాజ్యాంగంలోని కల్పించిన హక్కుల నేపథ్యంలో ఈ సందేహాలు సహజమే. అయితే ప్రభుత్వం స్పష్టం చేసిన విధంగా విమర్శలను అణచివేయడం కాదు, విద్వేషాన్ని మాత్రమే అరికట్టడం ఈ చట్టం లక్ష్యం. అంటే, ప్రజాస్వామ్య చర్చలకు ఇది అడ్డంకి కాదు; కానీ సమాజంలో విభేదాలను రెచ్చగొట్టే చర్యలకు మాత్రం అడ్డుకట్ట వేస్తుంది.ఈ బిల్లు ప్రస్తుత చట్టాలతో సమన్వయంగా పనిచేస్తూ, వాటిని మరింత ఆధునిక అవసరాలకు అనుగుణంగా విస్తరించడమే లక్ష్యంగా పెట్టుకుంది. అంటే, ఇది కొత్త చట్టం అయినప్పటికీ, ఇప్పటికే ఉన్న న్యాయవ్యవస్థను బలపరచే ప్రయత్నంగా చూడాలి

సామాజిక కోణంలో చూస్తే, తెలంగాణ భిన్న సంస్కృతులు, మతాలు, భాషల సమ్మేళనం. వంటి చారిత్రక కట్టడాల చుట్టూ కనిపించే వైవిధ్యం ఈ రాష్ట్రానికి గుర్తింపు. ఇలాంటి నేపథ్యంలో విద్వేషానికి చోటు ఇవ్వడం అంటే అభివృద్ధి దిశలో వెనుకడుగు వేయడమే. అందుకే ఈ చట్టం సామాజిక ఐక్యతను కాపాడే రక్షణ కవచంలా నిలుస్తుంది.యువతలో బాధ్యతాయుతమైన డిజిటల్ ప్రవర్తన పెంపొందించడంలో కూడా ఈ చట్టం కీలక పాత్ర పోషిస్తుంది. సోషల్ మీడియా వినియోగంలో జాగ్రత్తలు పాటించాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తుంది. మాటల ప్రభావం ఎంత తీవ్రమో అర్థం చేసుకునేలా చేస్తుంది. దీర్ఘకాలంలో ఇది సహనం, పరస్పర గౌరవం పెంచే దిశగా దోహదం చేస్తుంది.అయితే, చట్టం విజయవంతం కావాలంటే అమలు అత్యంత కీలకం. పోలీసులు, దర్యాప్తు సంస్థలు, న్యాయ వ్యవస్థ అన్ని సమన్వయంతో పని చేయాలి. నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వ్యవహరించడం అత్యవసరం. ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ప్రచార కార్యక్రమాలు, డిజిటల్ లిటరసీ కార్యక్రమాలు నిర్వహించడం కూడా అవసరం. మొత్తంగా చూస్తే, "తెలంగాణ హేట్ స్పీచ్ అండ్ హేట్ క్రైమ్ ప్రివెన్షన్ బిల్లు - 2026" సమాజ శాంతి, సామరస్య పరిరక్షణకు దిశానిర్దేశక చట్టంగా అవతరిస్తోంది. ఇది కేవలం నేర నియంత్రణకు పరిమితమయ్యే ప్రయత్నం కాదు విభిన్నతలో ఐక్యతను కాపాడే సామాజిక బాధ్యతను చట్టబద్ధంగా స్థిరపరచే ప్రయత్నం. మాటల ద్వారా మొదలయ్యే విద్వేషం, చర్యల రూపంలో విస్తరించకముందే అడ్డుకోవాలన్న సంకల్పానికి ఇది ప్రతీక.అయితే, ఈ చట్టం సార్థకత దాని అమలులోనే ఉంటుంది. నిష్పక్షపాతంగా, పారదర్శకంగా అమలు జరిగితేనే ప్రజల్లో నమ్మకం పెరుగుతుంది. బాధ్యతాయుతమైన పౌర సమాజం, జాగ్రత్తగా వ్యవహరించే వ్యవస్థ కలిసొస్తేనే ఈ చట్టం తన అసలు లక్ష్యాన్ని సాధిస్తుంది.


చివరగా విమర్శ స్వేచ్ఛ ప్రజాస్వామ్యానికి ప్రాణం... కానీ విద్వేషం సమాజానికి విషం. ఆ విషాన్ని అరికట్టే ఔషధంగా ఈ చట్టం నిలవాలి. విభేదాలు కాకుండా విలువలు, ద్వేషం కాకుండా దయ, విరోధం కాకుండా సామరస్యమే నిలవాలన్న సందేశాన్ని ఇది బలంగా ప్రతిధ్వనింపజేస్తోంది. అదే నిజమైన పురోగతి, అదే శాంతి సమాజానికి పునాది.



-అమరవాజీ నాగరాజు
టీపీసీసీ చీఫ్ పీఆర్ఓ

# మీ ఆయుష్షు ఎంత?

**హైదరాబాద్:** సాధారణంగా మనం ఆరోగ్యంగా ఉన్నామా లేదా అని తెలుసుకోవడానికి బరువు చూసుకుంటాం, లేదా బిఎమ్ఐ లెక్కిస్తాం. కానీ, మీరు ఎంత కాలం జీవిస్తారో చెప్పడానికి వీటన్నింటికంటే మీ కాళ్లలోని 'పిక్కల కొలత' అత్యంత కీలకమని చెబుతున్నారు హైదరాబాద్ అపోలో ఆసుపత్రికి చెందిన ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ సుధీర్ కుమార్. సామాజిక మాధ్యమం 'ఎక్స్' (X) వేదికగా ఆయన పంచుకున్న ఈ ఆసక్తికరమైన అంశం ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఆయుష్షును అంచనా వేయడానికి బరువు కంటే శరీరంలోని కండరాల శాతమే ముఖ్యమని ఆయన విశ్లేషించారు.



**పిక్కల కొలత ఎందుకు ముఖ్యం?**

పిక్కల కండరాలను కేవలం శరీర సౌందర్యానికి సంబంధించినవిగా చూడకూడదని, అవి మన శరీరంలోని 'మెటబాలిక్ రిజర్వ్'కు నిదర్శనమని డాక్టర్ సుధీర్ కుమార్ పేర్కొన్నారు. వయసు పెరిగే కొద్దీ సహజంగానే కండరాల సాంద్రత తగ్గుతుంటుంది. దీనిని వైద్య పరిభాషలో 'సార్కోపెనియా' అంటారు.

"పిక్కల కొలత తక్కువగా ఉండటం అంటే శరీరంలో కండరాల శాతం తగ్గిందని అర్థం. దీనివల్ల రోగనిరోధక శక్తి తగ్గడమే కాకుండా, అనారోగ్యం బారిన పడినప్పుడు కోలుకోవడం కష్టమవుతుంది" అని ఆయన వివరించారు. మీరు సరైన బరువు ఉన్నప్పటికీ, మీ శరీరంలో కండరాలు తక్కువగా ఉంటే ఆరోగ్య ముప్పు పొంచి ఉన్నట్లేనని ఆయన హెచ్చరించారు.

**పరిశోధనలు ఏం చెబుతున్నాయి?**

పిక్కల కొలతకు, మరణాల రేటుకు మధ్య ఉన్న సంబంధంపై జరిగిన క్లినికల్ పరిశోధనలను డాక్టర్ సుధీర్ ప్రస్తావించారు.
పిక్కల కొలత తక్కువగా ఉన్నవారిలో మరణ ముప్పు రెండు రెట్లు ఎక్కువగా ఉంటుంది.
ప్రతి 1 సెంటీమీటర్ పిక్కల కొలత పెరిగితే, మరణించే ప్రమాదం సుమారు 5% తగ్గుతుంది.

**ప్రమాదకర స్థాయిలు**

పరిశోధనల ప్రకారం ఈ క్రింది కొలతల కంటే తక్కువగా ఉంటే ప్రమాదకరంగా భావించాలి:
పురుషులు: 34 సెంటీమీటర్ల కంటే తక్కువ
స్త్రీలు: 33 సెంటీమీటర్ల కంటే తక్కువ
ఈ కొలతల కంటే తక్కువగా ఉన్నవారిలో నీరసం, త్వరగా కింద పడిపోవడం, అకాల మరణం సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

**పరిష్కారం ఏమిటి?**

దీనికి పరిష్కారం కేవలం డైటింగ్ చేయడం కాదని, కండరాలను బలోపేతం చేసే వ్యాయామాలు చేయడమేనని డాక్టర్ సుధీర్ కుమార్ సూచించారు. "కండరమే ఆయుష్షు. మీ పిక్కల కొలత కేవలం ఒక కొలత మాత్రమే కాదు, అది మీ ఆరోగ్యాన్ని తెలిపే జీవగుర్తు. మీరు ఆరోగ్యంగా, ఎక్కువ కాలం జీవించాలంటే స్ట్రెంత్ ట్రైనింగ్ తప్పనిసరి" అని ఆయన స్పష్టం చేశారు.

## తరచుగా అడిగే ప్రశ్నలు

**1. పిక్కల కొలతను ఎలా కొలవాలి?**
సాధారణ మెజరింగ్ టేపుతో పిక్కల భాగంలో అత్యంత లావుగా ఉన్న చోట కొలత తీసుకోవాలి. నిలబడి ఉన్నప్పుడు ఈ కొలత తీసుకోవడం ఉత్తమం.

**2. బరువు తగ్గినా పిక్కల కొలత తగ్గకూడదా?**
బరువు తగ్గే క్రమంలో కొవ్వు తగ్గాలి కానీ కండరాలు తగ్గకూడదు. పిక్కల కొలత స్థిరంగా ఉంటూ బరువు తగ్గితే అది ఆరోగ్యకరమైన సంకేతం.

**3. కండరాలను పెంచడానికి ఏ వ్యాయామాలు చేయాలి?**
వెయిట్ లిఫ్టింగ్, స్క్వాట్స్, కాఫ్ రేజెస్ వంటి స్ట్రెంత్ ట్రైనింగ్ వ్యాయామాలు పిక్కల కండరాలను పెంచడానికి సహాయపడతాయి.

# అటు చట్టబద్ధం.. ఇటు పోలవరం



ఆంధ్రప్రదేశ్ కు వరుస శుభవార్తలు. ఓ వైపు ఏపీ రాజధాని అమరావతికి చట్టబద్ధత.. మరోవైపు పోలవరం నిర్మాణంలో చారిత్రక ఘట్టం. వచ్చే ఏడాది నుండి పోలవరం జీవనాడి నుండి సాగుభూములకు గలగలా గోదావరి పరుగెత్తనుంది. ఇందుకు సంబంధించిన బీజం.. విశ్వాసం గురువారమే పడింది. ఏప్రిల్ 2 ఏపీ చరిత్రలో ఓ చిరస్మరణీయం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో గురువారం మరో కీలక మైలురాయి నమోదైంది. ప్రాజెక్టు మనుగడకు అత్యంత కీలకమైన డయాఫ్రం వాల్ నిర్మాణాన్ని రికార్డు స్థాయిలో ప్రభుత్వం పూర్తి చేసింది. ఈ చారిత్రక ఘట్టంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హర్షం వ్యక్తం చేస్తూ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఆనందాన్ని పంచుకున్నారు. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలన్న ప్రభుత్వ దృఢ సంకల్పంలో ఇదొక అద్భుతమైన మలుపు అని ఆయన అభివర్ణించారు. ప్రాజెక్టు నిర్మాణంలో అత్యంత క్లిష్టమైన 1,372 మీటర్ల పొడవైన ఈ డయాఫ్రం వాల్‌ను అతి తక్కువ సమయంలోనే పూర్తి చేసిన ఇరిగేషన్ శాఖ అధికారులు, ఇంజనీర్లను ఆయన మనస్ఫూర్తిగా అభినందించారు. ఈ ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వానికి వెన్నుదన్నుగా నిలిచిన కేంద్ర సంస్థలు, పోలవరం ప్రాజెక్టు అథారిటీ ప్రతినిధులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వ వైఖరిపై ముఖ్యమంత్రి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. గత పాలకుల నిర్లక్ష్యం, అవగాహన రాహిత్యం వల్ల పాత డయాఫ్రం వాల్ తీవ్రంగా దెబ్బతిందని, దానివల్ల రాష్ట్ర ఖజానాపై రూ.1,000 కోట్ల అదనపు భారం పడిందని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. గత ఐదేళ్ల కాలంలో ప్రాజెక్టును గాలికొదిలేయడం వల్ల ఏర్పడిన అడ్డంకులను అధిగమించి, నేడు అదనపు నిధులు వెచ్చించి మరీ ఈ నిర్మాణాన్ని పూర్తి చేశామని వివరించారు. ఈ డయాఫ్రం వాల్ పూర్తి కావడంతో ప్రాజెక్టు ప్రధాన కట్టడమైన ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్ పనులకు మార్గం సుగమమైందని, ఇకపై పనులు మరింత వేగవంతంగా సాగుతాయని ఆయన స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆటంకాలు లేకుండా పనులను పరుగులు పెట్టించి ఆంధ్రుల కలల ప్రాజెక్టును సాకారం చేస్తామని భరోసా ఇచ్చారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా పోలవరం ప్రాజెక్టును నిర్ణీత గడువులోగా పూర్తి చేయడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు. ఇప్పటికే ప్రకటించిన విధంగా అన్ని పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి, 2027 గోదావరి పుష్కరాలకు ముందే పోలవరం ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తామని చారిత్రక హామీ ఇచ్చారు. పోలవరం ప్రాజెక్టు కేవలం ఆనకట్ట మాత్రమే కాదని, అది కోట్లాది మంది రైతుల ఆశ అని, రాష్ట్ర భవిష్యత్తుకు భరోసా అని ఆయన పేర్కొన్నారు. అహర్నిశలు శ్రమిస్తున్న కార్మికులు, సాంకేతిక నిపుణుల కృషి వృథా పోదని, రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ అన్నపూర్ణగా వెలుగొందడంలో పోలవరం కీలక పాత్ర పోషిస్తుందని చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విజయం ఆంధ్రులందరి విజయమని ఆయన తన సందేశంలో కొనియాడారు. ఒకేరోజు రెండు కీలకఅడుగులు ఏపీ భవిష్యత్తుకు భరోసానిచ్చాయి.



రచనలకు ఆహ్వానం
ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp: 74369 39999

# ప్రజల వద్దకే పాలన సమస్యల పరిష్కారమే మా లక్ష్యం..

- రాష్ట్రవ్యాప్తంగా 99 రోజుల 'ప్రగతి ప్రణాళిక' గ్రామసభలు ప్రారంభం..
- కొత్తగా 2 లక్షల మందికి పింఛన్లు, 4 లక్షల ఇందిరమ్మ ఇళ్లు..
- గ్రామసభలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి వెల్లడి..



**చిట్యాల, మహా :** ప్రభుత్వ అభివృద్ధి పథకాలపై అవగాహన కల్పించడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా చేపట్టిన 99 రోజుల 'ప్రజా పాలనప్రగతి ప్రణాళిక'లో భాగంగా గురువారం జిల్లాలో గ్రామసభలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామంలో సర్పంచ్ భానుశ్రీ అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభకు రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్ వేముల వీరేశం, జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డి మాట్లాడుతూ సంక్షేమ రంగంలో ప్రభుత్వం సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టిందని ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా రెండు లక్షల మందికి పింఛన్లు మంజూరు చేయాలని నిర్ణయించినట్లు ప్రకటించారు. నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 4 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని గతంలోనే బేస్మెంట్ లేదా పిల్లర్లు వేసుకుని ఆగిపోయిన వారికి కూడా ఈ విడతలో ప్రాధాన్యత ఇస్తామని వెల్లడించారు. విద్యాభివృద్ధి కోసం ప్రతి నియోజకవర్గానికి ఒక తెలంగాణ మోడల్ స్కూల్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని, ఉరుమడ్ల గ్రామంలో మౌలిక సదుపాయాలు పుష్కలంగా ఉన్నందున ఇక్కడ కూడా ఒక మోడల్ స్కూల్ మంజూరు చేయాలని ప్రభుత్వ విప్‌ను కోరారు. గ్రామంలో ఇప్పటికే రూ. 2.5 కోట్లతో చెరువు పటిష్ఠం, రూ. 2 కోట్లతో బీటీ రోడ్డు పనులు పూర్తి చేశామని మిగిలిన సమస్యలను ఏడాది కాలంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ విప్ వేముల వీరేశం మాట్లాడుతూ.. క్లిష్ట పరిస్థితుల్లోనూ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేస్తూ ప్రజల ఆర్థిక భారాన్ని తగ్గిస్తోందని పేర్కొన్నారు. ఉచిత విద్యుత్, రూ. 500లకే సిలిండర్, సన్న బియ్యం వంటి పథకాలు క్షేత్రస్థాయికి చేరుతున్నాయని, అర్హులైన వారందరికీ త్వరలోనే కొత్త రేషన్ కార్డులు అందజేస్తామని తెలిపారు. జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామాల్లో పరిశుభ్రత, ఫైళ్ల క్లియరెన్స్ పూర్తి చేశామని, పాఠశాల విద్యార్థులకు అల్పాహారం, రైతులకు రూ. 500 బోనస్ వంటి పథకాల లబ్ధిదారుల వివరాలను గ్రామసభల్లో పారదర్శకంగా చదివి వినిపిస్తున్నామని చెప్పారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అతిథులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పందిరి గీత మరియు ఇతర మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం..

- 99 రోజుల ప్రణాళికతో ప్రగతి పథంలోకి గ్రామాలు..
- రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి..






**నల్గొండ, మహా :** ప్రజల చెంతకే పాలనను తీసుకువచ్చి, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' 99 రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేస్తోందని రాష్ట్ర రోడ్డు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. గురువారం నల్గొండ జిల్లా తిప్పర్తి మండల కేంద్రంలోని రైతు వేదిక ఆవరణలో నిర్వహించిన గ్రామ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రానున్న మూడేళ్ల కాలంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు, కొత్త రేషన్ కార్డుతో పాటు సన్నబియ్యం పంపిణీ చేస్తామని గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న అన్ని సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతున్నామని ఇందులో భాగంగా నియోజకవర్గానికి ఒక మోడల్ స్కూల్‌తో పాటు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పిస్తామని అలాగే ఎల్ కేజీ నుండి ఇంటర్మీడియట్ వరకు చదివే విద్యార్థులకు ప్రతిరోజూ పౌష్టిక అల్పాహారం అందించే కొత్త పథకాన్ని అమలు చేయనున్నట్లు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమైన 'ఇందిరమ్మ జీవిత బీమా' పథకం దేశానికే ఆదర్శమని సుమారు 3 కోట్ల 15 లక్షల మందికి దీని ద్వారా రక్షణ లభిస్తుందని పేర్కొన్నారు. ప్రమాదవశాత్తు లేదా అనారోగ్యంతో ఎవరైనా మరణిస్తే ఈ బీమా పథకం ఆ కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. తిప్పర్తి మండల అభివృద్ధికి సంబంధించి మంత్రి కీలక నిర్ణయాలను ప్రకటించారు. మండల కేంద్రంలో రూ. 60 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తయిందని ప్రతీ ఎకరాకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. రూ. 6 కోట్లతో జూనియర్ కళాశాల, రూ. 26 కోట్లతో అత్యాధునిక సౌకర్యాలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) మంజూరు చేశామని వీటికి సంబంధించి త్వరలోనే జీవో రానుందని చెప్పారు. గతంలో నిధుల కొరతతో ఆగిపోయిన 100 డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణాలను నెల రోజుల్లో పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ ఇళ్ల గృహప్రవేశాల కోసం తన సొంత నిధుల నుండి ప్రతి ఇంటికి రూ. 20 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేస్తానని మంత్రి ప్రకటించడం విశేషం.మహిళా సాధికారతకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని తిప్పర్తి మండల సమాఖ్యకు రెండు బస్సులు మంజూరు చేయడంతో పాటు పెట్రోల్ బంక్ ఏర్పాటుకు హామీ ఇచ్చారు. మహిళా సంఘాల ద్వారానే మూడు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని డీఆర్డీఓను అక్కడికక్కడే ఆదేశించారు. త్వరలోనే ముఖ్యమంత్రిని తిప్పర్తికి తీసుకువచ్చి మరిన్ని అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తామని మంత్రి వెల్లడించారు.జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ మంత్రి ఆదేశాల మేరకు పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణం ద్వారా మహిళలకు పెద్ద ఎత్తున ఆర్థిక వెసులుబాటు కలిగిందని, మండలంలో కొత్తగా 352 రేషన్ కార్డులు మంజూరు చేశామని వివరించారు. కొత్తగా ఎన్నికైన సర్పంచులు, వార్డు సభ్యులు అధికారులతో సమన్వయం చేసుకుంటూ గ్రామాలను ప్రగతి పథంలో నడిపించాలని కోరారు. సర్పంచ్ రజిత అధ్యక్షతన జరిగిన ఈ సభలో అదనపు కలెక్టర్ అశోక్ రెడ్డి, జెడ్పీ సీఈఓ ప్రేమకరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## కోయగూడెం గ్రామపంచాయతీలో ఘనంగా జరిగిన గ్రామసభ

**బూర్గంపహాడ్ మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాక కోయగూడెం గ్రామపంచాయతీలో ఈరోజు గ్రామసభ నిర్వహించారు. ఈ సమావేశానికి సర్పంచ్, గ్రామ కార్యదర్శి ఆధ్వర్యం వహించగా గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.గ్రామసభలో కోయగూడెం గ్రామానికి సంబంధించిన పలు సమస్యలను గ్రామస్థులు ముందుకు తెచ్చారు. ముఖ్యంగా నాలుగో వార్డు పరిధిలో వెంకటేశ్వరరావు ఇంటి ముందు విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరారు.అలాగే గ్రామంలో కోతులు, వీధి కుక్కల బెడద తీవ్రంగా పెరిగిందని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలకు వెళ్లే పిల్లలు, వృద్ధులు, మహిళలు సహా ఎవరినైనా కోతులు, కుక్కలు దాడి చేసి గాయపరుస్తున్నాయని గ్రామసభలో వెల్లడించారు. ఈ సమస్యపై తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.ఈ సందర్భంగా తెలంగాణ రాజ్యాధికార పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉపాధ్యక్షులు కోడెబోయిన రవి పటేల్ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని గ్రామపంచాయతీ కార్యదర్శికి అందజేశారు. ఈ వినతి పత్రంలో విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయడంతో పాటు కోతులు, కుక్కల సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీఆరెస్ పార్టీ వార్డ్ సభ్యురాలు సునీత, కోయగూడెం గ్రామ ప్రజలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ప్రజలే గ్రామాభివృద్ధికి దిశానిర్దేశం..

- ప్రజా భాగస్వామ్యంతోనే సుసంపన్న గ్రామ నిర్మాణం..
- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు




**మణుగూరు, మహా :** గ్రామాభివృద్ధి ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యమని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మణుగూరు మండలం సమితి సింగారం గ్రామపంచాయతీలో గురువారం నిర్వహించిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక గ్రామసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామ ప్రజలతో స్నేహపూర్వకంగా ముచ్చటించిన ఎమ్మెల్యే, వారి సమస్యలను నేరుగా తెలుసుకుని ప్రభుత్వ పథకాల అమలు పరిస్థితిని సమీక్షించారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విన్న ఆయన, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజల అభిప్రాయాలే అభివృద్ధికి మార్గదర్శకాలని, ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు సక్రమంగా అర్హులైన ప్రతి ఒక్కరికి అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. తాగునీరు, రహదారులు, విద్యుత్, పారిశుధ్యం, విద్య, ఆరోగ్యం వంటి ప్రాథమిక అవసరాలపై ప్రత్యేక దృష్టి పెట్టి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అన్ని శాఖల అధికారులతో కలిసి ప్రజలకు వివరించిన ఎమ్మెల్యే, అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామ ప్రజలు తమ సమస్యలను దరఖాస్తుల రూపంలో ఎమ్మెల్యేకు అందజేయగా, వాటిని శ్రద్ధగా స్వీకరించిన ఆయన సంబంధిత అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సమితి సింగారం సర్పంచ్ కలబోయిన మాధవరావు, తహసీల్దార్ అద్దంకి నరేష్, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, స్పెషల్ ఆఫీసర్ స్వర్ణజ్యోతి లెనిన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అరుంధతి, సహాయ వ్యవసాయ అధికారి హారిక, ఎలక్ట్రికల్ ఏఈ లారెన్స్, ఐసీడీఎస్ సూపర్వైజర్ భద్రమ్మ, విద్యాశాఖ అధికారి నరసయ్య, సూపరింటెండెంట్ గౌరీప్రసాద్, ఏపీఎం ఐకేపీ సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పిరినాకి నవీన్, టౌన్ అధ్యక్షుడు శివ సైదులు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్, 14వ వార్డు అధ్యక్షుడు దుగ్గంపూడి ఈశ్వర్ రెడ్డి, వార్డు సభ్యులు రహీం పాషా, మాదాటి రాజేష్, కొలపిన్ని మానస, కృష్ణవేణి, శ్రీదేవి, మంగతాయారు, మహిళా అధ్యక్షురాలు కూరపాటి సౌజన్య, మాజీ సర్పంచ్ కాటబోయిన నాగేశ్వరరావు, దొబ్బల వెంకటప్పయ్య, గణేష్, సిపిఎం నాయకుడు నెల్లూరు నాగేశ్వరరావు తదితరులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా గ్రామ సభ నిర్వహణ




**బూర్గంపహాడ్ మహా:** భద్రాద్రి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక" (99 రోజుల కార్యచరణ ప్రణాళిక)లో భాగంగా బూర్గంపహాడ్ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీలో గ్రామ స్థాయి ప్రజాపాలన గ్రామసభను ఘనంగా నిర్వహించారు. ఈ గ్రామసభకు సర్పంచ్ మందా నాగరాజు అధ్యక్షత వహించారు.గ్రామపంచాయతీ పరిధిలోని పలు అభివృద్ధి అంశాలపై గ్రామసభలో చర్చ జరిగింది. ప్రభుత్వం నుంచి గ్రామానికి వచ్చే నిధులు, వాటి వినియోగంపై వివిధ శాఖల అధికారులు ప్రజల సమక్షంలో వివరాలు వెల్లడించారు. ప్రజల ముందే ఆర్థిక లావాదేవీలను పారదర్శకంగా తెలియజేయడం జరిగింది.ఈ సమావేశానికి స్పెషల్ ఆఫీసర్‌గా హాజరైన మండల తహసీల్దార్ కే ఆర్ కె వి ప్రసాద్ మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా వచ్చే ప్రతి రూపాయి నిజమైన లబ్ధిదారులకు చేరేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. ముఖ్యంగా వరదలకు గురయ్యే బూర్గంపహాడ్ మండలంలో విద్యుత్ శాఖ అధికారులు 24 గంటలు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.రైతులకు సంబంధించిన పశువుల ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని, వెటర్నరీ శాఖ సిబ్బంది గ్రామాల్లోనే సేవలు అందించాలని ఆయన తెలిపారు. ఆసుపత్రికి రాలేని పశువులకు ఇంటి వద్ద వైద్యం అందించే హెల్ప్‌లైన్ వివరాలను రైతులకు చేరవేయాలని సూచించారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషితో రాష్ట్రంలో అభివృద్ధి వేగంగా జరుగుతోందని, ప్రభుత్వ నిధులు సమృద్ధిగా వస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. ఏ సమస్య ఉన్నా తహసీల్దార్ కార్యాలయంలో తెలియజేస్తే సంబంధిత శాఖల ద్వారా పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. ఇంకా అధికారులు తమ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే జిల్లా అధికారులకు నివేదికలు పంపి చర్యలు తీసుకునేలా చూస్తామని హెచ్చరించారు. అనంతరం సర్పంచ్ మందా నాగరాజు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు పేదలకు ఎంతో మేలు చేస్తున్నాయని అన్నారు. గ్రామపంచాయతీ అన్ని శాఖల అధికారులకు ఎప్పుడూ అందుబాటులో ఉంటుందని, వారు కూడా ప్రజలకు సేవలు అందించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో అదనపు ఎస్సై నాగబిక్షం వాహనదారులు పాటించాల్సిన ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు అడ్వకేట్ భజన సతీష్ కుమార్ మాట్లాడుతూ, ప్రజాపాలన కార్యక్రమం ద్వారా గ్రామాల్లో అభివృద్ధి పండుగ వాతావరణం నెలకొన్నదని అన్నారు.

ఈ గ్రామసభలో పాలక మండలి సభ్యులు భజన నాగం, రామకృష్ణ, ఆరిఫ్, గౌతమి, వంశీ, రాశేఖర్, నస్రీన్, వీరనారాయణమ్మ, గ్రామపంచాయతీ ఈఓ బర్ల ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ మహిళా జిల్లా నాయకురాలు బర్ల నాగమణి, పార్టీ నాయకులు భజన సతీష్, భజన ప్రసాద్ తదితరులు, వివిధ శాఖల అధికారులు, గ్రామ పెద్దలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## యారం స్వరూప దశదిన కర్మలకు హాజరైన ఎమ్మెల్యే పాయం

**బూర్గంపహాడ్ మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం లక్ష్మీపురం గ్రామంలో గురువారం జరిగిన దశదినకర్మ కార్యక్రమానికి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హాజరయ్యారు.పి ఎ సి ఎస్ మాజీ సొసైటీ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి అక్క యారం స్వరూప దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొన్నా ఎమ్మెల్యే, కుటుంబ సభ్యులను పరామర్శించారు. దివంగత స్వరూప ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో కొంతసేపు గడిపిన ఎమ్మెల్యే, వారికి ధైర్యం చెప్పి, ఈ క్లిష్ట సమయంలో తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు దుగ్గంపూడి కృష్ణారెడ్డి, బూర్గంపాడు సర్పంచ్ మందా నాగరాజు, సారపాక సర్పంచ్ కిషోర్ నాయక్, స్థానిక ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.




## ముందస్తు అడ్మిషన్లు చేసే విద్యాసంస్థలపై చర్యలు తీసుకోండి

**పిడిఎస్ యూ రాష్ట్ర అధ్యక్షుడు కాపాటి పృథ్వి**

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** ముందస్తు అడ్మిషన్లు చేసే ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని పిడిఎస్ యూ రాష్ట్ర అధ్యక్షుడు కాపాటి పృథ్వి డిమాండ్ చేశారు. కొత్తగూడెం పట్టణ కేంద్రంలోని పోస్ట్ ఆఫీస్ సెంటర్లో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పిడిఎస్ యూ)భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 202627 విద్యా సంవత్సరానికి ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని నిరసన తెలియజేశారు. పోస్ట్ ఆఫీస్, బస్టాండ్ సెంటర్లో కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు ఏర్పాటు చేసిన హోర్డింగులపై ఫ్లెక్సీలు చింపి ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకుందాం అని నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృథ్వి మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్నారని, సీట్ రిజర్వేషన్ పేరుతో తల్లిదండ్రుల నుంచి అక్రమంగా రిజర్వేషన్ ఫీజులు వసూలు చేస్తున్నారని అడ్మిషన్ ఫీజులు డొనేషన్ల పేరుతో పేద విద్యార్థుల తల్లిదండ్రులను మోసగిస్తున్నారని అన్నారు. ప్రైమరీ విద్యకే 20,000 నుండి 8 లక్షల వరకు ఫీజులు వసూళ్లు చేస్తున్నారని తెలంగాణలో 11 వేల ప్రైవేట్ పాఠశాలలు ప్రతి ఏటా 20-25 శాతం ఫీజు పెంచుతున్నారనీ, ప్రైవేట్ పాఠశాలల పిల్లలపై ప్రభుత్వ పాఠశాల కంటే 9 రెట్లు అధిక కుటుంబ వ్యయం వెచ్చించాల్సి వస్తుందని అన్నారు. పేద మధ్యతరగతి కుటుంబాలు అప్పులు చేయాల్సిన పరిస్థితి దాపురిస్తుందని తిరిగి ఫీజులు చెల్లించలేక ప్రైవేట్ యాజమాన్యాల వేధింపులతో ఒత్తిడులకులోనై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. జిల్లాలో ముందస్తు అడ్మిషన్లు అదనపు ఫీజు వసూళ్ళు జరిపిన సంస్థలపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి తిరిగి ఫీజులు వసూళ్లు చేయాలన్నారు. పది, ఇంటర్మీడియట్ ఫలితాలు వెలువడే వరకు ఏ ప్రైవేట్ సంస్థ అడ్మిషన్లు ఫీజు వసూళ్ళు జరపకూడదని ప్రభుత్వ అధికారులు స్పందించి వెంటనే నిలుపుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో పిడిఎస్ యూ జిల్లా అధ్యక్షులు బుర్ర వీరభద్రం, జిల్లా కార్యదర్శి మునిగల శివ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంఘం రాష్ట్ర మహాసభలను

# జయప్రదం చేయండి




- రైతాంగాన్ని రక్షించడానికి వ్యవసాయాన్ని కాపాడటానికి ఉద్యమాలు
- సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ రావు

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వ్యవసాయ వ్యతిరేక విధానాల వలన దేశంలో రాష్ట్రంలో రైతాంగాన్ని కాపాడటానికి వ్యవసాయాన్ని రక్షించడానికి ఉద్యమాలను రూపకల్పన చేయటానికి కొత్తగూడెం కేంద్రంలో ఈనెల 23 24 25 తేదీలలో జరుగుతున్న తెలంగాణ రైతు సంఘం మూడవ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన పిలుపునిచ్చారు. గురువారం స్థానిక మంచిగంటి భవన్లో జరిగిన విలేకరుల సమావేశంలో పోతినేని సుదర్శన్ రావు పాల్గొని మాట్లాడుతూ దేశంలో 50 శాతం మందికి పైగా వ్యవసాయం పైన ఆధారపడుతున్నారని అటువంటి ప్రజానీకానికి కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో తీవ్ర అన్యాయం చేసిందని ఆయన అన్నారు. ఇటీవల బడ్జెట్ లో 53 లక్షల కోట్లతో ప్రవేశపెడితే 50 శాతం మందిగా ఉన్న వ్యవసాయానికి కేవలం లక్ష అరవై వేల కోట్లు కేటాయించడం వ్యవసాయాన్ని దెబ్బ తీయడం తప్ప మరొకటి కాదని అన్నారు. వ్యవసాయాన్ని కార్పొరేట్ చేయటం కోసం విద్యుత్ సవర్ణ చట్టం ఎరువులపై సబ్సిడీని ఎత్తివేయడం యూరియాని రైతులుకి అందుబాటులో లేకుండా చేయడం రైతులు బీమా సౌకర్యం లేకుండా చేయటం వంటివి ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని దానివల్ల రైతాంగం దివాలా తీసే పరిస్థితి వస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకి అర్థం కాని అందుబాటులో లేని యాప్లు తీసుకొచ్చి వాటి ద్వారా ఎరువుల కొనుగోలు అమ్మకాలు జరిగేటట్లు తీసుకురావడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా వ్యవసాయ నామాకరణ పేరుతో మా ప్రభుత్వం పని చేస్తుందని చెప్తున్నప్పటికీ బడ్జెట్లో కేటాయింపులు మాత్రం అరకొరగా కేటాయింపులు జరపటం రైతులను మోసం చేయడం తప్ప మరొకటి కాదని ఆయన చెప్పారు. సంవత్సరానికి రెండు విడతల్లో రైతు భరోసా ఆరు దఫాలుగా ఇవ్వాల్సిన ప్రభుత్వం కేవలం రెండు దఫాలు ఇచ్చి చేతులు దొరుకుతుందని రైతు రుణమాఫీ పేరుతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం 50 శాతం మాత్రమే అమలు చేసి పూర్తిగా అమలు చేసిన అని చెప్పేసి తప్పుడు ప్రచారం చేయడం రైతాంగాన్ని దెబ్బతీయటం తప్ప ఇంకోటి కాదని ఆయన పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో విస్తారంగా సాగవుతున్న పామాయిల్ పంటకి తగ్గట్టుగా పామాయిల్ ఫ్యాక్టరీల నిర్మాణం జరగాలని అందుకు అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీ 30 టన్నుల నుంచి 60 టన్నుల సామర్థ్యానికి పెంచాలని సూచించారు. అశ్వారావుపేట ఫ్యాక్టరీ 60 టన్నుల నుంచి ఆధునిక టెక్నాలజీతో ఆధునికరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇక్కడ శుద్ధి చేసిన ముడి ఆయిల్ని సిద్దిపేటకు తీసుకుపోకుండా ఇక్కడే రిఫైనరీ సెంటర్ ఏర్పాటు చేసి అందుబాటులో ఉంచాలని ఆయన డిమాండ్ చేశారు. పట్టా హక్కులేని సాగుదారులకి రక్షణ కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. జిల్లాలో ప్రధానంగా సీతారామ ప్రాజెక్టు ద్వారా జిల్లా వ్యవసాయ భూములకు సాగునీరు అందించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు దేశవ్యాప్తంగా వ్యవసాయానికి ఎదురవుతున్న సవాళ్లపైన మూడవ రాష్ట్ర మహాసభల్లో కూలంకషంగా చర్చించి రైతాంగ ఉద్యమాల్ని బలోపేతం చేయడానికి కార్యచరణ రూపొందించడానికి అందుకు కావలసిన తీర్మానాలు రూపకల్పనకు ఈ మహాసభలను వేదిక ఏర్పాటు చేసుకుంటున్నామని ఆయన తెలిపారు. అటువంటి ముఖ్యమైన మహాసభల జయప్రదానికి జిల్లాలో ఉన్న రైతాంగం సహకరించి జయప్రదం చేయాలని ఆయన రైతు సోదరులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహాసభ ఆహ్వాన సంఘం అధ్యక్షులు జలసూత్రం శివరాం ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు మచ్చా వెంకటేశ్వర్లు, అన్నవరపు కనకయ్య, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎలమంచి వంశీకృష్ణ, అన్నవరపు సత్యనారాయణ, రాష్ట్ర నాయకులు కున్సోత్ ధర్మ, కొండబోయిన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామసభలతో ప్రజాపాలన ప్రజలకు చేరువవుతోంది





- ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరేలా గ్రామసభల నిర్వహణ
- విద్య వైద్యం సంక్షేమంతో గ్రామాభివృద్ధి సాధ్యం
- జిల్లా కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** గ్రామ సభలతో ప్రజాపాలన ప్రజలకు చేరువవుతోందని ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరేలా గ్రామసభల నిర్వహణ ఉంటుందని విద్య వైద్యం సంక్షేమంతో గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లావ్యాప్తంగా గ్రామ, వార్డు సభలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అశ్వాపురం గ్రామ పంచాయతీ పరిధిలో నిర్వహించిన గ్రామ సభకు జిల్లా కలెక్టర్ అంకిత్ హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత రెండేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ అభివృద్ధి పథకాల ప్రగతిని ప్రజలకు వివరించడమే కాకుండా గ్రామ వార్డు స్థాయిలో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందించడమే ఈ సభల ముఖ్య ఉద్దేశమని తెలిపారు. గ్రామసభలను పండగ వాతావరణంలో నిర్వహించేలా ప్రభుత్వం యంత్రాంగానికి మార్గదర్శకాలు జారీ చేసినట్లు చెప్పారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు మరింత చేరువ చేయడానికి అవగాహన కల్పించే వేదికగా ఈ గ్రామసభలు ఉపయోగపడతాయని అన్నారు. ముఖ్యంగా రైతుభరోసా, ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్, సన్నరకం వడ్లకు బోనస్, చేయూత పింఛన్లు, గృహజ్యోతి కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, కొత్త రేషన్ కార్డుల జారీ వంటి పథకాలను గ్రామ వార్డు స్థాయిలో విస్తృతంగా వివరిస్తున్నట్లు తెలిపారు. త్వరలో ప్రభుత్వం అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, అల్పాహారం వంటి కొత్త పథకాలపై కూడా ప్రజలకు అవగాహన కల్పించినట్లు తెలిపారు.క్షేత్రస్థాయిలో పథకాల అమలులో పారదర్శకత కోసం గ్రామస్థాయిలో పెండింగ్ దరఖాస్తులు అర్హతలు అవసరమైన ధృవీకరణ పత్రాల వివరాలను తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రదర్శించాలని అధికారులను ఆదేశించారు. గ్రామాభివృద్ధికి విద్య ముఖ్యమని పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందేలా నిరంతర పర్యవేక్షణ అవసరమని తెలిపారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలన్నారు. అలాగే 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు గ్రామసభల్లో పాల్గొని సమస్యలను చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. వైద్య సేవల ప్రాముఖ్యతను గుర్తు చేస్తూ వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన ఓఆర్ఎస్ ప్యాకెట్లు అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బానోత్ సవర్లాల్, ఉప సర్పంచ్ తుళ్లూరు ప్రకాష్, మండల ప్రత్యేక అధికారి ఇంతియాజ్ ఖాన్, ఎంఈఓ వీరాస్వామి, తాసిల్దార్, అన్ని శాఖల అధికారులు ప్రజలు పాల్గొన్నారు.

## ఇరాన్ పై అమెరికా ఇజ్రాయిల్ దురాక్రమణ దాడిని నిలిపివేయాలి

- 8న కొత్తగూడెంలో శాంతి ర్యాలీ
- రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిలపక్షం నాయకులు

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** ఇరాన్ పై అమెరికా ఇజ్రాయిల్ దేశాలు దురాక్రమణ పూరిత క్షిపణి దాడికి దిగగా అది నేడు పశ్చిమాషియాలో మినీ యుద్ధంగా మారిపోయిందని తక్షణమే దురాక్రమణ దాడిని నిలిపివేయాలని అఖిలపక్షం నాయకులు డిమాండ్ చేశారు. కొత్తగూడెం రైటర్ బస్తి ఐ ఎఫ్ టి యు కార్యాలయంలో గురువారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు, మైనార్టీ సంఘం జిల్లా అధ్యక్షులు నయీం ఖురేషి, కాంగ్రెస్ టీపీసీసీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ బాలసౌరి, టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు దేవదానం, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా నాయకులు బుర్ర వీరభద్రం, బి ఎస్ పి పార్లమెంటరీ ఇంచార్జి తాండ్ర వెంకటేశ్వర్లు, బీఎస్పీ జిల్లా నాయకులు కురుమల శంకర్, తెలుగుదేశం జిల్లా నాయకులు కోటయ్య,ఐ ఎఫ్ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి జె.సీతారామయ్యలు ప్రసంగిస్తూ ఇరాన్ పై బాంబుల దాడిని అమెరికా ఇజ్రాయిల్ కొనసాగించడం సహించరానిదని మండిపడ్డారు. దాడి వల్ల ప్రపంచ దేశాలకు ఆయిల్ సరఫరా సరిగా లేకపోవడంతో పేద మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వారన్నారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా ఐక్యరాజ్యసమితి తీర్మానం లేకుండా స్వతంత్ర సార్వభౌమత్వం కలిగినటువంటి దేశాలపై అమెరికా తన ఆధిపత్యం కోసం దాడులు నిర్వహిస్తుందని వారు అన్నారు. ఈ దాడుల వలన రేపు ప్రపంచంలో విపరీతమైన ధరలు పెరిగిపోయి ప్రజలు జీవించలేరని ఇలాంటివి దాడులు ప్రజలు ప్రజాస్వామ్యవాదులు మేధావులు ఖండించాలని పిలుపునిచ్చారు. ఇరాన్ పై అమెరికా ఇజ్రాయిల్ కలిసి చేస్తున్న దాడిని వ్యతిరేకిస్తూ ఏప్రిల్ 8న కొత్తగూడెంలో అఖిలపక్షం ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహిస్తుందని దీనికి ప్రజలు, ప్రజాస్వామికవాదులు, విద్యాసంస్థలు, యువకులు, వివిధ సంఘాలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఐఎఫ్టియు జిల్లా సహాయ కార్యదర్శి ఎన్ సంజీవ్, కోశాధికారి మల్లికార్జునరావు, పిడిఎస్ యు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు డమరుకేష్, రోహిత్, వినయ్, జీవన్, సురేందర్ ఇతర ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## పేద కుటుంబాల ఉపాధికి
# ఊతమిచ్చిన ఉచిత ప్రయాణం

- శ్రమశక్తికి వెన్నుదన్నుగా నిలుస్తున్న ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం
- ఉచిత ప్రయాణంతో మహిళలకు రూ.10,000 కోట్ల ఆదా
- ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందే విధంగా ప్రభుత్వం కృషి చేయాలి
- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** మహిళా సాధికారతకు చేదోడుగా ఉచిత బస్సు సౌకర్యం ఎంతగానో తోడ్పడుతుందని పేద కుటుంబాల ఆర్థికాభివృద్ధికి బాటలు వేసిందని కొత్తగూడెం శాసన సభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఎన్నికల హామీ ఆరుగ్యారంటీల్లో భాగంగా మహాలక్ష్మీ పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన నేపథ్యంలో గురువారం కొత్తగూడెం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో '99 రోజుల ప్రజాపాలనప్రగతి ప్రణాళిక' సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం మహిళల ఆర్థిక స్వాలంబన దిశగా గొప్ప అడుగు అని నిత్యం కష్టపడే శ్రమశక్తికి ఇది వెన్నుదన్నుగా నిలుస్తుందని ఆయన కొనియాడారు. ఈ సౌకర్యం వల్ల మహిళలు తమ పనుల నిమిత్తం ప్రయాణించేటప్పుడు ఛార్జీల భారం తగ్గి ఆ మొత్తాన్ని కుటుంబ అవసరాలకు వినియోగించుకుంటున్నారని తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు కూడా ఈ పథకం ఎంతగానో దోహదపడుతుందని నిత్యం విధులకు వెళ్లే వారికి ఇది పెద్ద ఊరటనిస్తోందని ఆయన పేర్కొన్నారు. ప్రతి రోజూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 35 లక్షల మంది మహిళలు ఈ ఉచిత బస్సు సౌకర్యాన్ని వినియోగించుకుంటున్నారని వివరించారు. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 290 కోట్ల జీరో ఛార్జీ టిక్కెట్లు నమోదయ్యాయని, దీనివల్ల మహిళలకు సుమారు రూ.10,000 కోట్ల మేర ప్రయాణ ఖర్చులు ఆదా అయ్యాయని పేర్కొన్నారు. ఈ పథకం మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపిందని ముఖ్యంగా గ్రామీణ ప్రాంత మహిళలకు మార్కెటింగ్ ఇతర ఉపాధి పనులకు వెళ్లేందుకు ఇది ఒక వరమని ఆయన పేర్కొన్నారు. ప్రజాపాలనలో భాగంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం మరింత కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఉచిత ప్రయాణాన్ని వినియోగించుకొని లబ్ధిపొందిన పలువురు మహిళలను ఎమ్మెల్యే శాలువాలు పూలమాలలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు కందుల భాస్కర్, వంగ వెంకట్, డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి, డిప్యూటీ సూపరింటెండెంట్ విజయలక్ష్మి, సిబ్బంది వై.నాగేశ్వర్ రావు, మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# మేం పాలకులు కాదు.. సేవకులం..



ప్రజా పాలన సభలో సర్పంచ్ పూనెం రమేష్

**మణుగూరు, మహా:** మేం పాలకులు కాదు.. సేవకులం అన్న భావనతో ప్రజల అవసరాలే కేంద్ర బిందువుగా పనిచేస్తున్నామని లంకమల్లారం సర్పంచ్ పూనెం రమేష్ పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలోని లంకమల్లారం గ్రామంలో గురువారం నిర్వహించిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించి రెండేళ్ల మూడు నెలలు పూర్తయ్యాయని, ఆర్థిక సవాళ్లను అధిగమిస్తూ సంక్షేమం–అభివృద్ధి విషయంలో రాజీ పడకుండా ముందుకు సాగుతోందన్నారు. ప్రభుత్వ పథకాలు కాగితాలకే పరిమితం కాకుండా ప్రజల జీవితాల్లో స్పష్టమైన మార్పు తీసుకు రావడమే లక్ష్యమని తెలిపారు.మార్చి 6 నుండి ప్రారంభమైన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు అన్ని శాఖల సమన్వయంతో అమలవుతోందన్నారు. కార్యాలయాల్లో ఫైళ్ల వేగవంతమైన పరిష్కారం, పరిశుభ్రత, నిర్వహణలో పారదర్శకత ఉండాలని ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, మహిళా సాధికారత వంటి పథకాలు అర్హులకు చేరేలా కృషి జరుగుతోందన్నారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌తో అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ సంకల్పమని, ఈ లక్ష్యంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. 99 రోజుల కార్యాచరణ సాధారణ కార్యక్రమం కాకుండా ఒక దీక్షగా భావించాలని సూచించారు. లంకమల్లారం గ్రామాన్ని ఆదర్శ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, పంచాయతీ సిబ్బంది, స్పెషల్ ఆఫీసర్, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, ఐకేపీ సిబ్బంది, గ్రామస్థాయి ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వేసవి నేపథ్యంలో
# కాంట్రాక్ట్ కార్మికుల పనివేళలు మార్చాలి..

**ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఎస్‌ఓ టు జీఎంకు వినతి..**



**మణుగూరు, మహా:** మండుతున్న వేసవి కారణంగా కాంట్రాక్ట్ కార్మికుల పనివేళల్లో మార్పులు చేయాలని ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మణుగూరు ఏరియా ఎస్ఓటు జీఎం బి శ్రీనివాసాచారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ మణుగూరు ఏరియా అధ్యక్షుడు మంగీలాల్ మాట్లాడుతూ మణుగూరు ప్రాంతంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, పారిశుద్ధ్య కార్మికులు, రోడ్ల శుభ్రత, ఉద్యానవనాల్లో పనిచేసే కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా ఉదయం 6 గంటలకు పని ప్రారంభించి, మధ్యాహ్నానికి ముగించేలా పనివేళల్లో మార్పు చేయాలని కోరారు. అలాగే గనులు, ఇతర విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు, ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు, వాహన డ్రైవర్లు, కోల్ ట్రాన్స్‌పోర్ట్, ఓబీ వర్కర్లకు మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేయాలని సూచించారు. ఓబీ వర్కర్ల కోసం పనిస్థలాల్లో చలువ పందిళ్లు ఏర్పాటు చేయడం, ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేయడం, వడదెబ్బ నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ కార్మికులు కె నాగేశ్వరరావు, యు శివరామకృష్ణ, టి రామకృష్ణ, ఎం గురు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


# అపార అనుభవం.. కచ్చితమైన వ్యూహం..

- తెలంగాణ ఎన్నికల్లో సత్తా చాటిన వ్యూహకర్త..
- కాంగ్రెస్ పార్టీ హై కమాండ్ ఆదేశాలతో..
- కేరళ ఎన్నికల్లో కీలక పాత్రలో తుళ్లూరి బ్రహ్మయ్య..

**మణుగూరు, మహా :** గత తెలంగాణ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో అపార అనుభవంతో కీలక వ్యూహాలు అమలు చేసి అభ్యర్థుల విజయాల్లో ముఖ్యపాత్ర పోషించిన కాంగ్రెస్ నాయకుడు, డిసిసిబి డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య ప్రస్తుతం కేరళ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో బిజీగా ఉన్నారు. పినపాక నియోజకవర్గంతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపుకు సమర్థంగా పని చేసిన బ్రహ్మయ్య, తన వ్యూహాత్మక నైపుణ్యంతో పార్టీకి విజయాలు అందించడంలో ప్రముఖ పాత్ర పోషించారు. ఈ నేపథ్యంలో పార్టీ హైకమాండ్ ఆయన సేవలను కేరళ ఎన్నికల ప్రచారంలో వినియోగిస్తోంది. ఈ క్రమంలో గురువారం కేరళ రాష్ట్రంలోని పతనంతిట్ట జిల్లాలోని కోన్నీ అసెంబ్లీ నియోజకవర్గంలో నిర్వహించిన ఐఎన్‌టీయూసీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సమావేశానికి పతనంతిట్ట పార్లమెంట్ సభ్యుడు ఆంటోని, కాంగ్రెస్ అభ్యర్థి సతీష్ కొచ్చుపరాంబిల్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకుడు పవన్ కుమార్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన వ్యూహాలపై తుళ్లూరి బ్రహ్మయ్య మార్గనిర్దేశం చేసినట్లు సమాచారం. ప్రతి ఓటర్‌ను చేరుకునేలా పార్టీ లక్ష్యాలు, ప్రణాళికలను వివరించి, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని సూచించినట్లు తెలిసింది. కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా కృషి చేస్తున్న బ్రహ్మయ్య, తన అనుభవంతో కేరళలో కూడా పార్టీకి అనుకూల ఫలితాలు సాధించడంలో కీలక పాత్ర పోషించనున్నారని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

# పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలి..

**ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎమ్మెల్యేకు సిపిఎం వినతి**



**మణుగూరు, మహా:** అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేసి, ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని సిపిఎం నాయకులు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు వినతిపత్రం సమర్పించారు. మణుగూరు మండలంలోని సంతసింగారంలో గురువారం నిర్వహించిన గ్రామ సభలో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కోరారు.మండలంలోని 14 గ్రామపంచాయతీలు, 23 వార్డుల్లో నివసిస్తున్న పేదలకు ఇంటి స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఇంటి స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు సత్రపల్లి సాంబశివరావు, పార్టీ సీనియర్ నాయకుడు నెల్లూరు నాగేశ్వరరావు మాట్లాడుతూ మండలంలో అనేక మంది పేదలు కూలి పనులు చేసుకుంటూ, కొంతమంది ప్రైవేటు సంస్థల్లో తక్కువ జీతాలతో జీవనం సాగిస్తున్నారని తెలిపారు. సుమారు 500 కుటుంబాలు అద్దె ఇళ్లలో నివసిస్తూ ఇబ్బందులు పడుతున్నాయని, మరికొంతమంది స్థలం ఉన్నా ఇల్లు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అటువంటి వారికి ప్రభుత్వం వెంటనే ఇంటి స్థలాలు, ఇళ్లు మంజూరు చేసి రక్షణ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు గొడిశాల రాములు, ఎస్ వెంకట్రావు, మండల కార్యదర్శివర్గ సభ్యురాలు పిట్టల నాగమణి, నాయకులు దామల్ల లెనిన్ బాబు, మండల కమిటీ సభ్యులు గుడ్డి భీమయ్య, ఆర్ శ్రీను, పల్లె చంద్రయ్య, శ్రీను, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధికి పనుల్లో వేగం..

- ప్రభుత్వ శాఖల సమన్వయంపై దృష్టి..
- ఐటిడిఏ–పంచాయతీ రాజ్ అధికారులతో ఎమ్మెల్యే పాయం సమీక్ష



**మణుగూరు, మహా :** గ్రామపంచాయతీల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఐటిడిఏ, పంచాయతీ రాజ్ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, ప్రజలకు అందుతున్న మౌలిక సదుపాయాలపై ఎమ్మెల్యే సమగ్రంగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, విద్యుత్ సరఫరా వంటి అంశాలపై అధికారులతో విస్తృతంగా చర్చించారు.ప్రతి గ్రామపంచాయతీలో ప్రభుత్వ పథకాలు సమర్థంగా అమలు కావాలని, అర్హులందరికీ లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత, పారదర్శకతకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఎలాంటి ఆలస్యం లేకుండా పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించేలా అధికారులు చురుకుగా వ్యవహరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఐటిడిఏ, పంచాయతీ రాజ్ శాఖలకు చెందిన అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మణుగూరులో మున్సిపాలిటీలో..
# ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో సమస్యల స్వీకరణ

**త్వరిత పరిష్కారంపై ఐటీడీఏ పీవో, అధికారుల హామీ**



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మున్సిపాలిటీలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో, మున్సిపాలిటీ స్పెషల్ ఆఫీసర్ రాహుల్, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ లు పాల్గొన్నారు.కార్యక్రమంలో ప్రజల నుంచి పలు సమస్యలపై దరఖాస్తులను స్వీకరించి సంబంధిత అధికారులకు పరిష్కారానికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో రాహుల్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని త్వరితగతిన పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రతి దరఖాస్తును పరిశీలించి అర్హులైన వారికి తక్షణమే న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజల అవసరాల మేరకు ప్రభుత్వ సేవలు చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, సమస్యల పరిష్కారంలో ఆలస్యం చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

## భూభారతి పెండింగ్ దరఖాస్తులను
# త్వరితగతిన పరిష్కరించాలి

- అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు
- భద్రాద్రి జిల్లా కలెక్టర్ అంకిత్



అక్రమ ఇసుక రవాణాపై దృష్టి సారించాలి..

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** జిల్లాలో భూసంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని భూభారతి కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నింటినీ త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. గురువారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్‌తో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి పెండింగ్ దరఖాస్తులపై పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో సుదూర ప్రాంతాల నుంచి భూ సమస్యలపై అధిక సంఖ్యలో ఫిర్యాదులు అందుతున్నాయని వాటి పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. సంబంధిత శాఖల మధ్య సమన్వయం పెంచి ప్రతి సమస్యను ప్రాధాన్యంగా పరిష్కరించాలని ఆదేశించారు.ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను బీఎల్ఓల వారీగా మండలాల వారీగా విభజించి సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని ప్రతి బీఎల్ఓకు లక్ష్యాలను నిర్దేశించి సమయానికి పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. జనగణనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసి తహసీల్దారుల ఐడీ క్రియేషన్‌ను వేగవంతం చేయాలని జనగణన పర్యవేక్షణకు ప్రత్యేక అధికారిని నియమించాలని సూచించారు. జిల్లాలో అక్రమ ఇసుక రవాణాపై వస్తున్న ఫిర్యాదులను దృష్టిలో ఉంచుకుని ఇసుక రీచ్‌ల నిర్వహణపై తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. ఇందిరమ్మ ఇండ్ల పేరుతో అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇసుక రీచ్‌లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తానని ఇప్పటి వరకు నమోదు చేసిన కేసుల వివరాలను సమర్పించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో అభివృద్ధి పనులకు సంబంధించి భూసేకరణ పురోగతి, పెండింగ్ కోర్టు కేసులపై కూడా సమగ్ర సమాచారం కోరారు. వచ్చే వారంలో జిల్లాలోని అందరు తహసీల్దారులతో భూభారతి, ప్రజావాణి దరఖాస్తులు, ఎస్ఐఆర్ మ్యాపింగ్, జనగణన, భూసేకరణ తదితర అంశాలపై సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహిస్తానని తెలిపారు. ఇందుకు అవసరమైన పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో సిపిఓ సంజీవరావు, ఎన్నికల సూపర్డెంట్ రంగ ప్రసాద్, ఈ సెక్షన్ సూపర్డెంట్ స్వర్ణలత, ఏడి మైన్స్ దినేష్, భూసేకరణ అధికారి యాసిన్ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వైభవంగా అంకమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట

**పూజా కార్యక్రమంలో పాల్గొన్న వైరా ఎమ్మెల్యే**



**జూలూరుపాడు, మహా:** మండల పరిధిలోని జడలచింత గ్రామంలో మహాలక్ష్మి, అంకమ్మ తల్లుల విగ్రహ ప్రతిష్టా మహోత్సవ కార్యక్రమం గురువారం అత్యంత వైభవంగా జరిగింది. దైవ కార్యక్రమంలో జడలచింత గ్రామంతో పాటు పాపకొల్లు, కొత్తూరు, అన్నారుపాడు, జూలూరుపాడు పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవార్ల ప్రత్యేక హోమ, ప్రతిష్ట పూజా కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ పాల్గొన్నారు. భక్తుల కోసం ఏర్పాటు చేసిన మహా అన్న ప్రసాద కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తో పాటు, పలువురు ప్రజా ప్రతినిధులు, పలు రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కారేపల్లిలో సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి



**కారేపల్లి, మహా:** కారేపల్లి తహసిల్దార్ కార్యాలయంలో గురువారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. సర్వాయి పాపన్న చిత్రపటానికి తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ సర్వాయి పాపన్న గౌడ్ బడుగు బలహీన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారని కొనియాడారు. తురుష్క సైనికుల ఆగడాలపై తిరుగుబాట్లు తో ప్రారంభించిన సర్దార్ పాపన్నగౌడ్ భూస్వాములు, జమిదార్లకు వ్యతిరేకంగా కులమతాలకు అతీతంగా పోరాడారన్నారు. పాపన్న ఆశయాలు నేటి యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తులపై కేసు నమోదు



**జూలూరుపాడు, మహా:** ప్రభుత్వ విధులకు ఆటంకం కలిగించిన నలుగురు వ్యక్తులపై కేసు నమోదైన సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. జూలూరుపాడు పోలీసుల కథనం ప్రకారం సుజాతనగర్ మండలానికి చెందిన అజ్మీర లక్ష్మణ్, అజ్మీర రాజ్ కుమార్, బండి భాస్కర్, ఆదినారాయణ అను వ్యక్తులు కొమ్ముగూడెం గ్రామములోని లబ్ధిదారుల వద్ద నుండి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా పంపిణీ చేయబడుతున్న రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి, తమ వద్ద ఉన్న ట్రాలీ ఆటోలో లోడ్ చేసుకుని కొత్తగూడెం వైపునకు వెళుతూ ఉండగా, నమ్మదగిన సమాచారం మేరకు సివిల్ సప్లై అధికారి ఆర్ఐ నిక్కిలి వెంకటేశ్వర్లు కొమ్ముగూడెం గ్రామంలోని పెద్దమ్మతల్లి దేవాలయం వద్ద ట్రాలీ ఆటోను ఆపి తనిఖీ చేయగా, అందులో సుమారు 20 సూపర్ సంచుల లో బియ్యం ఉన్నట్లు నిర్ధారించి ఎక్కడ వాని ప్రశ్నిస్తూ, ఫోటోలు తీస్తూ ఉండగా పైన పేర్కొన్న వ్యక్తులు ఫిర్యాది యొక్క కాళ్లు, చేతులను గట్టిగా పట్టుకొని, మెలివేసి చేతులతో దాడి చేసి, ట్రాలీ ఆటోతో అక్కడి నుండి పారిపోయారు. విధులలో భాగంగా రేషన్ బియ్యం లోడ్ తో వెళ్తున్నటువంటి ట్రాలీ ఆటోను ఆపినందుకుగాను, తనను దుర్భాషలాడి, చేతులు కాళ్లను మెలివేసి, తనను అడ్డగించి, ట్రాలీ ఆటోను తీసుకొని వెళ్ళి, మరో మారు తమ జోలికి వస్తే చంపుతామని బెదిరించి, భయ భ్రాంతులకు గురిచేసిన పైన పేర్కొన్న నలుగురు వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్న ఫిర్యాదుపై ఏఎస్ఐ వెంకట సుబ్బారావు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# ప్రజా దరఖాస్తులకు పరిష్కారం చూపాలి

## పాలకవర్గం సమస్యల పరిష్కారంకు కలిసి పని చేయాలి
## సీపీఐ(ఎం)కొండెబోయిన నేత నాగేశ్వరరావు



**కారేపల్లి, మహా :** ప్రజాపాలన 99 రోజుల ప్రజాప్రణాళిక గ్రామసభలలో వచ్చిన ప్రజా దరఖాస్తులకు పంచాయతీ పాలకవర్గం పరిష్కారం చూపాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండెబోయిన నాగేశ్వరరావు కోరారు.గురువారం సింగరేణి సర్పంచ్ మేదరి వీరప్రతాప్ అధ్యక్షతన జరిగిన గ్రామసభలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పంచాయతీలో సమస్యల పరిష్కారం కోసంపాలకవర్గం కలిసి పనిచేసి ప్రజామన్నలను పోందాలని సూచించారు. సింగరేణి గ్రామంలో సర్వేనెంబర్ 38 కబ్జాకి గురికాకుండా హద్దులు నిర్ణయించాలని, బీసీ హాస్టల్ ఎస్‌ఎం హాస్టల్ కు సొంత భవనం నిర్మాణం చేపట్టాలని, కారేపల్లిలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ని ఏర్పాటు చేయాలని, బస్టాండ్ బస్ షెల్టర్ ఏర్పాటు తో పాటు నిర్మాణం పూర్తయిన ప్రజా మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాలని కోరారు.కస్తూరిబా,మోడల్ స్కూల్, ప్రైమరీ స్కూల్, గవర్నమెంట్ హాస్పటల్ వంటి ప్రభుత్వ కార్యాలయాలు వర్షాలకు మునకకు గురవుతున్నాయని వాటికి గుట్టకిందగుంపు గుట్ట వద్ద గోదాం నిర్మాణం సందర్భంగా తీసే మట్టిని వినియోగించాలని సూచించారు. గత ప్రజా పాలన గ్రామసభలో 400 మంది ఇందిరమ్మ ఇల్లు అర్హులుగా గుర్తించారని వారిలో కేవలం 75 మందికి మాత్రమే ఇల్లు మంజూరయ్యాయని తెలిపారు. ఎల్ 2, ఎల్ 3 మిగిలిన లబ్ధిదారులందరికీ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో రైల్వే లైన్ కోసం ఇండ్లు, భూములు కోల్పోతున్న బాధితులకు మెరుగైన నష్ట పరిహారం అందించేలా చూడాలన్నారు. కోతులు వీధికుక్కలు నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. సింగరేణి కోల్ మైన్స్ సంస్థ నుండి సింగరేణి పంచాయతీకి అభివృద్ధి నిధులు తీసుకువచ్చేలా పాలకమండలి కృషి జరపాలని కోరారు. హిందూ దళిత స్మశాన వాటిక హద్దులు నిర్ణయించాలని, వేసవికాలం ప్రారంభమైనందున నీటి కొరత లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం హామి ఇచ్చిన విధంగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా దరఖాస్తు చేసుకున్న భూమిలేని పేదలు లందరికీ ఏడాది రూ.12వేలు ఇవ్వాలని, గ్యాస్ సిలిండర్ 500 సబ్సిడీ వినియోగదారుల అకౌంట్లో జమ కావడం లేదు వాటిని జమ చేయాలని దానికి పాలకవర్గం ప్రభుత్వానికి తీర్మానం ద్వారా కోరాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పూర్తయిన వారికి ఎన్ఆర్ఈజీఎస్ నుండి రావలసిన రూ 60 వేల బిల్లు వెంటనే చెల్లించాలని కోరారు.

# గ్రామసభలలో సమస్యలపై ఆర్జీలు

**ప్రభుత్వ పథకాల వివరించిన అధికారులు**

**కారేపల్లి, మహా:** ప్రజాపాలన 99 రోజుల ప్రజాప్రణాళికలో భాగంగా సింగరేణి మండలంలోని 41 గ్రామ పంచాయతీలలో గురువారం గ్రామసభలు నిర్వహించారు. గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ల పర్యవేక్షణలో సర్పంచుల అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలలో అధికారులు ప్రభుత్వ అమలు చేస్తున్న పథకాలను ఏకరవు పెట్టారు. గ్రామసభలకు వచ్చిన ప్రజల సమస్యలపై ఆర్జీలను ఇచ్చారు. తాము ఇంతకు ముందు పెట్టిన పెన్షన్, సాదాబైనామా దరఖాస్తుల పురోగతిపై అధికారులను ప్రశ్నించారు. గాదెపాడులో జరిగిన గ్రామసభలో ఫారెస్టు అధికారులు, విద్యుత్ సమస్యలను ప్రజలు సర్పంచ్ భూక్య రంజిత్ కుమార్ దృష్టికి తీసుకవచ్చారు. ఫారెస్టు అధికారులు పోడు భూములలో విద్యుత్ లైన్ వేయకుండా అడ్డుకుంటున్నారని 28 మంది బాధితులు గ్రామసభలో ఆవేదనవ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన సర్పంచ్ రంజిత్ కుమార్ వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ దృష్టికి తీసుకవచ్చి పరిష్కరిస్తానని తెలిపారు. పంచాయతీకి ఎన్నినిధులు వచ్చాయి, ఎంతఖర్చు చేశారు.దేనికి ఖర్చు పెట్టారని గ్రామ స్వరాజ్ యాఫ్ ను ఉటంకిస్తూ యువకులు అధికారులను ప్రశ్నించారు.సింగరేణి గ్రామపంచాయతీలో సర్పంచ్ మేదరి వీరప్రతాప్ అధ్యక్షతన జరిగిన గ్రామ సభలో గ్రామస్తులు ప్రధాన రహదారివెంట సైడు కాలువలు అక్రమణలకు గురవుతున్నాయని పిర్యాదు చేశారు. గతంలో నోటీసులు ఇచ్చి అక్రమణలు తొలగించిన అధికారులు పర్యవేక్షణ లేక తిరిగి అక్రమణలు జరుగుతున్నాయని పిర్యాదులో పేర్కొన్నారు. సైడు కాలువలు పూడికతో నిండి మురుగు ఆగుతుందని దానిని తీయించాలని కోరారు. సభలో పాల్గొన్న ఎస్సై బైరు గోపి మాట్లాడుతూ సైబర్ మోసాలు పెరిగిపోయాయని ఆన్ లైన్ లో ఆర్డర్ పెట్టెవారు. సెల్ ఫోన్ వినియోగంలో జాగ్రత్తలు వహించాలని కోరారు. ఇతరులకు ఓటీపీలు చెప్పవద్దన్నారు. యువత డ్రగ్స్ తీసుకోవటం ద్వారా జీవితాలు ఆగం చేసుకోవద్దని కోరారు. డ్రగ్స్ వినియోగించిన, సరఫరా చేస్తున్న వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. భాగ్యనగర్ తండాలో సర్పంచ్ బానోత్ హిరాలాల్ అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. వాటిని ప్రాధాన్యత క్రమంలో పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామసభలు ఉదయం 9 గంటలకు ప్రారంభం కావల్సి ఉండగా, మిర్చి ఏరివేత, కోతుల కాపలకు గ్రామస్తులు చేను పనులకు వెళ్లటంతో 11 గంటల తర్వాత సభలు అధికారులు ప్రారంభించారు.

# గ్రామసభల ద్వారా ప్రజా సమస్యలు పరిష్కారం



**వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్**

**జూలూరుపాడు, మహా:** గ్రామ ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు గ్రామసభలు ఉపయోగపడతాయని వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామ సభలు నిర్వహించడం జరిగింది. అనంతారం గ్రామ పంచాయతీలో జరిగిన గ్రామసభలో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రజా సంక్షేమ పథకాల గురించి వివరించారు. అర్హులైన పేద ప్రజలందరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొర్సా రమేష్, తహసిల్దార్ టి శ్రీనివాస్, ఎంపీడీఓ తాళ్లూరి రవి, ఎంపీఓ తులసీరామ్, ఏఓ దీపక్ ఆనంద్, ఎఫ్ఆర్ఓ ప్రసాద్ రావు, మండల వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు, ఏపీఓ రామారావు, కార్యదర్శి శైలజ, మండల పార్టీ అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్ నాయక్, సీనియర్ నాయకులు లేళ్ళ వెంకటరెడ్డి, వార్డు సభ్యులు, వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక సేవాతో సిద్దురెడ్డికి ప్రజల్లో మంచి గుర్తింపు..


## రాష్ట్ర మంత్రి అజారుద్దీన్



**రాజేంద్రనగర్, మహా :** హైదరాబాద్ నుండి బెంగళూరు నేషనల్ హైవే 44 శంషాబాద్ ఆర్టీసీ బస్సు స్టాప్ వద్ద ప్రముఖ సామాజిక వేత కందకట్ల సిద్దు రెడ్డి ఆధ్వర్యంలో నెలకొల్పిన ఉచిత మజ్జిగ కేంద్రాన్ని మంత్రి అజారుద్దీన్ తో పాటు ప్రముఖ ఎన్నారై, ఇఫ్తే కార్ అహ్మద్ షరీఫ్ గురువారం సందర్శించారు. వేసవి తాపం నుండి ప్రయాణికులతో పాటుప్రజలకు ఉపశమనం కల్పించడానికి సామాజికవేత్త కందకట్ల సిద్దురెడ్డి చేస్తున్న సేవలపై ఎన్నారై, ఇఫ్తే కార్ అహ్మద్ షరీఫ్, రాష్ట్ర మంత్రి మహమ్మద్ అజారుద్దీన్ సిద్దురెడ్డి ని ప్రశంసించారు.సామాజిక సేవా కార్యక్రమాలతో ప్రజల్లో మంచి గుర్తింపు పొందిన కందకట్ల సిద్దు రెడ్డి నేటి యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని అయిన కొనియాడారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకొని శంషాబాద్ లో హనుమాన్ శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు. హనుమాన్ శోభాయాత్రలో పలు పార్టీల నాయకులు, బజరంగ్దళ్ కార్యకర్తలతో సిద్దు రెడ్డి సందడి చేశారు. కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు మాజీ ప్రజాప్రతినిధులు, పలువురు ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు. ఈ మేరకు మజ్జిగ కేంద్రం నిర్వాహకుడు, సామాజికవేత్త కందకట్ల సిద్దు రెడ్డి తో పాటు సినీ హీరో ఇంద్రసేన్, ప్రముఖ వ్యాపారవేత్త బాలేశ్వర్ తో కలిసి హనుమాన్ శోభాయాత్రలో పాల్గొన్న భక్తులకు మజ్జిగను పంపిణీ చేశారు మంత్రి అజారుద్దీన్, ఎన్నారై ఇఫ్తే కార్ అహ్మద్ షరీఫ్. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి అజారుద్దీన్.... సామాజికవేత్త కందకట్ల సిద్దు రెడ్డి కొనసాగిస్తున్న సేవలపై ప్రశంసలు జల్లు కురిపించారు. తెలంగాణ లో ప్రజలు మతసామరస్యంతో మెలగాలని ఆయన పిలుపునిచ్చారు. మరోవైపు సామాజికవేత్త కందకట్ల సిద్దు రెడ్డి చేస్తున్న సామాజిక సేవలను ప్రముఖ ఎన్నారై ఇఫ్తే కార్ అహ్మద్ షరీఫ్ కొని ఆడారు. డబ్బులు ఎంతో మంది సంపాదిస్తారని, కానీ సంపాదించిన డబ్బుల ను సమాజ సేవ కోసం ఉపయోగించడం సిద్దు రెడ్డికి మాత్రమే చెల్లిందని ఆయన ప్రశంసించారు. సమాజం లోని నేటి యువతకు కందకట్ల సిద్దు రెడ్డి ఆదర్శంగా నిలిచారని ఇస్తే కార్ హైమద్ షరీఫ్ అభిప్రాయపడ్డారు.

# ప్రజలకు అండగా నిలిచే ప్రజా ప్రభుత్వమిది

- రైతుకు భద్రత కల్పించేలా భూ భారతి
- ప్రతి రైతు సర్వేనెంబర్ కు భూధార్ నెంబర్
- ప్రతి గడపకు సంక్షేమ పథకాలు
- భూభారతితో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం
- సమీకృత భూభారతి పైలట్ ప్రాజెక్టులో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**ఆమనగల్లు, మహా :**ప్రజలకు అండగా నిలిచే ప్రజా ప్రభుత్వమిది అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణిని ప్రతి రైతుకు ఇచ్చిన హామీ మేరకు, ప్రతి రైతుకు భద్రత కల్పించేలా భూభారతిని అమల్లోకి తెచ్చామని, అందులో భాగంగా రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండలంలో సమీకృత భూభారతి పైలట్ ప్రాజెక్టు ఎన్నికైందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం ఆమనగల్లు మున్సిపాలిటీ విటాయిపల్లి గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తో కలిసి సమీకృత భూ భారతి పోర్టల్ ను మంత్రి ఆవిష్కరించారు.అనంతరం మాట్లాడుతూ.. ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందాలనే లక్ష్యంతో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నేడు ప్రతి గ్రామంలో గ్రామ సభలను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రతి మనిషికి ఆధార్ నెంబర్ లాగా భూమి కలిగిన ప్రతిరైతుకు సర్వేనెంబర్ కు భూధార్ నెంబర్ కేటాయిస్తామని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రెవెన్యూ శాఖనుపూర్తి స్థాయిలో ప్రక్షాళన చేశామన్నారు. 10572 గ్రామాలకు విఆర్ఎలను నియమించినట్లు, సర్వే వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని లక్ష్యంతో 2 దశల్లో సుమారు 6000 లైసెన్సుడు సర్వేయర్ లను నియమించినట్లు తెలిపారు. భూ భారతి చట్టంలోరిజిస్ట్రేషన్ జరిగే సమయంలోనే ఆ సర్వే నెంబర్ కు సంబంధించిన సరిహద్దులు ఉంటాయని, ప్రతి రైతుకు భూభారతి భరోసా లాంటిది అన్నారు.కల్వకుర్తి నియోజకవర్గానికి గృహ నిర్మాణ శాఖ మంత్రి శ్రీనివాస్ రెడ్డి 3500 ఇందిరమ్మ ఇల్లు కేటాయించారని, 80% మొదటి దశ ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణాలు పూర్తయ్యాయని, నియోజకవర్గానికి మరో 3500 ఇందిరమ్మ ఇండ్లనుకేటాయించాలని ఎమ్మెల్యే నారాయణరెడ్డి మంత్రిని కోరారు.అదేవిధంగా ఆమనగల్లు పట్టణ కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు సహకరించాలని కోరారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, రంగారెడ్డి,సంగారెడ్డి, నారాయణపేట జిల్లాల్లోని ఐదు మండలాల్లో దీన్ని అమలు చేస్తున్నాం. ఈ పోర్టర్ద్వారా రైతులకు భూదార్ నంబర్, సరిహద్దు మ్యాపులు అందుబాటులోకి వస్తాయి. ఈ నెలాఖరులో రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ చేపడతామని మంత్రి వెల్లడించారు.ఈ కార్యక్రమం లో రెవెన్యూ శాఖ సెక్రటరీ లోకేష్, జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి, విద్యాశాఖ అధికారి సుసింధర్ రావు, ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ యాట గీత,మున్సిపాలిటీ చైర్మన్ పత్య నాయక్, తహసీల్దార్ ఖాద్రి, మున్సిపాలిటీ కమిషనర్ శంకర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, పిసిసి సభ్యులు శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ నేతలు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఐదు రూపాయలు కొట్టు 20 లీటర్ల వాటర్ పట్టు

### వాటర్ ఫిల్టర్ వద్ద నూతన విధానం 5 రూ. కాయిన్ బాక్స్ ను ప్రారంభించిన గ్రామ సర్పంచ్ ఎల్గని వెంకటేష్ గౌడ్



**మొయినాబాద్ మహా:** త్రాగునీటికి ఇబ్బందులు కలగకుండా నూతన విధానాన్ని ఆలోచించి నిత్యం గ్రామ ప్రజలకు త్రాగునీటి సరఫరా కోసం నూతన విధానం కాయిన్ బాక్స్ మరియు కార్డు సిస్టన్ని గ్రామ ఉప సర్పంచ్ సుభాష్ చంద్రబోస్ రెడ్డి మరియు వార్డు సభ్యులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాకారం గ్రామ ప్రజలందరూ నూతన విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని 20 లీటర్ల త్రాగునీటి బాటిల్ ని కేవలం ఐదు రూపాయలకే అందించడం జరుగుతుందని దీనికి సంబంధించి గ్రామ ప్రజలు ఐదు రూపాయల కాయిన్ బాక్స్ లో వేస్తే వారికి 20 లీటర్ల వాటర్ ఆటోమేటిక్ గా తమ వాటర్ బాటిల్ లో వాటర్ వస్తాయని వారు తెలిపారు. ఈ యొక్క నూతన విధానాన్ని ప్రజలందరూ దృష్టిలో పెట్టుకొని ఈ వాటర్ ని వృధా చేయకుండా కాయిన్ బాక్స్ ద్వారా త్రాగునీరును తీసుకోవాలని వారు ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కొంతం నాగేశ్వర్ రెడ్డి, రాయనోళ్ల ఉపేందర్ యాదవ్, బంధి అనిల్ కుమార్, కొండకళ్ళ రవి, దినేష్ రెడ్డి, మరియు నాయకులు పి .రాఘవరెడ్డి, కే శ్రీకాంత్, కే. మహేందర్, శ్రీకాంత్ గౌడ్, గజానంద్ రెడ్డి, విజయ్ కుమార్, కారోపర్ జగన్నాథ్, శ్రీశైలం మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అందరివాడు కొందరు వాడు కాదు..

- మొయినాబాద్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ గరుగు రాజు ముదిరాజ్
- డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ కరపత్రం విడుదల



**మొయినాబాద్ మహా:** బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అందరివాడు అని కొందరు వాడు కాదు అని మొయినాబాద్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ గరుగురాజు ముదిరాజు అన్నారు గురువారం నాడు మొయినాబాద్ మండల మహనీయుల ఉత్సవాల కమిటీ చైర్మన్ బేగరి రాజు సజ్జన్ పల్లి గ్రామ అంబేద్కర్ యువజన సంఘం నాయకులు కోడిజుట్టు శ్రీనివాస్ ల ఆధ్వర్యంలో మహనీయులు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ మహోత్సవానికి రావాలని ఆహ్వాన పత్రిక అందజేశారు ఈ సందర్భంగా మొయినాబాద్ మున్సిపల్ వైస్ చైర్మన్ గరుగు రాజు ముదిరాజ్ మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వాళ్ళు ఈరోజు వ్యవస్థ నడుస్తుందని అన్నారు రాజ్యాంగం వల్లే మేము ప్రజాప్రతినిధులం అయ్యామని అలాంటి బాబాసాహెబ్ ను ఒక వర్గానికి ఒక కులానికి ముద్ర వేయొద్దని ఆయన అన్నారు గ్రామ స్థాయి నుండి దేశ స్థాయి వరకు రిజర్వేషన్లు కల్పించి బీసీలను అగ్రస్థానం లో ఉంచారని సంతోషం వ్యక్తం చేశారు ఇతర దేశాల రాజ్యాంగాల కంటే భారత రాజ్యాంగం లౌకిక, ప్రజాస్వామ్య , స్వామియవాద, గణతంత్ర రాజ్యాంగం గొప్పదని వారు కొనియాడారు ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చదువుల రామచందర్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల పీడిత ప్రజల కోసం మహనీయులు చేసిన పోరాటం నేటి యువతకు ఆదర్శం వారి ఆశయాల కోసం యువత పనిచేయవలసిన అవసరం ఎంతైనా ఉందని వారన్నారు ఏప్రిల్ మాసం మహనీయుల మాసం మహాత్మ జ్యోతిరావు పూలే, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి కార్యక్రమాలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ నాయకులు చెన్నయ్య యాదవ్, డాక్టర్ బొంపల్లి ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

## శంషాబాద్ పురవీధులలో ఘనంగా విహరించిన

# హనుమాన్ జయంతి శోభాయాత్ర...



**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ డివిజన్ పరిధిలో హనుమాన్ జయంతిని పురస్కరించుకొని గురువారం ఘనంగా శోభాయాత్ర నిర్వహించారు.హనుమాన్ జయంతి శోభాయాత్రలు శంషాబాద్ బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంచర్ల శ్రీనివాస్ మాట్లాడుతూ హనుమంతుడు చూపిన ధర్మమార్గం ప్రతి ఒక్కరికీ ఆదర్శమన్నారు. యువత హనుమంతుడిని ధైర్యం, క్రమశిక్షణ, నిబద్ధతను ఆదర్శంగా తీసుకుని సమాజ సేవలో ముందుండాలని పిలుపునిచ్చారు.ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యత, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయన్నారు.ఈ శోభాయాత్ర లో ప్రజలు, యువత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో, బీఆర్ఎస్ శంషాబాద్ డివిజన్ అధ్యక్షులు కొలన్ ప్రదీప్ రెడ్డి, సీనియర్ నాయకులు బుచ్చిరెడ్డి, కొన్నమొల్ల శ్రీనివాస్, రాజేందర్, వెంకట్ రెడ్డి, మల్లేష్, హన్మంతు ముదిరాజ్, రాచమల్ల జయసింహ, పెట్రోల్ సాయి, పరందములు, గుంటి చరణ్ పాల్గొన్నారు.

# హయత్ నగర్ డివిజన్ అభివృద్ధికి నిధులు

- ఎంపీ ఈటెల రాజేందర్ కు కృతజ్ఞతలు
- డివిజన్ అభివృద్ధికి తన వంతు కృషి
- డివిజన్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** మహాగాయత్రీ నగర్ కాలనీ అభివృద్ధి కార్యక్రమాలపై కళ్లెం నవజీవన్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా, ఉమ్మడి హయత్ నగర్ డివిజన్ పరిధిలోని మహాగాయత్రీ నగర్ కాలనీలో చేపట్టవలసిన అభివృద్ధి కార్యక్రమాలపై, స్థానిక తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి సమక్షంలో, కాలనీ వాసులతో సమావేశమై అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు ప్రస్తుతం కొనసాగుతున్న భూగర్భ డ్రైనేజీ పనులు, అలాగే కాలనీ సంక్షేమ సంఘం భవన నిర్మాణానికి నిధులు కేటాయించిన స్థానిక ఎంపీ ఈటల రాజేందర్ కి కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా కాలనీ అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, కాలనీ ప్రధాన కార్యదర్శి మాలిగ లింగం కురుమ, గౌరవ అధ్యక్షులు రంగారెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, వంగూరు శ్రీనివాస్ యాదవ్, అరవింద చారి, ఉమాకాంతరావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా నియోజకవర్గంలో హనుమాన్ జయంతి వేడుకలు...



**రాజేంద్రనగర్ మహా ;** హనుమాన్ జయంతిని పురస్కరించుకొని శంషాబాద్ డివిజన్ పరిధిలో గురువారంహనుమాన్ దేవాలయాల్లో బిజెపి నియోజకవర్గ ఇన్చార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర మాజీ అధ్యక్షులు సేవెళ్ల మహేందర్ తో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి శంషాబాద్ డివిజన్ పరిధిలోని పురవీధుల్లో హనుమాన్ శోభాయాత్రలో పాల్గొన్నారు.శంషాబాద్ మండలం పెద్ద తూప్రా గ్రామంలో హనుమాన్ జయంతి సందర్భంగా మాజీ ఎంపీపీ దిద్యాల జయమ్మ శ్రీనివాస్, సర్పంచ్ సుమలత రాజు యాదవ్, మూడావత్ బీక్య నాయక్, దిద్యాల శేఖర్, వార్డయ సభ్యులతో కలిసి హనుమాన్ దేవాలయం ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం శోభాయాత్ర లో పాల్గొన్నారు.గగన్ పహడ్ పరిధిలో హనుమాన్ జయంతి సందర్భంగా మైలార్ దేవ్ పల్లి డివిజన్ అధ్యక్షులు సూర్ రెడ్డి వినయ్ రెడ్డి ఆధ్వర్యంలో పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేసే శోభాయాత్ర నిర్వహించారు.కాటేదాన్ డివిజన్ పరిధిలోని కాటేదాన్, మైలార్ దేవ్ పల్లి, ఆదర్శనగర్, బాబుల్ రెడ్డి నగర్ సాయిబాబా నగర్ లో బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు ఎస్ వెంకటేష్, వివిధ కాలనీలలో హనుమాన్ దేవాలయలను దర్శించి నిర్వాహకులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం అంగరంగ వైభవంగా హనుమాన్ శోభాయాత్రలో పాల్గొన్నారు.



# చలివేంద్రాన్ని ప్రారంభించిన మొయినాబాద్ తహసిల్దార్ గౌతమ్ కుమార్

## బాకారం సర్పంచ్ ఎల్గని వెంకటేష్ గౌడ్

**మొయినాబాద్ మహా:** వేసవి కాలాన్ని దృశ్య ప్రజల దాహతి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగింది దీని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి గ్రామ సర్పంచ్ ఎల్గని వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో బాకారం జాగీర్ గ్రామపంచాయతీ పరిధిలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ముఖ్యఅతిథిగా హాజరై మొయినాబాద్ తహసిల్దార్ గౌతమ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా ప్రజలు నిత్యం తిరిగే పరిసర ప్రాంతాలలో ఇలాంటి చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని మొయినాబాద్ తహసిల్దార్ గౌతమ్ కుమార్ వారిని అభినందించారు. అలాగే గ్రామ ప్రజలకు అందరికీ అందుబాటులో ఉండి ఇప్పటికప్పుడు సమస్యలను తీర్చుకుంటూ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దే విధంగా నూతన పాలకవర్గం కష్టపడి ప్రజాలకు సేవలు అందించాలని ప్రజలకు ఎలాంటి సమస్యలు వచ్చిన వెంటనే వాటిని పరిష్కరించే చర్యలు చేపట్టాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సుభాష్ చంద్రబోస్ రెడ్డి, వార్డు సభ్యులు కొంతం నాగేశ్వర్ రెడ్డి రాయనోళ్ల ఉపేందర్ యాదవ్, కొండకల్ల అమృతఎల్లయ్య, ఫారెస్ట్ అధికారులు, గ్రామ కార్యదర్శి శివశంకర్, జిపిఓ రాజేష్,నాయకులు శ్రీకాంత్ గౌడ్, సిద్ధార్థ రెడ్డి, శ్రీశైలం గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# చైర్మన్ ఎన్నిక తథ్యం ఎవరు ఆపలేరు..!

### ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుంటాం

### మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** కోర్టును అడ్డం పెట్టుకొని ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికను ఎవరూ ఆపలేరని రంగారెడ్డి జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి అన్నారు. ఈ మేరకు ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశం మాట్లాడుతూ... ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో చైర్మన్ వైస్ చైర్మన్ ఎన్నిక తథ్యమని ఎవరు ఆపలేరని మాజీ ఎమ్మెల్యే కిషన్ రెడ్డి అన్నారు. మున్సిపల్ ఎన్నికల లో బిఆర్ఎస్ పార్టీ మెజార్టీగా 13 సీట్లు గెలుపు పొందగా, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అప్రజాస్వామ్యంగా వ్యవహరిస్తున్నారని, ఆయన తీరు మార్చుకోవాలని మంచిరెడ్డి కిషన్ రెడ్డి అన్నారు. కౌన్సిలర్లుగా గెలుపొందిన అభ్యర్థులు రోజులు గడుస్తున్న ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజల మధ్యకు వచ్చి సేవ చేసే అవకాశం ఇవ్వడం లేదని మండిపడ్డారు. గత గడిచిన 40 సంవత్సరాలుగా రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉన్నానని, ఏ రోజు కూడా తనపై ఒక కేసు లేదని, తనపై తన కుమారుడిపై కిడ్నాప్ కేసు పెట్టడం దారుణమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం కూడా హైకోర్టు లంచ్ మోషన్ లో నాలుగో తేదీ ఎన్నిక ఆపాలని కాంగ్రెస్ పిటిషన్ వేస్తే హైకోర్టు కొట్టి పారేసిందని, మరొక రోజు అవకాశం ఉండడంతో కేసు వేసే విధంగా ప్రయత్నం చేస్తున్నారని, కానీ ప్రజాస్వామ్యంలో గెలిచిన వ్యక్తులకు పట్టం కట్టాలని, హుందాగా వ్యవహరించాలని ఆయన సూచించారు. ఈసారి నాలుగో తేదీన ఏమైనా జిమ్మిక్కులు చేస్తే ఇబ్రహీంపట్నం ప్రజలు తగిన బుద్ధి చెప్తారని మంచిరెడ్డి కిషన్ రెడ్డి హెచ్చరించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ నేతలు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజల వద్దకే పాలన కాంగ్రెస్ లక్ష్యం





- అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు
- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:**నియోజకవర్గంలోని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లను అందజేస్తామని ఎమ్మెల్యే రంగారెడ్డి అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఉప్పరిగూడ గ్రామంలో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన గ్రామ సభలో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా పరుగులు తీస్తుందని ప్రజా పాలన ప్రగతి ప్రణాళికతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ఆయన అన్నారు. ప్రజల వద్దకే అధికారులు వచ్చి వాళ్ల సమస్యలు తెలుసుకోవడం జరుగుతుందని సమస్యల పరిష్కారానికి మంచి కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే రంగారెడ్డి అన్నారు. నియోజకవర్గంలో ఈ వేసవిలో తాగు నీటి ఎద్దడి, విద్యుత్ సమస్యలు రాకుండా సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలు నిరుపేదలకు అందించడంలో అధికారులు భాగస్వాములు కావాలన్నారు. ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లతో పాటు ఇళ్ళ స్థలాలు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. సంక్షేమం అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని అన్నారు. నిరుపేదలను ఆర్థికంగా అభివృద్ధి చేయటానికి రుణమాఫీ, రైతు భరోసాతో పాటు పలు సంక్షేమ పథకాలను అందించడం జరిగిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను దశల వారిగా పరిష్కరిస్తామని అన్నారు. గ్రామాలలో అధికారులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలు సమన్వయంతో పరిష్కరించాలన్నారు. ముందుగా గ్రామ సభలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, పెండింగ్లో ఉన్న సమస్యలను వివిధ శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు.

**ఉచిత సన్న బియ్యం అందిస్తున్న ఏకైక రాష్ట్రం...**

కాంగ్రెస్ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వమని నిరూపించడం జరిగిందని, కెసిఆర్ హయాంలో ఒక్క రేషన్ కార్డు అయినా, ఒక్క ఇల్లు అయినా ఇచ్చారా? అని ఘాటుగా ప్రశ్నించారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతిఒక్కరికి రేషన్ కార్డులు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందని ఆయన అన్నారు. దేశంలో రేషన్ దుకాణాల ద్వారా పేదలకు ఉచిత సన్న బియ్యం అందిస్తున్న ఏకైక రాష్ట్ర తెలంగాణ రాష్ట్రమని ఎమ్మెల్యే అన్నారు. ప్రజాపాలనతో రాష్ట్రంలో సబండ వర్గాలకు న్యాయం జరుగుతుందని తెలిపారు.

**ధనిక రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా...**

ధనిక రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తే, జీతాలు ఇవ్వలేని రాష్ట్రంగా కెసిఆర్ అప్పుల పాలు చేసిందు.. కెసిఆర్ చేసిన పాపానికి నెల నెల మిత్తిలు కడుతూ, అప్పులు తీరుస్తూ, మరో పక్క సంక్షేమం, అభివృద్ధికి చేస్తున్నాం. అప్పుల కారణంగానే సంక్షేమ పథకాల్లో కొంత ఆలస్యం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్ రెడ్డి, తాసిల్దార్ సునిత, ఎంపిడిఓ ప్రమీల, గ్రామ సర్పంచ్ బి శ్రీవాణినందకుమార్, వ్యవసాయ అధికారిని విద్యాదారి వివిధ శాఖ అధికారులు, పోలవరం నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# గ్రామాలలో ఉన్న నక్ష బాటను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు

## మొయినాబాద్ ఎమ్మార్వో గౌతమ్ కుమార్



**మొయినాబాద్ మహా:** గ్రామంలో ఉన్న సమస్యలను ఒక్కొక్కటిగా తీర్చుకుంటూ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా అభివృద్ధి తొందరలోనే గ్రామ పంచాయతీ పొలిమేర బార్డర్స్ మరియు నక్షబాటలను సర్వే చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తాం గ్రామీణ ప్రాంతాలలో నక్ష బాటలు కబ్జా చేసి రైతులకు గ్రామస్తులకు వెళ్లే దారిని ఆక్రమణకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని మొయినాబాద్ తహసిల్దార్ గౌతమ్ కుమార్ తెలిపారు. గురువారం రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలంలోని బాకారం జాగీర్ గ్రామపంచాయతీ పరిధిలో *గ్రామ సర్పంచ్ ఎల్గని వెంకటేష్ గౌడ్ అధ్యక్షత జరిగిన గ్రామసభ సమావేశానికి మొయినాబాద్ తహసిల్దార్ గౌతమ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం గ్రామంలో ఉన్న సమస్యలను గ్రామసభ ద్వారా తెలియజేయాలని ఆయన ప్రజలను కోరారు. అలాగే గ్రామంలో వేసవి సమస్యలను విని ఒక్కొక్కటిగా సమ్మతిత అధికారులను నోట్ చేసుకోవాలని వారు సూచించారు. గ్రామీణ ప్రాంతాలలో గ్రామస్తులు, రైతులు వెళ్లే నక్షబాటలను తొందరలోనే సర్వే చేసి కబ్జాకు గురైన నక్ష బాటలను ప్రజలకు అందుబాటులోకి తెస్తామని వారు తెలియజేశారు. వైద్య అధికారుల పని విధానాన్ని వారు గ్రామీణ ప్రజలకు ఎలాంటి సేవలు అందిస్తున్నారు అనేదానిపై ఆయన గ్రామసభలో అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సుభాష్ చంద్రబోస్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ కే వెంకట్ రెడ్డి, ఫారెస్ట్ ఆఫీసర్ టి రవి ప్రకాష్, పంచాయతీ కార్యదర్శి శివశంకర్, వార్డు సభ్యులు కొంతం నాగేశ్వర్ రెడ్డి, పంచలింగాల రాధిక, ఉమా రాణి, ఉపేందర్ యాదవ్, బంధి అనిల్, కే రవి, కొండకల్ల అమృత, కొండకల్ల స్వాతి, దినేష్ రెడ్డి జిపిఓ రాజేష్, మరియు వివిధ శాఖల అధికారులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



**మొయినాబాద్ మహా :** ప్రతి ఒక్కరూ కుల మత ప్రాంత భేదాలను విడిచి దేశాన్ని కాపాడుకునేందుకు అందరం ఐక్యంగా ఉండాలని హైకోర్టు న్యాయవాది ప్రముఖ వక్త మౌనిక సుంకర తెలిపారు. ప్రపంచంలో అనేక దేశాల్లో యుద్ధాలు జరుగుతున్నాయని భవిష్యత్తులో మన దేశంలో యుద్ధాలు జరగకుండా ఉండాలంటే మనందరం ఇప్పటినుంచే ఐక్యంగా ఉండాలని మన పిల్లలకు భారతీయ సంస్కృతి సంప్రదాయాలు నేర్పించాలని వారిని భవిష్యత్తుకు దేశ రక్షణకు ఉపయోగపడేగా తయారు చేయాల్సిన అవసరం ఉందన్నారు. గురువారం హనుమాన్ జయంతిని పురస్కరించుకొని మొయినాబాద్ మండల బజరంగ్దళ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వీర హనుమాన్ బైక్ ర్యాలీ చిలుకూరు బాలాజీ నుండి మొయినాబాద్ మండల కేంద్రంలోని శివాలయం వరకు శోభాయానుమయంగా జరిగింది. దారి పొడుగునా జైశ్రీరామ్ జై జై శ్రీరామ్ అంటూ రామనామం మార్మోగింది. మండల కేంద్రం వద్ద ఏర్పాటుచేసిన వేదికపై మౌనిక సుంకర పాల్గొని మాట్లాడారు. అందరం కలిసికట్టుగా ఉండి మన భారతదేశాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కుల మత భేదలను విడిచి హిందువులుగా ఐక్యంగా ఉందామన్నారు. ప్రపంచంలో ప్రస్తుతం అనేక దేశాల్లో యుద్ధాలు జరుగుతున్నాయని మన దేశంలో ఒక మహానుభావుడు ప్రధాన మంత్రి మోడీ 2014 నుంచి పాలన చేస్తుండడంతో మన దేశం స్థిరంగా ఉందని ఆయనకు అండగా ఉండాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బజరంగ్దళ్ కమిటీ సభ్యులు రమేష్ చారి, కాసుల సురేష్ గౌడ్, కొత్తపల్లి మధుసూదన్ రెడ్డి, కొండకళ్ల రాకేష్, విజయ పాండు, శ్రీధర్, శ్రవణ్, శ్రీను యాదవ్, నరేందర్ రెడ్డి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### కళాకారుడు జహంగీర్
## మృతి బాధాకరం
**డాక్టర్ చెరుకు సుధాకర్**

**భువనగిరి, మహా :**తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాటాలు చేసి ధూమ్ ధామ్ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని ఆటలు ఆడుతూ పాటలు పాడుతూ ప్రజల మధ్యల మమేకమై గురువారం మృతి చెందిన కళాకారుడు జహంగీర్ కు ఉద్యమ నేత డాక్టర్ చెరుకు సుధాకర్ పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో టి యు జేఏసీ నాయకులు ప్రఫుల్ రామ్ రెడ్డి చంద్రన్న ప్రసాద్ సంగిశెట్టి క్రిస్టఫర్ సుల్తాన్ యాదగిరి రాజేంద్రప్రసాద్, వేముల యాదగిరి, బాకారం లావణ్య, బాల లక్ష్మి కవిత తదితరులు పాల్గొన్నారు




### కళాకారుడు ఎండి జహంగీర్ శవపేటికను(జానాజా డోలి)ని మోసిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

**యాదాద్రి భువనగిరి, మహా:**యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం కేంద్రానికి చెందిన తెలంగాణ రాష్ట్ర గాయకుడు కళాకారుడు యండి జహంగీర్ గురువారం రోజు గుండె పోటు తో మృతి చెందారుఈ విషయం తెలిసిన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అంత్యక్రియల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎండి జహంగీర్ శవపేటిక( జానాజా డోలిని)బీర్ల అయిలయ్య మోసి ఘనమైన నివాళులర్పించారు.ఎండి జహంగీర్ గురించి మాట్లాడుతూ కళతో ప్రజల గుండెల్లో చైతన్యం నింపిన గొప్ప యోధుడు అన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుండి అలాగే తన వంతుగా ఎండి జాంగిర్ కుటుంబానికి సహకారం అందిస్తామని తెలిపారు. ఉద్యమ సమయంలో ప్రస్తుత సమయంలో గజ్జెల శబ్దంలో గళమెత్తిన విప్లవ స్వరానికి జోహార్లు తెలిపారు. బడుగు బలహీన వర్గాల కన్నీళ్లను గీతలుగా మలిచిన మహానుభావుడికి నివాళులు తెలిపారు.తన గాత్రంతో ప్రజా సమస్యలను ప్రపంచానికి వినిపించిన మహోన్నత వ్యక్తిత్వానికి జోహార్లు,కళాకారుడిగా మాత్రమే కాదు, సమాజ మార్గదర్శిగా నిలిచిన మహానుభావుడికి,ఆయన స్వరం ఆగిపోయినా, ఆయన ఆలోచనలు చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు.

# ప్రధాని మోదీతో భేటీ: గర్వకారణం.. ఉత్తేజితం!
### తెలంగాణలో ఇంటింటికీ బీజేపీ: ప్రధాని స్ఫూర్తితో రెట్టింపు ఉత్సాహం

**హైదరాబాద్, మహా.:** దేశ ప్రధాని నరేంద్ర మోదీని కలవడం అనేది ఎప్పుడూ ఒక గర్వకారణం, ఉద్వేగభరితమైన క్షణం మాత్రమే కాకుండా, సరికొత్త ఉత్తేజాన్ని ఇచ్చే అద్భుత అనుభవమని కేంద్ర మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. ఢిల్లీలో ప్రధాని మోదీతో జరిగిన భేటీ పట్ల వారు అమితానందాన్ని వ్యక్తం చేశారు. ఈ సమావేశం కేవలం ఒక మర్యాదపూర్వక భేటీ మాత్రమే కాకుండా, దేశ సేవలో మరింత చురుగ్గా పాల్గొనేలా చేసే శక్తిని అందించిందని అభివర్ణించారు. ప్రధానిని కలిసిన ప్రతిసారీ దేశం పట్ల బాధ్యత మరింత పెరుగుతుందని, ఆయన చూపించే చొరవ ప్రతి ఒక్కరిలో స్ఫూర్తిని నింపుతుందని స్పష్టం చేశారు .ఈ సందర్భంగా కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ సాధించిన ఘన విజయంపై ప్రధాని మోదీ ప్రత్యేకంగా చర్చించారు. కరీంనగర్ గడ్డపై కమలం వికసించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం



చేస్తూ, క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసిన తీరును ప్రశంసించారు. స్థానిక ఎన్నికల్లో సాధించిన ఈ గెలుపు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా బీజేపీకి ఉన్న ప్రజాదరణకు నిదర్శనమని ఆయన అభిప్రాయపడ్డారు. గెలుపు కోసం శ్రమించిన నాయకులకు, కార్యకర్తలకు మోదీ అభినందనలు తెలియజేయడం పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది.ప్రధానితో గడిపిన ప్రతి నిమిషం మర్చిపోలేని అనుభూతిని మిగిల్చిందని నేతలు భావోద్వేగంగా పేర్కొన్నారు. మోదీ గారి నుంచి పొందిన శక్తితో దేశం మరియు రాష్ట్రం కోసం నిరంతరం పనిచేస్తామని వారు ఉద్ఘాటించారు. ఆయనను కలిసిన ప్రతిసారీ మరింత శక్తితో, లోతైన బాధ్యతాయుత భావనతో మరియు దేశానికి సేవ చేయాలనే దృఢ సంకల్పంతో తిరిగి వస్తామని వారు తమ మనోభావాలను పంచుకున్నారు. ప్రధాని సూచనలు భవిష్యత్తు కార్యాచరణకు దిశానిర్దేశం చేశాయని, ఆయన వ్యక్తిత్వం నుంచి నిత్యం కొత్త పాఠాలు నేర్చుకుంటున్నామని వెల్లడించారు.తెలంగాణలో బీజేపీ జైత్రయాత్రను కొనసాగించే దిశగా ప్రధాని మోదీ కీలక సూచనలు చేశారు. పార్టీ సిద్ధాంతాలను, కేంద్ర ప్రభుత్వ పథకాలను రాష్ట్రంలోని ప్రతి ఇంటికి చేరవేయాలని ఆయన పిలుపునిచ్చారు. మోదీ మాటలు తెలంగాణ కోసం మరింత కష్టపడి పనిచేయడానికి నిరంతర ప్రేరణగా నిలుస్తాయని నేతలు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో పార్టీ మిషన్‌ను జనాల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు సిద్ధమని, ప్రధాని ఆశయాలకు అనుగుణంగా తెలంగాణను అభివృద్ధి పథంలో నిలిపేందుకు శ్రమిస్తామని వారు ప్రతిన పూనారు.

# ఆన్ లైన్ ద్వారానే ఇసుక సరఫరా చేపట్టాలి
**జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**



**యాదాద్రి భువనగిరి, మహా:** ఇసుక సరఫరా పూర్తిగా ఆన్లైన్ ద్వారానే చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత అధికారులకు సూచించారు. గురువారం రోజు కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స హాలులో జిల్లాలో ఇసుక సరఫరా, వినియోగం తదితర అంశాలపై ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి తో కలిసి మైన్స్ శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సాండ్ కమిటీ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల అవసరాల కోసం మరియు ప్రభుత్వ అవసరాల కోసం అవసరమైన ఇసుక ను పూర్తి గా ఆన్లైన్ విధానం లోనే చేసుకొని పొందే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. .ఇసుక అక్రమ రవాణా ను అరికట్టేందుకు మ్యానువల్ విధానానికి స్వస్తి పలుకుతూ జిల్లా లో పూర్తిగా ఆన్లైన్ ద్వారా ఇసుక రవాణా జరిగేలా మన ఇసుక వాహనం ఆన్లైన్ బుకింగ్ విధానాన్ని అమలు చేయడం జరుగుతోందన్నారు. దీనివల్ల ఇసుక అక్రమ రవాణాకు ఆస్కారం ఉండదని అన్నారు. ఇసుక రీచ్‌ల వద్ద నియమ నిబంధనలు కచ్చితంగా పాటించడంతో పాటు అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టాలని ఆదేశించారు.ప్రజలకు పారదర్శకంగా ఇసుక అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. అలాగే, ఆన్లైన్ బుకింగ్ వ్యవస్థను సమర్థవంతంగా అమలు చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు.ఇసుక నిర్వహణను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని పేర్కొన్నారు. మండల తాసిల్దార్లు, గ్రామపంచాయతీ అధికారులు ఆన్లైన్ ద్వారా ఇసుకను బుక్ చేసుకోవాలని గ్రామ ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.ఈ సమావేశంలో రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణా రెడ్డి, శేఖర్ రెడ్డి,అసిస్టెంట్ డైరెక్టర్ మైనింగ్ రవికుమార్, జిల్లా పంచాయతీ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి, ట్రాన్స్పోర్ట్ అధికారి సాయి కృష్ణ,సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బీజేపీ శిక్షణ మహా అభియాన్‌పై ఢిల్లీలో కీలక సమీక్ష
### జాతీయ నేతల ఆధ్వర్యంలో శిక్షణ శిబిరాలపై కసరత్తు




**ఢిల్లీ, మహా:** భారతీయ జనతా పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత పటిష్టం చేసే లక్ష్యంతో చేపట్టిన 'పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్-2026'పై దేశ రాజధాని ఢిల్లీలో గురువారం రాత్రి కీలక సమీక్షా సమావేశం జరిగింది. ఢిల్లీలోని పార్టీ జాతీయ ప్రధాన కార్యాలయంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు శ్రీ నితిన్ నబిన్ గారి అధ్యక్షతన ఈ ఉన్నత స్థాయి భేటీ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులకు రాజకీయ, సామాజిక అంశాలపై అవగాహన కల్పించేందుకు ఉద్దేశించిన ఈ శిక్షణ కార్యక్రమాల పురోగతిని నేతలు క్షుణ్ణంగా పరిశీలించారు. రాబోయే కాలంలో ఈ అభియాన్‌ను మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై సుదీర్ఘంగా చర్చించారు.ఈ అత్యున్నత స్థాయి సమావేశంలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) శ్రీ బీఎల్ సంతోష్ జీ, జాతీయ సంయుక్త ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) శ్రీ శివప్రకాష్ జీ, జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీ తరుణ్ చుగ్ జీ పాల్గొన్నారు. ఈ ప్రతిష్టాత్మక శిక్షణ కార్యక్రమ రూపకల్పన, అమలులో జాతీయ నేతలు పలు కీలక సూచనలు చేశారు. శిక్షణ శిబిరాల ద్వారా కార్యకర్తల్లో సిద్ధాంతపరమైన స్పష్టతను పెంపొందించడమే కాకుండా, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా వారిని తీర్చిదిద్దాలని నిర్ణయించారు. పార్టీ అంతర్గత బలోపేతానికి ఈ ప్రశిక్షణ మహా అభియాన్ ఒక మైలురాయిగా నిలవాలని ఈ సందర్భంగా నేతలు ఆకాంక్షించారు.ఈ సమీక్షా సమావేశంలో తెలంగాణ రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షులు మరియు ఈ అభియాన్ రాష్ట్ర సమన్వయకర్త డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు జాతీయ ప్రశిక్షణ బృందంతో కలిసి పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సాగుతున్న శిక్షణ కార్యక్రమాల పురోగతిని, ఇప్పటివరకు సాధించిన ఫలితాలను ఆయన జాతీయ నాయకత్వానికి వివరించారు. రాబోయే దశల్లో శిక్షణ కార్యక్రమాలను మరింత ప్రభావవంతంగా ఎలా నిర్వహించాలనే అంశంపై జాతీయ బృందంతో కలిసి ఆయన సుదీర్ఘంగా చర్చించారు. కార్యకర్తలకు సమకాలీన రాజకీయాలపై అవగాహన కల్పించడంతో పాటు పార్టీ సిద్ధాంతాలను మరింత లోతుగా వివరించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. జాతీయ నాయకత్వం అందించిన సూచనలతో పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం నింపేలా తదుపరి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఈ ప్రశిక్షణ శిబిరాల ద్వారా తయారయ్యే కార్యకర్తలే భవిష్యత్తులో పార్టీ విజయకేతనానికి పునాదులు వేస్తారని ఈ సందర్భంగా నేతలు స్పష్టం చేశారు. సమావేశంలో జాతీయ స్థాయి శిక్షణ బృంద సభ్యులు ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు.



## మేడ్చల్ జిల్లా డిసిసి ప్రధాన కార్యదర్శిగా ఆర్మీ రాజన్న
### ఆదేశాలు జారీ చేసిన పీసీసీ చీఫ్

**కుషాయిగూడ, మహా :** మేడ్చల్ జిల్లా డిసిసి ప్రధాన కార్యదర్శిగా పాకాల రాజన్న అలియాస్ ఆర్మీ రాజన్నను నియమిస్తూ పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ గురువారం ఆదేశాలు జారీ చేశారు ఆర్మీ రాజన్న గత 25 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా కొనసాగుతున్నారు ఏఎస్ రావు నగర్ డివిజన్ లోని జమ్మిగడ్డ మురికివాడ చెందిన ఆర్మీ రాజన్న గతంలో సిపిఐ మావోయిస్టు పార్టీ జంట నగరాల ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు పార్టీ నుండి బయటికి వచ్చినాక కాంగ్రెస్ పార్టీలో చేరారు. తాను పార్టీ ఎదుగుదలకు పని ఒక సైనికులు లాగా పనిచేస్తానని మీడియాకు తెలిపారు తన పదవికి రావడానికి కృషి చేసిన ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మందమల్ల పరమేశ్వర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావని మణిపాల్ రెడ్డి, ఏఎస్ రావు నగర్ డివిజన్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఘనంగా హనుమాన్ జయంతి పూజ
**పాల్గొన్న మందమల్ల పరమేశ్వర్ రెడ్డి**



**కుషాయిగూడ, మహా :** హనుమాన్ జయంతి సందర్భంగా హబ్సిగూడ ఎన్‌జీఆర్ఐ అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆంజనేయ స్వామి ఆశీస్సులు ఉప్పల్ నియోజకవర్గ ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు. శ్రీ ఆంజనేయుడు ప్రపంచానికే స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ వెంకన్న, పాండు గౌడ్, అంజయ్య గుప్తా, అంజనేయులు, దేవి రెడ్డి, రఘునాథ్ రెడ్డి, మదన్ గౌడ్, నర్సింగ్, కిషన్ నాయక్, సంతోష్ కుమార్, రాఘవేందర్, భీమ్ సేన్, శ్రీకాంత్ యాదవ్, శేఖర్ రెడ్డి, మురళీకృష్ణ రెడ్డి, సచిన్, చింటు తదితరులు పాల్గొన్నారు.

# చలివేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే



**కుషాయిగూడ, మహా :** కుషాయిగూడ డివిజన్ పరిధిలోని పోచమ్మ గుడి ఎదురుగా ఉన్న శ్రీ సాయి రేడియేటర్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఉప్పల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో ప్రజలకు తాగునీటి సదుపాయం కల్పించడం ఎంతో అవసరమని, ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఉపయోగకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో దోమ శ్రీనివాస్ రెడ్డి, కట్కూరి విజయ్ కుమార్ రెడ్డి, ధర్మారెడ్డి, వెంకట్ రెడ్డి, నరసింహారెడ్డి, శివారెడ్డి, అర్జున్, నాని, నరేష్, తేజ, రామ్, బీఆర్ఎస్ నేతలు నెమూరి మహేష్ గౌడ్ పాండాల శివకుమార్ గౌడ్ ఆలేటి మైపాల్ రెడ్డి రాఘవరెడ్డి సప్పిడి శ్రీనివాస్ రెడ్డి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# ట్రెండింగ్‌లో లేడీ డైరెక్టర్..
## ఓయ్ హీరోయిన్‌లా ఉందంటూ వైరల్.. ఎవరీ మానస?


గత రెండు రోజులుగా సోషల్ మీడియా మొత్తం తనే ఉంది. చూడటానికి అమాయకంగా, సాంప్రదాయంగా కనిపిస్తూ తెగ వైరలవుతోంది. ఆ తను మరెవరో కాదు రాకాస దర్శకురాలు మానస శర్మ. చూడటానికి ఓయ్ సినిమా హీరోయిన్ షామిలికి చెల్లెలిగా కనిపిస్తున్న ఈవిడ గురించి నెటిజన్లు తెగ ఆరా తీస్తున్నారు. కాబట్టి ఆమె ఎవరు? ఇంతకు ముందు ఏం చేసింది? అనేది ఓసారి చూసేద్దాం..

### రచయితగా

మానస శర్మది శ్రీకాకుళం.. యూట్యూబ్‌లో మ్యాడ్ హౌస్ అనే మినీ సిరీస్‌కు డైలాగ్స్ రాసింది. తర్వాత ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ వెబ్ సిరీస్‌కు రచయితగా పని చేసింది. ఈ రెండింటికీ మెగా డాటర్ నిహారిక కొణిదెలయే నిర్మాతగా వ్యవహరించింది. అలా నిహారిక దృష్టిలో పడింది. 2024లో సోనీ లివ్‌లో వచ్చిన బెంచ్ లైఫ్ వెబ్ సిరీస్‌తో దర్శకురాలిగా మారింది. తర్వాత మరోసారి నిహారికతో కలిసి పని చేసే అవకాశం వచ్చింది. ఆమె నిర్మించిన రాకాస చిత్రంతో వెండితెరకు డైరెక్టర్‌గా పరిచయం కాబోతోంది.

### ట్రెండింగ్‌లో డైరెక్టర్

రాకాస మూవీ ఏప్రిల్ 3న విడుదల కానుంది. ఈ చిత్ర ప్రమోషన్స్‌లో హీరో సంగీత్ శోభన్, హీరోయిన్ నయన్ సారిక కన్నా దర్శకురాలు మానసయే ఎక్కువ హైలైట్ అవుతోంది. మాట్లాడేది తక్కువే అయినా అమాయకత్వం, సింపుల్ స్మైల్‌తో ఒక్కసారిగా ట్రెండింగ్‌లో వచ్చింది. ఓయ్ హీరోయిన్‌లా కనిపించినప్పటికీ ఆమెకు, మానసకు ఎటువంటి సంబంధం లేదు. ఇకపోతే జనాలు గుర్తుపెట్టుకునేలా, వారికి నచ్చేలా సినిమాలు తీయాలనుకుంటుంది మానస. మరి ఆమె రాకాసతో ఎలాంటి విజయం అందుకుంటుందో చూడాలి!



### లైంగిక వేధింపుల కేసు..
## మలయాళ డైరెక్టర్‌కు షాక్..!

లైంగిక వేధింపుల కేసులో అరెస్టయిన మలయాళ డైరెక్టర్ రంజిత్ బాలకృష్ణన్‌కు కేరళ ఫిల్మ్ ఫెడరేషన్ షాకిచ్చింది. తక్షణమే ఆయనను ఫిల్మ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ కేరళ (FEFKA) నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయాన్ని ఫిల్మ్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి బి. ఉన్నికృష్ణన్ వెల్లడించారు. ఈ కేసులో అంతర్గత విచారణ పూర్తి చేసే వరకు ఈ సస్పెన్షన్ కొనసాగుతుందని ఆయన తెలిపారు. తమ సభ్యులపై లైంగిక ఆరోపణలు వచ్చిన కేసులలో ఫెడరేషన్ ఒక ప్రామాణిక విధానాన్ని అనుసరిస్తుందని ఉన్నికృష్ణన్ పేర్కొన్నారు. కాగా.. కొచ్చిలోని ఒక సినిమా షూటింగ్ ప్రదేశంలో తనపై క్యారవాన్ లోపల లైంగిక వేధింపులకు పాల్పడ్డారని ఒక యువ నటి పోలీసులకు ఫిర్యాదు చేసింది. జనవరి 30న షూటింగ్ సెట్‌లో తనపై లైంగిక దాడికి ప్రయత్నించాడని ఆ నటి ఆరోపించింది. దీంతో ఆయనను కొచ్చి పోలీసులు అరెస్టు చేశారు. కొన్ని రోజుల క్రితం నటి ఫిర్యాదు చేయగా.. ఎర్నాకులం మహిళా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. రంజిత్‌ను మేజిస్ట్రేట్ ముందు హాజరుపరిచగా.. 14రోజుల రిమాండ్ విధించారు. అతను ప్రస్తుతం ఎర్నాకులం సబ్ జైలులో ఉన్నాడు.

# దురంధర్-2 కోసం స్టార్ హీరో త్యాగం..!

బాలీవుడ్ స్టార్ హీరో అక్షయ్ కుమార్ తాజా చిత్రాన్ని మేకర్స్ వాయిదా వేశారు. ఈనెల 10న రిలీజ్ కావాల్సిన హారర్‌కామెడీ చిత్రం భూత్ బంగ్లాను పోస్ట్‌పోన్ చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈ మూవీ పెయిడ్ ప్రీమియర్స్ ఈ నెల 16 నుంచి ప్రారంభమవుతాయని వెల్లడించారు. ప్రస్తుతం దురంధర్ ది రివెంజ్ బాక్సాఫీస్ వద్ద సందడి చేస్తోంది. అందుకే భూత్ బంగ్లాను ఓ వారం రోజుల పాటు వాయిదా వేస్తున్నామని నిర్మాతలు ప్రకటించారు. డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్ల నుంచి వచ్చిన అభ్యర్థనల వల్లే వారం రోజులు వాయిదా వేయాలని నిర్ణయం తీసుకున్నట్లు నిర్మాత ఏక్తా కపూర్ అధికారిక ప్రకటనలో తెలిపారు. ప్రేక్షకులకు మెరుగైన సినిమా అనుభవాన్ని అందించడం.. థియేటర్లలో సినిమా విజయవంతంగా రన్ అయ్యేందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని ఆమె అన్నారు. 'ధురందర్: ది రివెంజ్' చిత్రానికి మరింత సమయాన్ని ఇవ్వడం వల్ల పరిశ్రమకు ప్రయోజనం చేకూరుతుందని ఎగ్జిబిటర్లు భావించారు. కాగా.. భూత్ బంగ్లా చిత్రాన్ని బాలాజీ మోషన్ పిక్చర్స్, కేప్ ఆఫ్ గుడ్ ఫిల్మ్స్ బ్యానర్లపై నిర్మించారు. ఈ చిత్రానికి ప్రియదర్శన్ దర్శకత్వం వహించగా.. అక్షయ్ కుమార్, శోభా కపూర్, ఏక్తా ఆర్ కపూర్ నిర్మించారు. ఈ చిత్రంలో వామికా గబ్బి, పరేష్ రావల్, టబు, రాజ్‌పాల్ యాదవ్, జిషు సేన్‌గుప్తా, మిథిలా పాల్కర్ కీలక పాత్రల్లో నటించారు.



## మా ఇంట్లో జరిగిన విశేషం..
### నా పూర్వజన్మ సుకృతం: చిరంజీవి



మెగాస్టార్ చిరంజీవి.. ఆంజనేయ స్వామికి పరమభక్తుడు. గురువారం (ఏప్రిల్ 2న) హనుమాన్ జయంతి సందర్భంగా ఓ స్పెషల్ వీడియో సోషల్ మీడియాలో షేర్ చేశారు. తన ఇంట్లోని పూజా మందిరంలో సూర్యభగవానుడి కిరణాలు హనుమంతుడి విగ్రహాన్ని తాకాయంటూ సంతోషం వ్యక్తం చేశారు.

**ప్రతి ఏడాది..**

శ్రీ హనుమాన్ జయంతి సందర్భంగా మా పూజా మందిరంలో జరిగిన ఓ విశేషాన్ని మీతో పంచుకోవాలని ఈ వీడియో చేస్తున్నాను. ప్రతి సంవత్సరం డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి నెలల్లో సూర్యకిరణాలు సప్తవర్ణాలుగా మారి మా పూజామందిరంలో ఉన్న హనుమంతుడిని పై నుంచి కిందివరకు స్పృశిస్తూ ప్రసరించడం చూస్తుంటే ఆ దృశ్యం, ఆ అనుభూతి మాటల్లో చెప్పలేను.

**పూర్వజన్మ సుకృతం**

ఇటీవల అయోధ్యలో బాలరాముడి నుదుటిపై సూర్య కాంతి ప్రసరించి మెరుస్తున్న అద్భుతాన్ని చూశాం. అలాగే కోణార్క్, అరసవెల్లి దేవాలయాల్లో సూర్య కిరణాలు భగవంతుడిని తాకే విశేషం అందరికీ తెలిసిందే! అలాంటి దైవానుభూతి.. మా ఇంట్లో ఆంజనేయుడిని స్పృశించడం మా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాం. అందరికీ హనుమాన్ జయంతి శుభాకాంక్షలు అని పేర్కొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com